ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 232 | విజయవాడ, మంగళవారం 22 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00



అమెరికాలో ఒక శతాబ్దం తర్వాత వచ్చిన సంపూర్ణ సూర్యగ్రహణాన్ని ప్రజలు వేడుకలా వీక్షించారు. ఆరెగాన్‌లోని ఓచోకో జాతీయ అటవీ ప్రాంతంలో అమెరికన్ మూల వాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాంప్రదాయ పద్ధతుల్లో చేతులు చాచి ప్రార్థనలు చేశారు. మరిన్ని చిత్రాలు 3వ పేజీలో

ఒక్కటైన రెండాకులు

తమిళనాడు డిప్యూటీ సింగా పన్నీర్ సెల్వం, శశికళ ఉద్వాసనకు చర్యలు

చెన్నయ్ : తమిళనాడు మాజీ ముఖ్య మంత్రి జయలలిత మరణానంతరం చీలి పోయిన అన్నా డిఎంకె ఆర్నెల్ల విరామం అనంతరం తిరిగి ఐక్యమయింది. అప్పటి పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళ వర్గానికి, జయ అనంతరం ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ఒ పన్నీర్ సెల్వం వర్గానికి అధికారం కోసం జరిగిన పోరు కారణంగా గత ఫిబ్రవరిలో పార్టీ రెండు ముక్కలుగా విడిపోయిన విషయం తెలిసిందే. ఈ మధ్య కాలంలో శశికళ, తన బంధువు ఇళవరసితో కలిసి అక్రమాస్తుల కేసులో జైలుకెళ్లిన సమయంలో ఆమె మేనల్లుడు దినకరన్ పార్టీపై పెత్తనం చెలాయించేందుకు ప్రయ త్నించటంతో దానిని వ్యతిరేకించిన ముఖ్య మంత్రి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం చేరువయ్యేందుకు ప్రయత్నిం చారు. వరుస చర్చలు జరిపిన అనంతరం శశికళను పార్టీకి దూరంగా వుంచేందుకు పళనిస్వామి వర్గం అంగీకరించటంతో ఇరు వర్గాలు సోమవారం నాడు అధికారికంగా విలీనమయ్యాయి. ఇరువురి మధ్య కుదిరిన అంగీకారం ప్రకారం ముఖ్యమంత్రిగా పళని స్వామి కొనసాగుతుండగా, మిగతా 8లో




పళని స్వామి, పన్నీరు సెల్వం చేతులు కలుపుతున్న గవర్నర్ విద్యాసాగర్‌రావు

నీటి సమస్య జటిలమే

టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో జలాశయాలు నిండనందున నీటి సమస్య తీవ్రంగా ఉందని, వర్షపాతం కూడా సాధారణం కన్నా 5.5 శాతం లోటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే పంట కుంటలు పూర్తి చేసి, పడిన వర్షపు నీటిని కాపాడుకోవడమే మార్గమని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి తన నివాసం నుండి సోమవారం ఉదయం నీరు–ప్రగతి, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి అంశాలపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎగువ రాష్ట్రాల నుండి కృష్ణా నదిలోకి నీరు చేరలేదని, రాష్ట్రంలోని వర్షాల వల్ల కొంత ఊరట ఉన్నా, సమస్యగానే ఉందని సిఎం వివరించారు. నీరు–ప్రగతి కార్యక్రమంతో వర్షపు నీటిని పంట కుంటల్లోకి ఇంకింపజేయడం వల్ల, గతేడాది కన్నా రాష్ట్రంలో 1.38 మీటర్లు భూగర్భ జలాలు పెరిగాయని సిఎం తెలిపారు. రాయలసీమలో భూగర్భజల మట్టాలు మరింత పెరగాల్సిన అవసరముందన్నారు. ఉపాధి హామీ నిధులు రాష్ట్రానికి రాకుండా అడ్డుకోవాలని కొందరు కేంద్రానికి లేఖ రాశారని తెలిపారు. అయితే రాష్ట్రంలో 22 వేల పంట కుంటల్లో నీటిని నిల్వ చేయడం ఆనందంగా ఉందని, 698 సెలయేరుల అభివృద్ధి పూర్తయిందని, మిగతా 9లో

ప్రచార పర్వం ముగిసింది

- నంద్యాలలో చివరి ప్రయత్నాల జోరు
- పోటాపోటీగా పార్టీల నిఘా
- రేపే పోలింగ్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలో ప్రచార పర్వం ముగిసింది. హోరెత్తించిన మైకులు మూగబోయాయి. నేతల హడావిడి తగ్గింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బయట ప్రాంతాల నుండి వచ్చిన నేతలు నంద్యాల వీడారు. 13 రోజుల పాటు నంద్యాలలోనే మకాం వేసి విస్తృతంగా ప్రచారం చేసిన వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి సోమవారం సాయంత్రం గాంధీ చౌక్‌లో నిర్వహించిన చివరి ప్రచార సభలో పాల్గొని నంద్యాల నుండి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుండి నంద్యాలలోనే బసచేసిన పలువురు అధికార పార్టీ నేతలు, డజనుమందికిపైగా రాష్ట్ర మంత్రులు కూడా సొంత జిల్లాలకు ప్రయాణమైనారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆదివారం నాడే ప్రచారాన్ని ముగించిన విషయం తెలిసిందే. అయితే, టిడిపి నేతలు కర్నూలు జిల్లాను విడిచి వెళ్లలేదని వైసిపి ఆరోపిం చింది. ప్రచార సమయం ముగిసిన తరు వాత కూడా భూమా అఖిలప్రియ ఓట్లు అభ్య ర్థించారని పేర్కొంది. ఈ మిగతా 9లో

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

భన్వర్‌లాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన నిబంధనలు ఉల్లం ఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఎవరైనా ఓట ర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తే



కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని మొత్తం 16 తెలుగు న్యూస్ ఛానళ్లపై నిఘా మిగతా 9లో

నేడు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

- 10 లక్షల మంది ఆందోళనబాట
- జయప్రదం చేయండి యుఎఫ్‌బియు

ప్రజాశక్తి–బిజినెస్ బ్యూరో/అమరావతి బ్యూరో

వినాశకర బ్యాంకింగ్ సంస్కరణలపై బ్యాంకు ఉద్యోగులు సమర శంఖం పూరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్మును కాపాడేందుకు, వాటిని పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల పరం చేసేందుకు సాగుతున్న యత్నాలను తిప్పికొట్టేందుకు ఈనెల 22న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. కార్పొరేట్ సంస్థల నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎలు)ను రద్దు చేయటం, వివిధ సేవలపై బ్యాంకు ఛార్జీలను విపరీతంగా పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ ఆందోళనకు దిగుతున్నారు. వీటికి తోడు ప్రభుత్వ రంగంలోని బ్యాంకులను ప్రయివేటీ కరించేందుకు ఉద్దేశించిన మిగతా 9లో

నెలాఖరులో జలసిరికి హారతి

ప్రజలను భాగస్వాములను చేయాలి

2

'ఉత్తపోతల' పథకం



దేవీపట్నం మండలం గండికోట వద్ద నీరు రాక వెలవెలబోతున్న పురుషోత్తపట్నం ఎత్తిపోతల డిశ్చార్జింగ్ పాయింట్

- పురుషోత్తపట్నం నుంచి రాని నీరు
- సిఎం ప్రారంభించి వారం
- పూర్తికాని తొలిదశ పనులు

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం ప్రతినిధి

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం 'ఉత్తపోతల పథకం'లా మారింది. తొలిదశ పనులు పూర్తి కాకుండానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంద్రాగస్టున ఈ పథకాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేసినట్లు ప్రకటించారు. దీన్ని ప్రారంభించి వారం రోజులు గడిచినా ఇంతవరకూ చుక్కనీరు రాలేదు.

తూర్పుగోదావరి జిల్లాలోని పురుషోత్తపట్నం పనులను ఈనెల 7న సిఎం పరిశీలించారు. అప్పటికీ ఒక్క మోటారు కూడా ఏర్పాటు చేయలేదు. తొలిదశ పనులు పూర్తి కాకపోయినా ఈ ఎత్తిపోతల పథకం ద్వారా దేవీపట్నం మండలం గండికోట ప్రెజర్‌మెయిన్ వరకూ 3,500 క్యూసెక్కుల నీటిని పైపుల ద్వారా తీసుకెళ్తామని చెప్పుకొచ్చారు. గండికోట నుంచి 50 కిలోమీటర్లు పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటిని తీసుకెళ్లి 1,400 క్యూసెక్కుల నీటిని ఏలేరుకు అందిస్తామన్నారు. ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడంతో జలవనరులశాఖ అధికారులు గండికోట నుంచి పోలవరం కాలువ ద్వారా కాకుండా పుష్కర ఎత్తిపోతల కాలువ ద్వారా ఏలేరుకు నీటిని పంపేందుకు సన్నాహాలు చేశారు. పనులు పూర్తి కాకుండానే సిఎం చంద్రబాబు ఈనెల 15న ఈ పథకాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. మోటార్లు తిరిగినప్పటికీ, గోదావరి నుంచి నీటిని తోడలేకపోయారు. నీరు వచ్చేందుకు కొంత సమయం పడుతుందని అధికారులు చెప్పుకొచ్చారు. పురుషోత్తపట్నం నుంచి పైపుల ద్వారా గండికోట ప్రాంతంలోని ప్రెజర్ మెయిన్‌కు చేరాల్సిన నీరు సోమవారం నాటికీ అందలేదు. ఈ పథకం ఫేజ్–1తో పాటు ఫేజ్–2లో మూడుచోట్ల పనులు జరగాల్సి ఉంది. పోలవరం ఎడమకాలువపై అనేక వంతెనలు నిర్మించాల్సి ఉంది. గండికోట వద్ద నీటి డిశ్చార్జింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. గండికోట నుంచి పుష్కర కాలువ ద్వారా ఏలేరుకు మిగతా 9లో



తెలుగు ప్రజలు కలిసుండాలి

- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- హైదరాబాద్‌లో పౌర సన్మానం

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

రెండు రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగువారంతా ఒక్కటేనని, తెలుగు ప్రజలు కలిసుండి అభివృద్ధిలో పోటీ పడాలని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు సూచించారు. ఉప రాష్ట్రపతి గా ఎన్నికై తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చిన వెంకయ్యనాయుడుకు ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్, తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు, కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ సహా తెలంగాణ రాష్ట్ర కేబినెట్ మొత్తం సోమవారం ఘనంగా స్వాగతం పలి కింది. అనంతరం ఆయనకు రాజ్‌భవన్ లో పౌర సన్మానం నిర్వహించారు. రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల అభివద్ధికి తాను కషి చేస్తూనే ఉంటానని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆకలి, అవినీతి, అక్రమాలకు తావులేని దేశాన్ని మనం నిర్మించుకోవాలని మిగతా 9లో

మన్యంలో జ్వరాలు

తాంగులగుడలో మంచం పట్టిన 24 మంది గిరిజనులు



ప్రజాశక్తి–అరకు రూరల్ (విశాఖ)

విశాఖ జిల్లా అరకు మండలంలోని సిఎం చంద్రబాబు దత్తత పంచాయతీ పరిధిలోని పెదలబుడు తాంగులగుడ గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ గ్రామంలో జ్వరాలతో 24 మంది మంచం పట్టారు. ఒకే కుటుంబానికి చెందిన బురిడి జిన్ను (28), బురిడి సద్దు (60), పొర్తిమ (30), లక్ష్మి (8), కృష్ణ (5), సుశీల (4) జ్వరాలతో బాధపడుతున్నారు. అలాగే తాంగుల మొద్దు (60), రొయిల (57), సహదేవ్ (25), జమున (50), మొత్తి (30), లింగ (59), సుమిత్ర (28), దాలిమ్మ, మొత్తి, కిల్లో చంద్రమ్మ, తాంగుల భారతి, పరమేశ్వరి, టి.పద్మ, బురిడి సుశాంత్, లలిత, తాంగుల జానకి, పాంగి లక్ష్మి, గుత్తి తదితరులు కూడా వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ గ్రామంలో కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ బురద నీరు వస్తోంది. ఆ నీరు తాగలేక ఊట గెడ్డ నీటిని తెచ్చుకొని తాగుతున్నారు. దీనికి తోడు డ్రెయినేజీలు లేవు. మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటుంది. దీంతో స్థానికులు జ్వరాల బారిన పడ్డారు.

వారం రోజులుగా గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నా వైద్య సిబ్బంది గ్రామాన్ని సందర్శించలేదు. రోగులు కూడా వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రికి పోలేదు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి టి.హరి డిమాండ్ చేశారు.

గలగల గోదారి



ఎగువ ప్రాంతాల్లోని వర్షాలకు గోదావరి ఉరకలేస్తోంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో బ్యారేజీకి చెందిన 175 గేట్లను 0.50 మీటర్ల మేర ఎత్తి, మూడు లక్షల క్యూసెకుల చొప్పున నీటిని సముద్రంలోకి వదులుతున్నారు.

ప్రజ్ఞ

1. బాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్ షిప్‌కు ఆతిథ్యమిస్తున్న దేశం ఏది?
2. రష్యాలో జరిగే ఫిఫా ప్రపంచ కప్ కోసం 'గో మారడోనియా' డాక్యుమెంటరీని రూపొందించిన తెలుగు తేజం ఎవరు?
3. టి-90 యుద్ధ విమానాలను భారత్ ఏ దేశం నుంచి దిగుమతి చేసుకుంది?
4. ప్రభుత్వ శాఖల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఏది?
5. బంగ్లాదేశ్ ప్రధాని హసీనాపై హత్యకు యత్నించినందుకు ఏ సంస్థకు చెందిన ఉగ్రవాదులకు మరణ శిక్ష ఖరారైంది?

సమాధానాలు 7లో

'కారుణ్య' పరిహారం పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగాలలో కారుణ్య నియామకాలు వద్దు అనుకొనేవారికి ఇచ్చే పరిహారాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా నాలుగో తరగతి ఉద్యోగుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలు, ఎన్జీవోల కుటుంబాలకు ఎనిమిది లక్షలు, గెజిటెడ్ అధికారుల కుటుంబాలకు పది లక్షలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు నాలుగో తరగతి ఉద్యోగుల కుటుంబాలకు 40 వేలు రూపాయలు, ఎన్జీవోలకు 60 వేలు, గెజిటెడ్ అధికారులకు 80 వేల చొప్పున ఇచ్చేవారు. అయితే ఇది ఎంతమాత్రం చాలదని, ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉద్యోగ సంఘాలు పలు పర్యాయాలు ప్రభుత్వానికి విన్నవించుకున్నాయి. దీంతో ప్రభుత్వం కారుణ్య నియామకాలకు అవకాశం లేని కుటుంబాలకు పరిహారాన్ని పెంచాలని నిర్ణయించింది.

బైపిసి విద్యార్థులకు నేడు తుది విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎంసెట్ బైపిసి విభాగం విద్యార్థులకు రెండో దశ కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించిన మొదటి దశ కౌన్సెలింగ్‌లో 151 సీట్లు మిగిలాయి. మొత్తం 66,623 మంది అర్హత సాధించారు. బయోటెక్, బి-ఫార్మసి, ఫార్మా-డి తదితర కోర్సుల్లో కన్వీనర్ విభాగంలో మొత్తం 8,014 సీట్లు అందుబాటులో ఉన్నాయి, మొదటి దశ కౌన్సెలింగ్‌లో 7,863 సీట్లు భర్తీ అయ్యాయి. తుది దశగా ఈనెల 22, 23, 24 తేదీల్లో సర్టిఫికేట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల ఎంపిక ఉంటుంది. ఈనెల 25న ఎపి ఎంసెట్ కన్వీనర్ సీట్లు కేటాయిస్తారు.

ఆర్టీసిలో వనిత కార్డు ప్రాధాన్యతా పక్షోత్సవాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్టీసిలో వనిత ఫ్యామిలీ కార్డు ప్రాధాన్యతా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసి ఎండి ఎం మాలకొండయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనిత కార్డు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, అధిక సంఖ్యలో వనిత కార్డుల విక్రయాలు జరిగేలా చూసేందుకు ఈ నెల 17న ప్రారంభమైన పక్షోత్సవాలు ఈనెల 31 వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబ సభ్యులందరికీ రూ.100 చెల్లిస్తే, వారంతా రెండేళ్ల పాటు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 10 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యులతో కాకుండా వ్యక్తిగతంగా ప్రయాణించదలచుకున్న వారు రూ.20 చెల్లించి యాడ్ ఆన్ కార్డును కూడా తీసుకోవచ్చని పేర్కొన్నారు.

హైకోర్టులో 'నంద్యాల' హోరు

ప్రజాశక్తి - హైదరాబాద్

నంద్యాల ఉప ఎన్నికల్లో అధికార పార్టీ ఓటర్లను బెదిరిస్తోందని తమకు ఫిర్యాదు అందినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది హైకోర్టుకు చెప్పారు. హైకోర్టు డివిజన్ బెంచ్ స్పందిస్తూ, ఇవి ఎన్నికల అక్రమాలేనని, వీటిపై ఇసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది.

- 48 గంటలే వ్యవధి ఉన్నందున ఎన్నికల సర్వేల ప్రచురణ, ప్రసారాలపై నిషేధంపై జోక్యం చేసుకోబోమని హైకోర్టు స్పష్టం చేసింది. సర్వేలను నిషేధిస్తూ ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను నిలుపుదల చేయలేమని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ తేల్చి చెప్పింది. స్పార్క్ అనే స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంబాబు హైకోర్టులో ఈ వ్యాజ్యం దాఖలు చేశారు.
- నంద్యాల ఉప ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ అండదండలతో పోలీసులు తమను బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ వైసిపి పోలింగ్ ఏజెంట్లు దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టనుంది. వైసిపికి చెందిన పోలింగ్ ఏజెంట్లు విజయశేఖర్‌రెడ్డి, మరో 40 మంది రిట్లు దాఖలు చేశారు.

కారెం నియామకంపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

ప్రజాశక్తి -హైదరాబాద్

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌గా కారెం శివాజీ నియామకాన్ని సవాల్ చేసిన కేసులో ప్రభుత్వం తమ వాదనను తెలియజేయాలని హైకోర్టు న్యాయమూర్తి చల్లా కోదండరామ్ ఏపి సర్కార్‌ను ఆదేశించారు. కమిషన్ ఛైర్మన్‌గా శివాజీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మరో వ్యాజ్యాన్ని హైకోర్టు సోమవారం విచారించింది. కారెం శివాజీ నియామకం చట్ట వ్యతిరేకమని, ఆ నియామకాన్ని రద్దు చేయాలంటూ విశాఖపట్నం జిల్లాకు చెందిన కె.రాజారావు పిటీషన్ దాఖలు చేశారు.

నెలాఖరులో 'జలసిరికి హారతి'

- ప్రజలను భాగస్వామ్యం చేయాలి
- పోలవరం సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'జలసిరికి హారతి' పేరుతో ఈ నెలాఖరులో ప్రత్యేక కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. నదులు, నీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెక్‌డ్యామ్‌లు, చెరువులు, వాగులు, పంటకుంటల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇందులో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం జరిగినన్ని రోజులూ ఆయా ప్రాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. పోలవరంతోపాటు 28 ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతిపై సచివాలయంలో సిఎం చంద్రబాబు జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. తొలుత పోలవరం పనులపై వర్చువల్ ఇన్‌స్పెక్షన్ చేశారు. గడచిన వారంలో 1.88 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకం పనులు, 17,345 క్యూబిక్ మీటర్ల వరకు స్పిల్ వే, స్టిల్లింగ్ బేసిన్ పనులు పూర్తయినట్టు ఈ సందర్భంగా అధికారులు సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి తవ్వకం పనులతో పాటు కాంక్రీట్ పనుల వేగాన్ని పెంచాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, నిధుల వినియోగం, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులకు సంబంధించి వివరాలతో నెలనెలా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు 28 ప్రాజెక్టుల్ని ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ సెప్టెంబర్ నెలాఖరుకు, నెల్లూరు-సంగం బ్యారేజ్‌లు అక్టోబర్ నాటికి, గండికోట రిజర్వాయర్- సిద్ధాపురం ఎత్తిపోతల పథకాలను సెప్టెంబర్ మొదటి వారానికల్లా పూర్తి చేయాలని సిఎం సూచించారు. శారదా నదిపై ఆనకట్ట నిర్మాణం పూర్తికావడంతో అక్కడ జలసిరికి హారతి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. భూగర్భ జలాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కొత్త వ్యవసాయ పంపుసెట్లు మంజూరు చేయాలని ఆదేశించారు.



సిఎం సమక్షంలో ఏపిఎస్‌డిసితో ఒప్పందం చేసుకున్న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులు

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో నైపుణ్య శిక్షణ

- గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం
- సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణిచ్చేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ముందుకొచ్చింది. అందుకు ఈ ఏడాది రూ 5 కోట్లు ఆర్థిక సహకారాన్ని అందిస్తామని తెలిపింది. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆ కార్పొరేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద తమ సంస్థ చేపట్టిన వివిధ కార్యక్రమాలపై వారు సిఎంతో చర్చించారు. గతేడాది రూ 178 కోట్లతో రాష్ట్రంలోని 8,300 పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణాన్ని చేపట్టామని, ఈ ఏడాది యువతకు నైపుణ్య శిక్షణలో సహకరిస్తామని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణిచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని, అందుకు ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో (ఏపిఎస్‌డిసి) కలిసి పనిచేసేందుకు సిద్ధమని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి. రవి సిఎంకు తెలిపారు.. సమావేశంలో ఇందుకు సంబంధించిన అవగాహనా ఒప్పందంపై సిఎం సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. పాఠశాలలు, కళాశాల చదువును అర్థాంతరంగా ఆపేసిన విద్యార్థులు, నిరుద్యోగులు, సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులకు, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల్లో పనిచేస్తున్న మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన నైపుణ్య శిక్షణిస్తామని ప్రతినిధులు చెప్పారు. ఈ కార్యక్రమంతో రాష్ట్రంలోని 2,550 మంది నిరుద్యోగులు ప్రయోజనం పొందుతారని సిఎంకు వివరించారు. 8 నెలలపాటు సాగే ఈ శిక్షణా కార్యక్రమానికి ఏపిఎస్‌డిసి సహకారం అవసరమన్నారు. రాష్ట్రంలో గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని చేపట్టామని, అందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులను సిఎం కోరారు. నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతకు ఈ భృతినిచ్చేందుకు నిర్ణయించామని ఆయన తెలిపారు. సమావేశంలో కార్పొరేషన్ ప్రతినిధులతో పాటు ఏపిఎస్‌డిసి సిఇఒ గంటా సుబ్బారావు పాల్గొన్నారు.

నిపుణ డాక్టర్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ, గుంటూరు, తిరుపతి జోన్ల పరిధిలో విఐపిల వెంట తిరిగే అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించేందుకు వైద్య విద్యా సంచాలకులు ఎన్. సుబ్బారావు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 28 సాయంత్రం 5 గంటల లోగా అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని, మరిన్ని వివరాలకు http://dme.ap.nic.in వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపారు.

సెప్టెంబరు 27 నుంచి జెవివి యూత్ ఫెస్టివల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యువతలో శాస్త్రీయ అవగాహన కలిగించేందుకు, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు విజయవాడలో సెప్టెంబరు 27 నుంచి 29 వరకు జనవిజ్ఞాన వేదిక(జెవివి) ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. సోమవారం ఎంబి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో ఈ మేరకు నిర్ణయించామని జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాజిక్ , కల్చరల్, హెల్త్, షార్ట్ ఫిలిమ్స్ తీయడం, మీట్ ద సైంటిస్ట్ వంటి కార్యక్రమాల్ని ఈ యూత్ ఫెస్టివల్‌లో నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి పెద్దఎత్తున యువత ఈ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు జి. సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ వర్క్‌షాపునకు రాష్ట్ర నాయకులు తవ్వా సురేష్ రెడ్డి, ఆర్. విజయ్‌కుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరించారన్నారు.

రాష్ట్ర ఉత్సవంగా ఆంధ్రకేసరి జయంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఈనెల 23న రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి (పొలిటికల్) నాగులపల్లి శ్రీకాంత్ అన్ని జిల్లాల కలెక్టర్లకు, సచివాలయ విభాగాధిపతులకు, అన్ని శాఖల అధికారులకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా ఈ జయంతి ని నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మిక కుటుంబాలను ఖాళీ చేయించే యత్నాలు విరమించాలి

ప్రభుత్వానికి చిరంజీవి లేఖ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి నగరం 18వ వార్డులోని పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ఖాళీ చేయించాలనే ప్రభుత్వ ప్రయత్నాలు విరమించుకోవాలని రాజ్యసభ ఎంపి, ప్రముఖ సినీనటుడు చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. అక్కడ 70 ఏళ్లుగా నివాసముంటున్న ప్రజల్ని ఖాళీ చేయించటం సరికాదని ఆయన పేర్కొన్నారు. తిరుపతి నగరం మధ్యలో ఈ కాలనీ ఉండటం ప్రభుత్వం సహించలేక పోతోందా అని లేఖలో ప్రశ్నించారు. ఇది పూర్తిగా వివక్ష పూరితమని, ప్రజలందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతున్నా, దానికి విరుద్ధంగా ప్రభుత్వం బల ప్రయోగంతో బలహీనులైన పారిశుధ్య కార్మిక కుటుంబాలను, యానాది కుటుంబాలను తరలించాలని చూడటం గర్హనీయమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి కార్పొరేషన్ తమ ప్రయత్నాలను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానికులను ఖాళీ చేయించి ప్రైవేటు వ్యక్తులకు ఆ స్థలాన్ని అప్పగించడానికి తిరుపతి కార్పొరేషన్ చేస్తున్న ప్రయత్నాలు అమానవీయమని వ్యాఖ్యానించారు. తాను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు. పారిశుధ్య కాలనీని రోల్ మోడల్ కాలనీగా అభివృద్ధి పరచి అక్కడి కుటుంబాల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించాలని ఆయన కోరారు. నిరుపేదలైన ఆ కుటుంబాల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన కోరారు.

ఓటుహక్కు సామాజిక బాధ్యత


రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎన్.రమేష్‌కుమార్



ప్రజాశక్తి-కాకినాడ

సామాజిక బాధ్యతతోపాటు ఓటుహక్కును వినియోగించుకొనేలా అధికారులంతా ఓటర్లను చైతన్య పరచాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఎన్.రమేష్‌కుమార్ ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్‌లో కార్పొరేషన్ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవరోధాలను అధిగమించి ఎన్నికలు నిర్వహిస్తున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాబోయే 3, 4 రోజులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ప్రసాద్ మృతి



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, టిటిడి మాజీ ఇఒ ప్రత్తి వెంకట రామకృష్ణ ప్రసాద్ (77) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. గుండెపోటు రావడంతో శనివారం రాత్రి ఆయనను కేర్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా, ఫలితం లేక సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. పంచాగం ప్రకారం సోమవారం, క్యాలెండర్ ప్రకారం మంగళవారం ఆయన 78వ పుట్టినరోజు కావడం గమనార్హం. ఆయనకు భార్య గోపిక, కుమారుడు సంజయ్, కూతురు మాధవి ఉన్నారు. 1941 ఆగస్టు 22న గుంటూరు జిల్లా సిరిపురంలో జన్మించారు. తొలుత ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. విశాఖ పోర్ట్ ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు. 1978-82 మధ్య టిటిడి ఇఒగా బాధ్యతలు నిర్వహించారు. పివి నర్సింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో సలహాదారుగా పని చేశారు. మానవ వనరుల సంస్థ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు. పదవీ విరమణ అనంతరం 'అసలేం జరిగింది' అనే పుస్తకం రాశారు. ప్రసాద్ అంత్యక్రియలు హైదరాబాద్‌లోని పంజాగుట్ట శ్మశానవాటికలో సోమవారం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సలహాదారు పరకాల ప్రభాకర్ శ్మశానవాటికకు వచ్చి నివాళులర్పించారు. ప్రసాద్ మతి పట్ల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ సిఎం కెసిఆర్, వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు.

విశ్రాంత ఐఎఎస్ అధికారి ప్రసాద్ మృతి పట్ల రఘువీరారెడ్డి సంతాపం

విశ్రాంత ఐఎఎస్ అధికారి పివిఆర్‌కె ప్రసాద్ మృతిపట్ల పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ మేరకు పిసిసి రాష్ట్ర కార్యాలయం నుంచి సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పివిఆర్‌కె ప్రసాద్ మృతిపట్ల మరో ప్రకటనలో కాంగ్రెస్ నాయకుడు మదాస్ గంగాధర్, సూర్యనాయక్ సంతాపం తెలిపారు.

నంద్యాల ఎన్నికల్లో ధన ప్రభావాన్ని నియంత్రించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల ఉప ఎన్నికల్లో ఏరులై పారుతున్న ధన, మద్య ప్రభావాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రత్యేక దృష్టిపెట్టి నియంత్రించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పెద్దఎత్తున డబ్బులు పంచుతూ మొత్తం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. నంద్యాల అసెంబ్లీ సీటు గెలుచుకునేందుకు టిడిపి, వైసిపి చావో రేవో అనే విధంగా అడ్డదారులు తొక్కుతూ, పలు రకాల కుయుక్తులకు పాల్పడుతున్నాయని సోమవారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలన్నీ గాలి కొదిలేసి ప్రభుత్వ యంత్రాంగమంతా నంద్యాలలోనే తిష్ట వేసిందన్నారు. ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బు పంపిణీ అవుతుంటే ఎన్నికల కమిషన్ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నా౦్నారు. సర్వేలు, ఒపీనియన్ పోల్స్‌పై నిషేధం విధించడం ఆమోద యోగ్యమేనని, కానీ ప్రధాన పార్టీలు ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేశాయనేది ఎన్నికల కమీషన్ సమీక్షించకుండా ఇలాంటి చర్యల వల్ల ఒరిగేదేమీ ఉండదన్నారు. ప్రజాస్వామిక వ్యవ స్థకు తూట్లు పొడిచే విధంగా పాలక, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై ఎన్నికల కమీషన్ ఉక్కుపాదం మోపాలని కోరారు.



నంద్యాల రోడ్‌షోలో భారీ జన సందోహం మధ్య మాట్లాడుతున్న వైఎస్.జగన్

పులివెందులలా నంద్యాల అభివృద్ధి చేస్తా : జగన్

ప్రజాశక్తి - నంద్యాల క్రైం

నంద్యాల అభివృద్ధిని తనకు వదిలేయాలని, పులివెందులాలాగా అభివృద్ధి చేసి చూపిస్తామని వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల ప్రజలకు భరోసా ఇచ్చారు. జగన్ రోడ్డు షో సోమవారం 13వ రోజుకు చేరుకుని, ముగిసింది. జగన్ రోడ్డు షో పట్టణంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నుంచి మొదలై రామకృష్ణ విద్యాసంస్థల అధినేతతో జగన్‌మోహన్‌రెడ్డి మంతనాలు జరిపారు. రామకృష్ణారెడ్డి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. జగన్ రోడ్డు షో మున్సిపల్ పార్కు నుంచి చాంద్‌బాడ, ఫాతిమా హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్, బైర్మల్ సెంటర్, కల్పన సెంటర్ మీదుగా సాగింది. మంజుబాష దర్గాలో జగన్ ఫాతేహాలు నిర్వహించి, ముల్లాన్‌పేట మీదుగా పెద్ద మార్కెట్, గాంధీ చౌక్ వరకూ జగన్ రోడ్డు షో ఆర్భాటంగా, ఉత్సాహంగా, భారీ జనసందోహం మధ్య సాగింది. గాంధీచౌక్ సెంటర్‌లో జగన్ మాట్లాడుతూ నంద్యాలలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని తెలిపారు. అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితులకు తాను అధికారంలోకి వస్తే మూడు నెలలల్లోనే డబ్బు చెల్లించి, చంద్రబాబు అంగీ, ఆదినారాయణరెడ్డి నిక్కర్ ప్రజలతో ఊడదీయస్తామంటూ చెప్పారు. నంద్యాలలో జరిగే ఉప ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధమని అభివర్ణించారు.ఏడాది తర్వాత కురుక్షేత్రం మొదలవుతుందని, నంద్యాల ఎన్నికలు బాబు పతనానికి నాందీ కావాలని తెలిపారు.ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటు చేసి గెలిపించాలని కోరారు.

ఏకపక్షంగా సాక్షి వార్తలు : టిడిపి విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాక్షి పత్రిక, ఛానల్ ఏకపక్షంగా తప్పుడు వార్తలు ఇస్తున్నాయని టిడిపి ఎంపిలు కొనకళ్ల నారాయణ, కేశినేని నాని ధ్వజమెత్తారు.. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. నంద్యాల ఎన్నికల ప్రచారంలో వైఎస్ జగన్, వైసిపి నేతల తీరుపై ఇసిని కలిసి చర్యలు తీసుకోవాలని కోరితే...టిడిపి నేతలకు ఇసి వార్నింగ్ అంటూ తప్పుడు వార్తను ప్రచురించారని ఎంపి కొనకళ్ల నారాయణ తెలిపారు.

భన్వర్‌లాల్‌ను కలిసి నంద్యాలలో జరుగుతున్న పరిణామాలపై ఫిర్యాదు చేస్తే...ఆ విషయాన్ని తప్పుదోవ పట్టించడం దురదృష్టకం౦మన్నారు. ఈ విషయంపై ఫోన్‌లో భన్వర్‌లాల్‌తో మాట్లాడితే, ఆయన నివేదిక పంపాలని సూచిం చడంతో ఇ-మెయిల్ ద్వారా పేపర్ కటింగ్‌లను పంపామని చెప్పారు.



కాంగ్రెస్ ప్రచారంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి , తదితర నాయకులు

వారికి ఓటేస్తే బిజెపికి వేసినట్లే

పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల లీగల్

టిడిపి, వైసిపికి ఓటు వేస్తే బిజెపికి వేసినట్లేనని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. టిడిపి, వైసిపిలు బిజెపి చేతిలో కీలుబొమ్మలని, చంద్రబాబు, జగన్‌లు కేసుల నుంచి బయటపడేందుకు నరేంద్రమోడీ పాదాక్రాంతులయ్యారని విమర్శించారు. డబ్బుతో ఓట్లు కొందామని టిడిపి, వైసిపిలు ఆశిస్తున్నాయని, చైతన్యవంతులైన నంద్యాల ప్రజలు ఆ పార్టీలను ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. సోమవారం చివరిరోజున నంద్యాల సంజీవనగర్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. సంజీవ్‌నగర్ సెంటర్‌లో భారీ బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడారు. రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో ప్రారంభమయ్యాయని తెలిపారు. కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం అబ్దుల్ ఖాదర్‌ను గెలిపించాలని పిసిసి ఉపాధ్యక్షులు తులసీరెడ్డి కోరారు.



టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల ఉప ఎన్నికల్లో భాగంగా నంద్యాల పట్టణంలోని పలు వార్డుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, టిడిపి నేతలు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నంది పరిశ్రమల ఎండి సజ్జల శ్రీధర్‌రెడ్డి, పరుచూరి ఎమ్మెల్యే సాంబశివరావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఎంపీ ఎస్పీవై.రెడ్డి, బొమ్మలసత్రం ప్రాంతంలో నంది పరిశ్రమల డైరెక్టర్ సజ్జల సుజల ప్రచారం చేపట్టారు. టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి మద్దతుగా మోటార్ సైకిల్ ర్యాలీని ఆ పార్టీ కార్యకర్తలు పట్టణంలో పలు వార్డుల్లో నిర్వహించారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి వీధివీధి తిరిగి తన ప్రతిష్టను దిగజార్చుకున్నారని రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి చేసిన భూ ఆక్రమణలు, మహిళలపై వేధింపులు, అత్యాచారాలు అన్నీ ఒకొక్కటిగా బయటికి వస్తున్నాయని తెలిపారు. బాధిత వర్గాలే నేరుగా వచ్చి తమతో మొరపెట్టుకుంటున్నాయని చెప్పారు. మహిళా బ్యాంక్ పేరిట మహిళలను దోచుకుంటున్నారని ఆరోపించారు.

వైసిపి నాయకుడిపై దాడి


ప్రజాశక్తి - నంద్యాల క్రైం

నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో వైసిపి నాయకుడు పరమేశ్వర రెడ్డిపై టిడిపి నాయకులు సోమవారం దాడి చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం సమయం లో టిడిపి నాయకులు పరమేశ్వర రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని మూకుమ్మడిగా దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. గాయపడిన పరమేశ్వర రెడ్డిని కుటుంబ సభ్యులు వెంటనే నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. టిడిపి నాయకుల దాడి విషయంపై బాధితుడి కటుంబీకులు పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకోకుండా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడంతో ఏమీ చేయలేక మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడం అన్యాయమని అన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

సూర్య కళలు

అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం

అమెరికాలో సోమవారం నాటి సంపూర్ణ సూర్యగ్రహణం ప్రజలకు కనువిందు చేసింది. అమెరికన్ కాలమానం ప్రకారం ఉదయం 9.05 ప్రాంతంలో పాక్షికంగా ప్రారంభమైన సూర్యగ్రహణం 10.16 ప్రాంతానికి యు.ఎస్. మొత్తం విస్తరించింది. 99 ఏళ్ల తర్వాత ఏర్పడిన ఇలాంటి సూర్యగ్రహణాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. గ్రహణం సందర్భంగా సూర్యుడు వజ్రపు ఉంగరంలా మెరుస్తూ ఉండడం అద్భుతమని పలువురు నెట్‌జన్‌లు ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. నల్లకళ్లద్దాలు పెట్టుకొని పలువురు సూర్యగ్రహాన్ని వీక్షించగా, అద్దాలలో ప్రతిబింబాన్ని పాఠశాల విద్యార్థులు వీక్షించారు. నాసా ప్రత్యేకంగా కెమెరాలు ఏర్పాటు చేసి ఈ సంపూర్ణ సూర్యగ్రహణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది.





అపూర్వ గ్రహణానికి స్వాగతం ఇలా

రైతు బజార్లకు కర్నూలు నుంచి ఉల్లి సరఫరా

కిలో రూ.22కు విక్రయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కర్నూలు ఉల్లికి మంచి ధర లభిస్తోందని మార్కెటింగ్ కమిషనర్ ఐ.శ్యామ్యూల్ ఆనంద్‌కుమార్ తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో ఉల్లి పంట దెబ్బతినడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కర్నూలు నుంచి నేరుగా తమ శాఖ అధికారులు కొనుగోలు చేసి అన్ని జిల్లాల్లోని రైతు బజార్లకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల నుంచి కిలో రూ.18లకు కొనుగోలు చేస్తున్నామన్నారు. రవాణా చార్జీలు, నిర్వహణ ఖర్చులు, రైతు బజార్లలో విక్రేతలకు కమీషన్ కలిపి కిలోకు రూ.4 అదనంగా వ్యయమవుతోందని, అందువల్ల గరిష్టంగా రూ.22కు మించి విక్రయించరాదని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉల్లి కొరత ఎక్కడా లేదని, గతంలో కర్నూలులో ఉల్లి ధరలు పడిపోయినప్పుడు మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం కింద ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తు చేసిన కమిషనర్ ఇప్పుడు మంచి ధర రావడం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

టన్ను గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- పలాస రూరల్ (శ్రీకాకుళం జిల్లా)

ఉల్లి, బంగాళదుంపల మాటున తరలిస్తున్న టన్ను గంజాయిని శ్రీకాకుళం జిల్లా పోలీసులు సోమవారం పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందుకున్న సమాచారం మేరకు కాశీబుగ్గ సిఐ అశోక్‌కుమార్, ఎస్ఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసులు మండలంలోని లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనకాపల్లి నుంచి కటక్ వైపు ఉల్లి, బంగాళదుంపల లోడుతో వెళు_న్న లారీని తనిఖీ చేశారు. ఈ బస్తాల కింద 40 గంజాయి బస్తాలు ఉండడాన్ని గుర్తించారు. టన్ను బరువైన ఈ గంజాయి విలువ సుమారు రూ.కోటి ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.

టిడిపి ప్రభుత్వం శాశ్వతం కాదు : ముద్రగడ

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)

టిడిపి ప్రభుత్వం శాశ్వతంగా ఉండిపోదని, చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ముద్రగడ పద్మనాభం అన్నారు. కాపులను మోసగించి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని కూల్చేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం మెడలువంచైనా రిజర్వేషన్లు సాధించుకోవాలని కాపు జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 27వ రోజు కాపు ఉద్యమనేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం తన నివాసం నుంచి అనుచరులతో బయల్దేరగా ప్రధానగేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. గేటువద్ద ఏర్పాటు చేసిన టెంటులో బైఠాయించారు.

ఉరకలేస్తున్న గోదావరి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. శబరి, మన్యంలోని సోకులేరు, పాములేరు నీరు గోదావరిలో చేరుతోంది. భద్రాచలం వద్ద 22.05 అడుగుల నీటిమట్టం సోమవారం నమోదైంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 10.20 అడుగుల నీటి మట్టాన్ని స్థిరీకరించారు. బ్యారేజీకి చెందిన 175 గేట్లను 0.50 మీటర్ల ఎత్తుకు లేపి మూడు లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. సోమవారం కాళేశ్వరం వద్ద 4.28 అడుగులు, పేరూరు వద్ద 6.66 అడుగులు, దుమ్ము గూడెం వద్ద 7.26 అడుగుల నీటిమట్టం నమోదైంది. కూన వరం వద్ద 8.55 అడుగులు, కుంట వద్ద 6.82 అడుగులు, కోయిదా వద్ద 11.20 అడుగులు, పోలవరం వద్ద 8.01 అడుగులు, రాజమహేంద్రవరం హేవ్‌లాక్ బ్రిడ్జి వద్ద 14. 05 అడుగుల నీటిమట్టం నమోదైంది. గోదావరిలో ఇన్‌ఫ్లో నాలుగు లక్షల క్యూసెక్కులు ఉండటంతో తూర్పు డెల్టా కాలువలకు సోమవారం 4,800 క్యూసెక్కుల నీటిని విడు దల చేశారు. పశ్చిమ డెల్టా కాలువలకు 2.000 క్యూసెక్కు లు, మధ్య డెల్టాకు 1,900 క్యూసెక్కులు విడుదల చేశారు.

కలెక్టరేట్ల వద్ద రజకుల ధర్నా

90 శాతం సబ్సిడీ రుణాలివ్వాలని డిమాండ్



నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రజక వృత్తిదారులు

ప్రజాశకి- యంత్రాంగం

రజకుల ప్రతి కుటుంబానికీ 90 శాతం సబ్సిడీతో రూ.2 లక్షల రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఎపి రజకవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నాలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ.. రజకుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు. పట్టణాల్లో ఇళ్ల స్థలాలు లేని రజకులకు పక్కా గృహాలివ్వాలన్నారు. రజకులపై భూస్వాముల దాడులు, వివక్షత కొనసాగుతోందని తెలిపారు. దీనిపై శాసనసభలో వీరికి రక్షణ కలిగించే విధంగా చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. తొలుత విఆర్‌సి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సంఘ ప్రతినిధులు కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ.. రజక వృత్తిదారుల సమస్యలపై సమగ్ర పరిరక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. 50 ఏళ్లు నిండిన రజక వత్తిదారులకు రూ.2 వేల వద్ధాప్య పింఛను ఇవ్వాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం జెసి డాక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మీకోసంలో వినతిపత్రం అందచేశారు. బ్యాంకులతో సంబంధం లేకుండా 90 శాతం సబ్సిడీతో రుణాలు, ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల రుణం అందచేయాలని కోరారు. ధర్నాకు జిల్లావ్యాప్తంగా రజక వృత్తిదారులు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్లు హాజరయ్యారు.

పచ్చళ్ల తయారీ కేంద్రాలపై ఎఎస్ఓ దాడులు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు)

నిబంధనలకు విరుద్ధంగా పచ్చళ్ల తయారీ, నకిలీ వస్తువుల వినియోగం నేపథ్యంలో గుంటూరు జిల్లా మంగళగిరి కొత్తపేటలో ఐదు పచ్చడి తయారీ కేంద్రాలపై ఎఎస్ఓ (సివిల్ సప్లై సహాయ సరఫరా అధికారి) సోమవారం దాడులు నిర్వహించారు. అమరావతి పికిల్స్‌లో బూజుపట్టిన పచ్చళ్లు ఉన్నట్లు అధికారి విబి.విలియమ్స్ తెలిపారు. ఎవిఆర్ పికిల్స్, సత్య పికిల్స్, ఉషా పికిల్స్, విజయ పికిల్స్ తదితర కేంద్రాల్లో తనిఖీలు చేపట్టి నమూనాలు సేకరించారు. మధ్యవర్తుల స్టేట్‌మెంట్ తీసుకొని నివేదికను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు పంపిస్తామని అధికారులు పేర్కొన్నారు. కల్తీ నూనెలతో పచ్చళ్లను తయారు చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీల్లో తాడేపల్లి, మంగళగిరి మండల సివిల్ సప్లయిస్ అధికారులు వి.శ్రీనివాసరావు, కళ్యాణి పాల్గొన్నారు



పచ్చళ్ల తయారీ కేంద్రంలో నమూనాలను సేకరిస్తున్న అధికారులు

ఇపి జాతీయ ఉపాధ్యక్షునిగా సూరిబాబు

ప్రజాశక్తి - నెల్లూరు

ఇపి జాతీయ ఉపాధ్యక్షునిగా దుగ్గిరాల సూరిబాబు ఎన్నికపై యుఇఐయు నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ పెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇపి) 8వజాతీయ మహాసభలు మూడ్రోజులపాటు హైదరాబాద్‌లోని సుందరయ్య కళా నిలయం ఆడిటోరియంలో జరిగాయి. ఈమహాసభలకు 29 రాష్ట్రాల నుంచి 600మంది ప్రతినిధులు హాజరయ్యారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో విద్యుత్ సంస్థలో జరుగుతోన్న పరిణామాలు, వాటి పరిష్కారం కోసం చేపట్టాల్సిన విధి విధనాలు చర్చించారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లోని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం వెంటనే చేయాలని, అందరినీ రెగ్యూలర్ చేయాలని తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇపి జాతీయ ఉపాధ్యక్షులుగా డి.సూరిబాబు, వర్కింగ్ కమిటీ సభ్యులు సిహెచ్ నాగబ్రహ్మాచారి, ఎం.బాలకాశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



దుగ్గిరాల సూరిబాబు

సంపాదకీయం

నంద్యాల సమరం

సిట్టింగ్ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి హఠాన్మరణంతో జరుగుతున్న కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యాన్నీ, ఎన్నికల వ్యవస్థనూ నిలువెత్తు గొయ్యి తీసి పాతేస్తున్నాయి. రాజకీయాలంటే ఇంత నీతి బాహ్యమా అనేంతగా విలువలను దిగజారుస్తున్నాయి. నంద్యాల స్థానం ఖాళీ అయిన మరుక్షణం నుంచీ సోమవారం సాయంత్రం ప్రచారానికి తెరపడేంత వరకు సాగించిన సామ, దాన, భేద, దండోపాయాలు ఒక ఎత్తయితే బుధవారంనాటి పోలింగ్‌కు ముందు 48 గంటల్లో ఓటర్లను లోబరుచుకునేందుకు మద్యం, డబ్బు పంపిణీ వంటి ప్రలోభాలు రెండో ఎత్తు. సాధారణ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నరకుపైన సమయం ఉన్న తరుణంలో ఒక్క అసెంబ్లీ స్థానం గెలుచుకోవడం వలన ప్రభుత్వంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి అదనంగా వచ్చేదేమీ లేదు. ఈ ఒక్క సీటుతో ప్రతిపక్ష వైసిపి చేతికి అధికారమూ రాదు. అయినా కైవసం చేసుకునేందుకు అధికార, విపక్షాలు సర్వ'శక్తులూ' ఒడ్డుతూ ప్రజాస్వామ్యాన్ని నంద్యాల నడి వీధిలో 'వస్త్రాపహరణం' కావించడం ప్రజాస్వామికులను కలచివేసే దారుణం. ఏడాదిన్నరలో జరగనున్న ఎన్నికలకు నంద్యాలను రెండు పార్టీలు రిహార్సిల్‌గా చేసుకున్నందువల్లనే ఈ దిగజారుడు రాజకీయం. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో, రాజకీయాలను భ్రష్టు పట్టించడంలో, ఎన్నికల వ్యవస్థను తుంగలో తొక్కడంలో టిడిపి పద్నాలుగాకులు ఎక్కువే చదివింది. భూమా నాగిరెడ్డి అంత్యక్రియలైన మరుక్షణం నుంచీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని సచివాలయంలో, అధికారిక నివాసంలో లెక్కకుమించినన్నిసార్లు మంత్రాంగం నడిపారనడానికి మీడియా కథనాలే సజీవ సాక్ష్యాలు. పలు మంత్రివర్గ సమావేశాల్లోనూ ఉప ఎన్నికపైనే చర్చ. హుటాహుటిన నంద్యాలలో రోడ్ల విస్తరణ, ఇళ్ల నిర్మాణం వంటి రూ.1,500 కోట్ల అభివృద్ధి పనులకు ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందు సిఎం స్వయంగా శంకుస్థాపనలు చేశారు. ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీని అక్కడి నుంచే అట్టహాసంగా ప్రారంభించారు. ఎన్నడూ లేనిది నంద్యాలలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. సిఎంకు మూడున్నరేళ్లలో ఒక్కసారైనా గుర్తుకురాని నంద్యాలపై ఒక్కసారిగా ఇంత అపారమైన ప్రేమ ఒలకబోత ఉప ఎన్నికల కోసమేనని అర్థం చేసుకోలేనంత అమాయకులెవరూ ఉండరు.

రాయలసీమ, రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలు వర్షాభావంతో అల్లాడుతున్నాయి. గ్రామాల్లో ఉపాధి పనుల్లేక, చేసిన పనులకు కూలి డబ్బులు చెల్లించక ప్రజలు పస్తులుంటున్నారు. చాలా గ్రామాలు, పట్టణాలకు వర్షాకాలంలోనూ తాగునీరు అందని దుస్థితి నెలకొంది. మన్యం రోగాలతో పడకేసింది. యువతను నిరుద్యోగం పీడిస్తోంది. కానీ ఈ ప్రజాసమస్యలేమీ ప్రభుత్వానికి పట్టలేదు. కేబినెట్‌లోని పద్దెనిమిది మంది మంత్రులు నంద్యాలలో నెల రోజుల నుంచి మకాం వేసి ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ ప్రలోభాల పర్వాన్ని ద్విగ్విజయం చేస్తున్నారు. ముప్పైకి పైగా టిడిపి ఎమ్మెల్యేల అడ్డా అదే. ఎమ్మెల్సీలు, చోటా మోటా నాయకులు, కార్పొరేషన్ ఛైర్మన్లు తిష్ట వేసి కులాలవారీగా పంచుకొని ఎవరికి కావాల్సింది వారికి ఇస్తామని హామీలిస్తున్నారు. నాలుగు ఓట్లున్న ప్రతి ఒక్కరినీ ఏదొక విధంగా లోబరుచుకుంటున్నారు. బాలకృష్ణ తన ప్రచారంలో బహిరంగంగా డబ్బులు పంచి ఎన్నికల సంఘం (ఇసి) విచారణకు గురయ్యారు. పోలింగ్ సమీపిస్తున్న వేళ గంగుల ప్రతాప రెడ్డికి పచ్చ కండువా, ఇప్పటి వరకు సోదిలో కూడా లేని ఫారూక్‌కు ఎమ్మెల్సీ, ఆపైన మండలి ఛైర్మన్ పదవి హామీ వంటివి అనేకానేకం ఉన్నాయి. అధికార దుర్వినియోగం గురించి చెప్పనవసరం లేదు. నంద్యాల డిఎస్‌పిని ఎన్నికల విధుల నుంచి ఇసి తప్పించాల్సి వచ్చింది.

టిడిపి అధికారంలోకొచ్చాక ఆళ్లగడ్డ, నందిగామ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగినా అవి నామమాత్రం. ఆళ్లగడ్డలో టిడిపి, నందిగామలో వైసిపి పోటీ పెట్టలేదు. నంద్యాలకొచ్చేసరికి పరిస్థితి మారింది. వైసిపి నుంచి టిడిపిలోకి ఫిరాయించిన 21 మంది ఎమ్మెల్యేల్లో భూమా నాగిరెడ్డి ఒకరు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఎన్నికల గోదాలో దిగాలని వైసిపి డిమాండ్ చేస్తున్నా టిడిపి దాట వేస్తూ వచ్చింది. భూమా నాగిరెడ్డి మరణంతో నంద్యాల ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో నంద్యాల సమరాన్ని సిఎం చంద్రబాబు, వైసిపి నేత జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పోటీలో ఉన్న ఇరు పార్టీల అభ్యర్థుల పేర్లూ నామమాత్రం. అధినాయకులే ప్రధాన యోధులై ఖతం చేస్తాం, కాల్చి చంపుతాం అనేదాకా వెళ్లారు. ఒక్క స్థానంలో జరిగే ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి ప్రచారం చేయాల్సిన అవసరమేమిటి? అలాగే ప్రతిపక్ష నేత సైతం ఇన్ని రోజుల మకాం వేయడం అనవసరమా? మరోవైపు కులాలవారీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించి ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించారు. తమ కనుసన్నల్లోనే డబ్బులు, మద్యం విచ్చలవిడిగా పారిస్తున్నారు. సర్వేలు, బెట్టింగ్‌ల పేరుతో ఓటర్లను గందరగోళానికి గురి చేస్తున్నారు. రాష్ట్రంలోని మీడియా కూడా రెండు శిబిరాలుగా చీలిపోయి నంద్యాల ఉప ఎన్నికల పోరు తమదే అన్నట్లు ప్రచారం చేస్తున్నది. ఇరు పార్టీల మధ్య చావోరేవో తేల్చుకోవాలన్నంతగా పోటీ, స్పర్థ, ప్రచారం, ఆవేశం తారాస్థాయికి చేరాయి. ఎన్నడూ ఈ వైరీత్యం ఎరగం. హింసకు అవకాశం ఉంది. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు శాంతియుత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ పైనా, అధికార యంత్రాంగం పైనా ఉంది.

మహనీయుల మాట



నిన్ను నువ్వు ఏ విధంగా ప్రేమించుకుంటావో అదే విధంగా ఇతర మానవులను కూడా ప్రేమించు.

- హోచిమిన్

సర్కసు పిల్ల

ప్రజాగళం

పదేళ్ల వయసుంటది
పది మీటర్ల ఎత్తులో
నడుస్తున్నది
అదీనూ నెత్తిన బరువైన
గెడకర్రను మోస్తూ
ఇంతకీ సన్నని
తాడుమీద!
మనం నేలమీద నడుస్తూనే
జారిపడతాం
చూసే నాలో అడుగడుక్కి భయం
ఎక్కడ పడిపోతుందోనని
చివరిదాక నడిచేసి ఆ భయాన్ని
చెరిపేసింది
ఉడతలు పీకిన తాటి
పీచులా జుట్టుతో
బట్టల కన్నా దుమ్మే
ఎక్కువ కప్పుకుంది
ఆకలి నొప్పి
పుడుతుందనుకుంటా
మధ్య మధ్యలో పళ్లు
బిగిస్తూ ఓర్చుకుంటోంది
అందరూ చప్పట్లు కొట్టి
చిల్లర పైసలిచ్చి సరిపెట్టి పోతున్నారు
కనీసం పేరూ వూరడిగిన వాడు లేడు
ఆ పాప దిద్దాల్సిన అక్షరాల వూసు
దీయలేదు
ఎవరూ తనతో సెల్ఫీ దిగే మోజు
చూపలేదు
తాడు దిగిన తరువాత
అప్పటిదాకా వ్యాఖ్యానం చేసి అలసిన
నాన్న పక్కన కూర్చుని
చిల్లర పోగేసి చేతి సంచిలో వేసుకున్నది
నా కళ్లెంతగ వెదికినా
వాళ్లమ్మ కనిపించలేదు
వాళ్లమ్మనే వుండివుంటే
పాప జడలందంగ ముస్తాబు చేసేది
గదా!
ఆడపిల్ల బాగోగులు చూసేది గదా!
తండ్రేం చేయలేక పోతున్నాడు
అతడు కూడా దివ్యాంగుడు!
అందుకే పాప సర్కసు పిల్లయింది
నాన్నని పోషించే తల్లయింది
ఆస్తులిచ్చినా ఆశ్రమాలకి తోలే
కరుణ లేని కొడుకుల్లారా పాపని
చూడండి
పైన తాడు పై నడుస్తూ నడుస్తూనే
నాన్నను ఓ కంట కనిపెడుతూనే వుంది!



చిన్న చిన్న పనులకే
భయపడే
పిరికి సన్నాసులారా
సర్కసు పిల్లను చూడండి
గిన్నీసు బుక్కు
రికార్డుకోసం గాకుండా
తినే గిన్నెలోకి నాల్గు
ముద్దలకోసం
గాల్లో ఒడుపుగ నడిచి
ఔరా! అనిపిస్తున్నది!
పాలకులారా! మీరు కూడా
కార్పొరేట్ల బూట్ల వైపు గాదు
చూడాల్సిందీ
సర్కసు పిల్లలు అద్భుతంగ చేసే
బతుకు ఫీట్ల వైపు బాధ్యతతో చూడండి
కేవలం నోటిసాయం మాటలే గాకుండా
కొన్ని రుపాయి నోట్లని తన ఖాతాకి
వేయండి
అప్పుడే నమ్ముతాను నిజంగా
భారతదేశం వెలిగిపోతుందన్న మీ
నినాదాన్ని!!

మెట్టా నాగేశ్వరరావు

నంద్యాల 'ఉప రణం'



దేశానికి, రాష్ట్రాలకు ఉప ఎన్నికలు కొత్తేమీ కావు. చిత్ర విచిత్రమూ కావు. ప్రతి ఐదేళ్ళకోసారి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికలు జరగటం ఎలా సర్వసాధారణమో, ఐదేళ్ళలోపు అవసరమైనచోట ఉప ఎన్నికలు జరగటమూ అంతే సర్వసాధారణం. అయితే సార్వత్రిక ఎన్నికలకూ, ఉప ఎన్నికలకూ రాశిలోనూ, వాసిలోనూ చాలా తేడాలుంటాయి. సార్వత్రిక ఎన్నికలు అప్పటివరకు అధికారంలో ఉన్న ప్రభుత్వాల ఐదేళ్ళ పరిపాలనకు, అభివృద్ధికి, మంచీ, చెడులకు కొలమానమైతే, ఉప ఎన్నికలు ఆ నియోజకవర్గాల్లోని స్థానిక పరిస్థితులకు, స్థానిక అభివృద్ధికి కొలమానం. ఈ ఉప ఎన్నికలు కూడా అభ్యర్థి మరణిస్తేనో, తన పదవికి రాజీనామా చేస్తేనో, లేదా మరే ఇతరత్రా కారణాలతోనో వస్తాయి. కనుకనే ఉప ఎన్నికల్లో అభ్యర్థికి సంబంధించిన వారసుల మంచితనం, బరిలో నిలిచిన అభ్యర్థికి ఆ ప్రాంత ప్రజలతో ఉన్న బలీయమైన సంబంధం అతని విజయానికి ముఖ్య కారణంగానూ, కీలకంగానూ పనిచేస్తాయి. ఈ కీలకాంశం తరువాతే పోటీ చేసే అభ్యర్థి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీ దీక్షాదక్షతలు అభ్యర్థి విజయంతో జతకడతాయి. కానీ ఇప్పుడు జరుగుతున్న నంద్యాల ఉపఎన్నిక అలా లేదు. అన్ని పక్షాల వారు సంయుక్తంగా ఈ ఎన్నికలను సాధారణ ఎన్నికలను మించిన 'మహా ఎన్నిక'గా మార్చారు. అధికార, విపక్ష పార్టీలు రెండూ ఈ ఎన్నిక విజయాన్ని ప్రాణ పదంగా భావిస్తున్న పరిస్థితి. విలువల వలువలు విప్పుదీసి మరీ ఒకరిపై ఒకరు 'కత్తులు' దూసుకుంటున్న దుస్థితి కూడా. ఇప్పటికే వైరి పార్టీలు సమస్త బలగాలను నంద్యాలలో మోహరించాయి. గజకర్ణ, గోకర్ణ, టక్కు, టమారా విద్యలను అమలులో పెట్టాయి. సందు సందుకూ, గడప గడపకూ ఓట్ల వేట కోసం రెక్కీలు నిర్వహించాయి. ప్రలోభాలతో, ధన, మద్య ప్రవాహంతో ఎన్నికల సమరాన్ని అతి జుగుప్సాకరంగా మార్చాయి. ఈ తంత్ర, మంత్ర విద్యలు కనబడకుండా ఉండేందుకు అధికార పక్షం అభివృద్ధి జపం చేస్తుంటే, విపక్షం రెండ డుగులు ముందుకేసి ధర్మానికి- అధర్మానికి, న్యాయానికి-అన్యాయానికి మధ్య యుద్ధంగానూ, ప్రభుత్వ పతనానికి నంద్యాల నాందిగానూ పేర్కొంటోంది. పైగా ఇరు పార్టీల నాయకులు 'విశ్వసనీయత' వంటి పదాలను ఉచ్ఛరించటం కొసమెరుపు. నంద్యాల ఎన్నికల ప్రచార నాయక త్రయం నంద్యాల ఎన్నికల బరిలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎవరెవరో, ఏ పార్టీ జెండాను వీడి ఏ పార్టీ జెండా పట్టారో, నిన్న మొన్నటి వరకు ఏ రాజకీయ పార్టీ కండువాను మెడనుదాల్చారో, ఇప్పుడెందుకు కుడిఎడమై బరిలో నిలిచారో, వారి విశ్వసనీయత ఏమిటో చెప్పరు. నంద్యాలలో ఏ పార్టీ గెలుపు గుర్రం ఎక్కినా ఏపి ప్రజలకు వచ్చేదీ లేదు, పోయేదీ లేదు. ఆయా పార్టీల రాజకీయ స్వప్రయోజనాలు తప్ప.

- పోతుల బాలకోటయ్య, సీనియర్ జర్నలిస్టు.

జీవోలతో ఒరిగిందేమిటో...

ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు వస్తున్నాయి, పోతున్నాయి. అయితే ప్రభుత్వం ఏదైనా సరే ఆ ఐదేళ్ళపాటు కొత్త కొత్త జీవోలు ప్రత్యక్షమౌతాయి. ఒక ప్రభుత్వ పథకం వచ్చిందంటే చాలు అందుకు అనుగుణంగా ఓ జీవో పుట్టుకొస్తోంది. వీటితో ఒరిగిందేమిటో! కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇలా ఒకరేంటి? అందరికీ ఈ జీవోలను వర్తింప చేస్తున్నారు. కార్మిక కష్టాలను జీవోలతో కట్టిపడేయడం ప్రభుత్వాలకు పరిపాటయ్యింది. ఉద్యోగుల జీవితాలను ఈ జీవోలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రభుత్వాలు తెస్తున్న ఈ జిఒల గురించి పూర్తిగా తెలిసిన వారు ఒక్కరు కూడా కనబడరు? ఒక్కొక్కరిది ఒక్కో ధోరణి. ఎవరి మాట వినాలో ఏది అనుసరించాలో తెలియక తికమక పడే వారే ఎక్కువ. ఉద్యోగం కోసం వెతుకులాట దగ్గర నుండి పదవీ విరమణ పొందే వరకు ఇలాంటి జీవోలే మన కళ్ళముందుంటాయి. ఇలాంటి జిఒలతో విసుగుచెందిన అనేక మంది వాటి రద్దు కోసం నిరసనలు చేపడుతున్నారు. 'మబ్బులు కమ్ముకుంటేనే వర్షం వస్తుందనుకోవడం ఎలాగో... ప్రభుత్వాలు వచ్చాయంటే మేలు చేస్తాయనుకోవడం' కూడా అలాగే. ఎవరు వచ్చినా... ఏ ప్రభుత్వం వచ్చినా... ప్రజలందరికీ అనుకూలమైన పథకాలు తెస్తాయనడం కలే.

కునిగిరి రమేష్, అనంతపురం.

సిఎంలు సామంతులు కారు

విశ్లేషణ



తెలకపల్లి రవి

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా త్రిపుర ముఖ్యమంత్రి, నిరాడంబరతకు మారు పేరైన మాణిక్ సర్కార్ ప్రసంగ ప్రసారానికి ప్రసార భారతి అడ్డు తగిలింది. ఆయన ప్రసంగాన్ని 'తాము చెప్పినట్టు మార్చాలని లేదా తొలగించాలని' నిర్దేశించింది. ఒక ముఖ్యమంత్రినే అంత తేలిగ్గా కొట్టిపారేస్తూ ప్రసార భారతి వ్యవహరించిందంటే కేంద్ర ప్రభుత్వ ఆశీస్సులతో ఆదేశాలతోనే ఇలా చేసిందని స్పష్టమవుతుంది. 'మన్‌కీ బాత్' పేరుతో ప్రధాని మోడీ నచ్చినట్టు అప్పటికప్పుడు మాట్లాడేందుకు అవకాశమిచ్చే ప్రసార భారతి చారిత్రాత్మకమైన స్వాతంత్ర్య దినోత్సవాన ఒక ముఖ్యమంత్రికి ఆ అవకాశం ఇవ్వకపోవడం అంటే స్వతంత్ర పోరాట విలువలను పరిహసించ డమే. కాంగ్రెస్ నాయకత్వంలోని ముఖ్యమంత్రులు స్వాతంత్ర్యం రావడానికి పూర్వమే కేంద్రంలోని బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధులుగా వున్న గవర్నర్ల ఆదేశాలు పాటించడానికి తిరస్క రించి రాజీనామా లు కూడా చేశారు. మన రాజ్యాంగానికి ప్రజా స్వామ్యం, లౌకిక తత్వం, ఫెడరలిజం మూడు మూల సూత్రాలు. ఇప్పటికే భావ ప్రకట నా స్వేచ్ఛ, మత సామరస్యం దాడికి గురవుతున్నాయి. ప్రజల తీర్పుతో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించే మూడవ దాడి మరింత ప్రమాదకరమైంది. వాటిని ఎన్నుకున్న కోట్ల మంది ప్రజల హక్కులను హరించడమే.

టీమిండియా డ్రీమిండియానే

ప్రధాని మోడీ ఎప్పుడూ టీమ్ ఇండియా అంటూ క్రీడా భాషలో మాట్లాడుతుంటారు. నిజానికి ముఖ్యమంత్రులందరూ తన జట్టులో వున్నట్టు దానికి తానే కెప్టెన్ అయినట్టు అనుకోవడం అశాస్త్రీయం. వారు వారి రాష్ట్రాల కెప్టెన్లు. రాజ్యాంగం దేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా అభివర్ణించింది. 168వ అధికరణం వాటి పరిధిలో పాలన చేయడానికి శాసనసభలను సృష్టించింది. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాలను స్పష్టంగా విభజించింది. దేశమంతటికీ సంబంధించిన రక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, సమాచార సంబంధాలు, సుప్రీం కోర్టు, ఎన్నికల సంఘం, వంటి వాటిని కేంద్రానికి అప్పగించి తక్షణ ప్రజా పరిపాలన శాంతిభద్రతల వంటివన్నీ రాష్ట్రాల చేతుల్లోనే వుంచింది. పార్లమెంటులో రాజ్యసభ ద్వారా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించింది. ఏ చట్టమైనా రాజ్యసభ కూడా చర్చించి సూచనలు చేయొచ్చు. ఆర్థికేతర బిల్లులను తిరస్కరించవచ్చు కూడా. రాష్ట్రపతిని ఎన్నుకోవడంలోనూ రాష్ట్రాల సభలకు హక్కు వుంటుంది. అంతర్ రాష్ట్ర మండలిలో అన్ని రాష్ట్రాలూ చర్చించుకోవడానికి వీలుండేది. ఇవన్నీ కూడా జాతీయ వ్యవస్థలో రాష్ట్రాల భాగస్వామ్యాన్ని చెబుతాయి.

దీర్ఘకాలం పాలన చేసిన కాంగ్రెస్ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించి అనేక విధాల సంక్షోభాలు సృష్టించిన మాట నిజం. ఈ కుట్రకు తొలిగా బలైంది కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వమే. కేరళ, బెంగాల్‌లతో మొదలైన ఈ కుట్రలు తర్వాత ఇతర చోట్లకూ పాకి, పలు రాష్ట్రాలలో రాజకీయ సంక్షోభాలు పెరిగాయి. 1967లో వరుసగా రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడితే 1977 నాటికి కేంద్రంలోనే జనతా ప్రభుత్వం ఏర్పడింది. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిన రాష్ట్రాలలో శాసనసభలను రద్దు చేయడం ఆ క్రమంలోనే చూడాలి. అయితే అసలైన సంఘర్షణ 1980లో ఇందిరాగాంధీ మళ్లీ అధికారంలోకి వచ్చాకే మొదలైంది. ఆ దశకంలో అసోం, పంజాబ్, కాశ్మీర్‌లలో రాజకీయ కుట్రలూ కల్లోలాలు రగిలాయి. ఆంధ్రప్రదేశ్, కర్నాటక వంటి చోట్ల తెలుగుదేశం జనతా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అఖండమైన మెజార్టీతో గెలిచిన ఎన్టీఆర్‌ను కూడా కేంద్రం కుట్రతో కూలదోయడం పెద్ద సంఘర్షణకు దారితీసింది. అయితే ఎన్నడూ లేని విధంగా ఆయనను పున: ప్రతిష్టించవలసి వచ్చింది. దీంతో పరిస్థితి గమనించిన కేంద్రం కూడా 'సర్కారియా కమిషన్' నియమించి రాష్ట్రాల హక్కులకు కొన్ని చర్యలు ప్రకటించింది.

స్వాభావికంగా బిజెపి కేంద్రీకృత పాలన, అధ్యక్ష తరహా దేశంలో వంద రాష్ట్రాల ఏర్పాటు వంటి విధానాలు కోరుకుంటుంది. రాజ్యాంగం తిరగదోడేందుకు వాజ్‌పేయి ప్రభుత్వం ఒక సమీక్షా సంఘాన్నే నియమించింది. నిరసనల తర్వాత ఆ కమిషన్ సిఫార్సులు, సూచనలు మాత్రమేనని సవరణ చేసింది. రాష్ట్రాలలోని అధికారాన్ని కూడా బిజెపి మత రాజకీయాలకు ఉపయోగించింది.



బిజెపి స్వభావమే అది

ఈ మొత్తం ప్రక్రియలో బిజెపి పాత్ర లేదు. ఆనాడు కాంగ్రెసేతర లౌకిక పక్షాలే సమావేశమవుతుండేవి. స్వాభావికంగా బిజెపి కేంద్రీకృత పాలన, అధ్యక్ష తరహా దేశంలో వంద రాష్ట్రాల ఏర్పాటు వంటి విధానాలు కోరుకుంటుంది. రాజ్యాంగం తిరగదోడేందుకు వాజ్‌పేయి ప్రభుత్వం ఒక సమీక్షా సంఘాన్నే నియమించింది. నిరసనల తర్వాత ఆ కమిషన్ సిఫార్సులు, సూచనలు మాత్రమేనని సవరణ చేసింది. ఆ ప్రభుత్వ హయాంలో బీహార్ వంటి చోట్ల తప్పులు చేయబోతే నాటి రాష్ట్రపతి నారాయణన్ అడ్డుపడ్డారు. రాష్ట్రాలలోని అధికారాన్ని కూడా బిజెపి మత రాజకీయాలకు ఉపయోగించింది. ఉత్తర ప్రదేశ్‌లో వున్న రాష్ట్రాధికారాన్ని ఉపయోగించి అయోధ్య బాబ్రీ మసీదు కూల్చివేతకు అవకాశమిచ్చింది. వాజ్‌పేయి వుండగా గుజరాత్‌లో ఇదే మోడీ ప్రభుత్వ పరోక్ష ఆశీస్సులతో భయానకమైన జాతి హత్యాకాండకు పాల్పడింది. అంటే కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ బిజెపికి రాజ్యాంగ విలువలపైన ఇసుమంత నమ్మకం లేదు. మోడీ ముఖ్యమంత్రిగా చేసి వచ్చినా సరే రాష్ట్రాల హక్కుల రక్షణ కంటే రాజకీయ ఆధిపత్య సాధనే ఏకైక సూత్రంగా పెట్టుకున్నారు. రాజకీయ కోణంలో తన అధ్యక్షుడు అమిత్ షాను ప్రయోగిస్తూ మరోవైపున కేంద్ర అధికారాన్ని రాష్ట్రాలపై రుద్దడం ప్రారంభించారు. ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో కాంగ్రెస్ నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించి అక్రమ మార్గంలో పెత్తనం చేజిక్కించుకోవడంలో కాంగ్రెస్‌ను మించిపోయారు. అవన్నీ సుప్రీం కోర్టులో బెడిసికొట్టినా సరే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత గోవాలోనూ, మిజోరాంలోనూ అధికారంలోకి రావడానికి అదే అనుచిత పద్ధతులకు పాల్పడ్డారు. అయినా దెబ్బతిన్న చోట సిబిఐని లేదా ఇతర అధికారాలను ఉపయోగించి ప్రత్యర్థులపై వేట సాగిస్తున్నారు.

రాష్ట్రాలపై ద్విముఖ దాడి

మోడీ అధికారంలోకి రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి రాష్ట్రాలకు నిధుల కేటాయింపును తమ గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. నోట్ల రద్దు వంటి అతి పెద్ద నిర్ణయంలో కూడా ముఖ్యమంత్రులను విశ్వాసంలోకి తీసుకోలేదు. జిఎస్‌టి విషయంలో రాష్ట్రాలు ప్రతిపక్షాలు కూడా సహకారం అందించినా సరే తుది పన్ను రేట్లు నిర్ణయించేప్పుడు సంప్రదిస్తామన్న హామీని వమ్ము చేశారు. తమిళనాడులో జయలలిత అనారోగ్యాన్ని, మరణాన్ని అవకాశంగా తీసుకుని అన్నా డిఎంకె వర్గాలను అదుపులోకి తెచ్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని ఇతర కేటాయింపులను ప్రహసనంగా మార్చి వేయడమే గాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రధాని ఇంటర్వ్యూ కూడా గగనమయ్యే పరిస్థితి తీసుకొచ్చారు. ఇంకో వైపున వైసీపీని కూడా లోబర్చుకునే ప్రయత్నాలు జరిగాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ మొదటి నుంచి అన్నా డిఎంకె ఎంజిఆర్ తరహాలో కేంద్రంతో మంచిగా వుండాలనే సూత్రాన్ని పాటిస్తూ మోడీని పొగడ్డంలో బిజెపినే మించిపోయినా కేటాయింపుల విషయంలో ఫిర్యాదులున్నాయి. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వాన్ని చిక్కుల్లో పెట్టేందుకు గవర్నర్‌ను, సంఘ పరివార్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. అక్కడ ఆరెస్సెస్ సిపిఎం ఘర్షణలను ఏకగ్రీవంగా చిత్రిస్తూ శాంతి భద్రతలకే భంగం చేస్తున్నారు. కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ స్వయంగా పర్యటించి బెదిరింపు వాతావరణం సృష్టించారు. ఆగష్టు 15న స్వయంగా ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ నిబంధనలకు విరుద్ధంగా కేరళలో ఒక పాఠశాలలో జాతీయ పతాకం ఎగరేసి 'జనగణమన'కు బదులు 'వందేమాతరం' ఆలపించి వచ్చారు. త్రిపురలోనూ అటు బిజెపిలోకి ఫిరాయింపులు... ఇటు ముఖ్యమంత్రినే అవమానించే ఘటనలు జరుగుతున్నాయి. ఇక ఎంతో సున్నితమైన కాశ్మీర్ అదుపు తప్పి పోవడానికి కారణమవడమే గాక రాజ్యాంగంలో ఆ రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక నిబంధనలను కూడా తోసిపుచ్చుతున్నారు. పరిమిత రాష్ట్ర ప్రతిపత్తి మాత్రమే వున్న ఢిల్లీ ప్రభుత్వాన్ని అడుగడుగునా వెంటాడుతూ దాదాపు మంత్రులందరినీ ఏదో ఒక కేసులో ఇరికించారు. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్‌నూ పాత కేసుల్లో వేటాడ్డమే గాక శాంతి భద్రతల వైఫల్యం పల్లవి కూడా ఎత్తుకున్నారు. బీహార్‌లో తమతో వచ్చిన నితీష్ కుమార్‌ను వదిలేసి లాలూ కుటుంబంపై కేసులనే నడిపిస్తున్నారు. ఈ జాబితా ఇంకా చాలా వుంది.


రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్ల కోసం ఇతర ప్రభుత్వాల పట్ల వ్యూహాత్మకంగా మెతక వైఖరి చూపించిన బిజెపి ఇప్పుడు ఆ అవసరం తీరాక ఎలా ప్రవర్తిస్తుందో తెలంగాణ రాజకీయాలు చూస్తే తెలుస్తుంది. ఈ ఒత్తిడి కారణంగానే బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాను అమిత్‌షాకు తప్ప ప్రధాని మోడీకి వ్యతిరేకం కాదని ప్రకటించారు. లోగడ కెసిఆర్ కూడా షాపైనే దాడి చేయడం మనకు తెలుసు. నితీష్ మరోసారి ఎన్‌డిఎలో పున:ప్రవేశించారు. అవకాశవాదులు, నిబద్ధత లేని నీతిబాహ్య ముఖ్యమంత్రులూ ఎలాటి విన్యాసాలైనా చేయొచ్చుగాని వాస్తవంలో ఇప్పుడు రాష్ట్రాల హక్కుల కోసం బిజెపియేతర ప్రభుత్వాలన్నీ సంఘటితం కావలసిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. లేకపోతే కేంద్రం రాజ్యాంగ దుర్వినియోగం, బిజెపి రాజకీయ మాయోపాయాలు మరింత ముదిరిపోయి ముప్పుగా మారతాయి.


(రచయిత రాజకీయ విశ్లేషకులు)

చీకటి రాజ్యంలో దీపాలు అవసరం

చర్చ

డాక్టర్ చుక్కా రామయ్య





ఏది నిజమో, ఏది అబద్ధమో తేల్చుకోలేని స్థితిలో దేశం చీకటిలో మగ్గుతున్నప్పుడు వెలుగునిచ్చే దీపాలు రావాలి. మూఢ నమ్మకాలను సమర్థంగా తిప్పికొట్టే గొంతుకలు విన్పించాలి. ఉద్యమాలను అణిచివేసే పాలకుల ధోరణులను తిప్పికొట్టే ధైర్యాన్ని కూడగట్టుకొని ముందుకు సాగి పోరాటం కొనసాగించే నికార్సయిన శాస్త్రవేత్తలు కావాలి. వాస్తవాలను ప్రజలకు వివరించే సైన్యం తయారు కావాలి.

భారత 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎప్పటిలాగే అట్టహాసంగా ముగిశాయి. ప్రధాని నరేంద్ర మోడీ ఎర్రకోట పై నుంచి మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నవ భారత నిర్మాణమే ధ్యేయంగా సామరస్యతతో ప్రభుత్వం ముందుకెళ్తుందని, విశ్వాసాల పేరుతో హింసకు పాల్పడితే సహించేదిలేదని సందేశమిచ్చారు. బ్రిటిష్ నిరంకుశ ప్రభుత్వ పాలనకు ఎదురొడ్డి నిలిచి పోరాటం చేసిన ఎంతోమంది మహనీయుల ప్రాణ త్యాగాల ఫలితమే నేటి మన స్వాతంత్ర్య భారతం. ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆలోచిస్తూ తమ జీవనాన్ని ఆనందమయంగా గడపాలని నాటి త్యాగధనులు భావించారు. ఎలాంటి నిబంధనలు లేని జీవనాన్ని, స్వేచ్ఛను, మూఢ విశ్వాసాల రహిత సమాజాన్ని కాంక్షిస్తూ తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలి దేశభక్తి చాటుకున్నారు. మరి ఆ గొప్ప దేశభక్తుల ఆలోచనలను మనం ఎంతవరకు భవిష్యత్తు తరాలకు తెలియజెప్తున్నాం. వివిధ మతాలు, జాతులు, వర్గాల ప్రజల సమాహారం కలిగిన అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు ఎంత స్వేచ్ఛగా బతుకుతున్నారు? ఎంత స్వతంత్రంగా తమ భావాలను, అభిప్రాయాలను వ్యక్తీకరించగలుగుతున్నారు? మూఢ విశ్వాసాలను పారద్రోలి సమాజంలో శాస్త్రీయ ఆలోచనను తీసుకొచ్చేందుకు మన ప్రభుత్వాలు ఏ మేరకు కృషి చేస్తున్నాయి? అనేది ఈ సందర్భంగా ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

సమాజంలో మూఢవిశ్వాసాలు రెట్టింపు అవుతున్న ప్రమాదకరమైన పరిస్థితుల్లో ... మరిన్ని ఉద్యమాలకు పదును పెట్టాల్సిన తరుణంలో... శాస్త్ర సాంకేతిక రంగానికి ఎనలేని సేవలందించిన పీఎం భార్గవ, యశ్‌పాల్, యు.ఆర్.రావు ఈ ఏడాదిలో మృతి చెందడం దేశానికి తీరని లోటు. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ ముగ్గురు మహనీయులు చేసిన కృషి ఎంతో శ్లాఘనీయం. వారి ఆలోచనల్ని, ఆవిష్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా మరికొందరు వ్యక్తులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఏది నిజమో, ఏది అబద్ధమో తేల్చుకోలేని స్థితిలో దేశం చీకటిలో మగ్గుతున్నప్పుడు వెలుగునిచ్చే దీపాలు రావాలి. మూఢ నమ్మకాలను సమర్థంగా తిప్పికొట్టే గొంతుకలు విన్పించాలి. ఉద్యమాలను అణిచివేసే పాలకుల ధోరణులను తిప్పికొట్టే ధైర్యాన్ని కూడగట్టుకొని ముందుకు సాగి పోరాటం కొనసాగించే నికార్సయిన శాస్త్రవేత్తలు కావాలి. వాస్తవాలను ప్రజలకు వివరించే సైన్యం తయారు కావాలి. 2015లో మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన హేతువాద మేధావి, హంపీ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఎం.ఎం.కుల్బుర్గి హత్య, ఈనాడు గోవధ నిషేధం పేరిట దేశంలో జరుగుతున్న వివిధ రకాలైన దాడులు దేనికి సంకేతం. దేశంలోని ప్రధాని లాంటి మనిషి ఖండిస్తున్నప్పటికీ ఇలాంటి ఘటనలు దేశంలో చోటు చేసుకుంటుండటం ప్రజలకు ఎలాంటి సంకేతాలను పంపుతుంది. అందువల్ల ప్రభుత్వాధినేతలు ఎవరైనా కేవలం ఖండిస్తూ ప్రకటనలు మాత్రమే చేసినదానికన్నా.. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటే ప్రజలు విశ్వసిస్తారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. అన్నం పెట్టే రైతన్న ఇంట్లోనే ఆకలి చావులు సంభవిస్తున్నాయి. ఆడ పిల్లలకు ఇంట్లోనూ, బయటా రక్షణ కరువవుతోంది. మనుషుల్లో నైతికత కరువవుతోంది. ఇలాంటి ఎన్నో సామాజిక రుగ్మతలను రూపు మాపినప్పుడే స్వాతంత్ర్యం కల నెరవేరుతుంది.

స్వేచ్ఛ అంటే కేవలం విదేశీయుల పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. స్వతంత్ర ఆలోచనల్ని ప్రోత్సహించడం. కానీ ప్రస్తుతం మన దేశంలో ఛాందస భావాలు, ఫండమెంటలిజం మనుషుల్ని కమ్మేస్తోంది. దీనికి తోడు విపరీతంగా సోషల్ మీడియాలో విస్తరిస్తోన్న సందేశాలు ప్రజల్ని తీవ్ర అయోమయంలోకి నెడుతున్నాయి. ఏది నిజమో, ఏది కల్పితమో తెలుసుకోలేని ప్రజలు గందరగోళంలో పడుతూ అనేక అనుమానాలు, అపోహల మధ్య గడుపుతున్నారు. ఇదెంతో ప్రమాదకరమైన పరిస్థితి. బ్రిటిష్ వాళ్ల నుంచి ఏ స్వేచ్ఛ కోసం ఆ త్యాగధనులు పోరాటాలు చేశారో.. వాటికే తిలోదకాలిస్తుండటం సిగ్గుచేటు. ఆ మహనీయుల త్యాగాలకు మనం ఇచ్చే విలువ ఇదేనా? ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఏ పని చేసినా దాన్ని దేశభక్తితో ముడి పెట్టడం పరిపాటిగా మారింది. ప్రతి అంశాన్ని పవిత్రమైన దేశభక్తి అంశంతో ముడిపెడుతూ అపహాస్యం చేసే ప్రమాదకరమైన పరిస్థితులు దాపురించాయి. మరి ఇలాంటి వాటిపై ప్రభుత్వాలు ఏం చర్యలు తీసుకున్నాయో, ఆ దిశగా ఎంత వరకు అడుగులు వేస్తున్నాయో చెప్పాల్సిన అవసరం ఉంది. 'ఎత్తయిన బిల్డింగ్‌లు కట్టాం, ఫ్లైఓవర్ వంతెనల్ని నిర్మించాం' అని చెప్పేదానికన్నా.. పాఠశాలల్లో శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకొస్తున్నాం. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొదిస్తున్నాం. యూనివర్సిటీల్లో విద్యార్థుల ఆలోచనల్ని ప్రోత్సహిస్తూ ఏ మేరకు కొత్త పరిశోధనలకు వూతమిస్తున్నాం. దశల వారీగా పేదరికాన్ని రూపుమాపుతున్నాం. ప్రజల భావప్రకటనా స్వేచ్ఛను పరిరక్షిస్తున్నాం. ఆయా కుల, మత, వర్గాల ప్రజల అలవాట్లకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా స్వేచ్ఛగా ఈ దేశంలో బతకనిస్తున్నాం' అని ప్రభుత్వాలు చెప్పగలిగితే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల ఆత్మలు శాంతిస్తాయి.

దేశంలో సైన్స్ రంగంపై జరుగుతున్న దాడిని ఎదుర్కొంటూ.. విస్తరిస్తున్న మూఢవిశ్వాసాల నుంచి ప్రజల్ని చైతన్య పరిచేందుకు కొత్తవారు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. అశాస్త్రీయమైన ప్రచారాలతో ప్రజల్ని భ్రమలకు గురిచేయడం పాలకులకు రివాజుగా మారిపోయింది. దేశవ్యాప్తంగా భవిష్యత్తులో జరిగే వివిధ సదస్సుల్లో శాస్త్రీయమైన ఆలోచనల్ని ఏవిధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి? కొత్తగా ఏంచేయాలనే దానిపై శాస్త్రవేత్తలు, ప్రజాస్వామికవాదులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. అందుకనుగుణంగా ప్రణాళికలు రచించుకోవాలి. పాఠశాలల్లో శాస్త్రీయ ఆలోచన తీసుకొచ్చేందుకు వీలుగా కమిటీలు రూపొందాలి. ఎన్జీవో సంస్థలు కూడా ఇందుకు ముందుకొచ్చి 'మూఢాచారాలను నమ్మొద్దు- సైన్స్‌ను నమ్మండి' అంటూ క్యాంపెయిన్‌లు పెడితే బాగుంటుంది. పత్రికల్లో శాస్త్రీయ ఆలోచనల్ని ప్రోత్సహించే కథనాలు పెద్ద ఎత్తున రావాల్సిన అవసరం ఉంది.

(రచయిత ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు)

మెయిల్ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే- మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్ అడ్రస్ :

editpageps@gmail.com



ఫిదాతో కొత్త చైతన్యం

అంతా నిశ్శబ్ధంగా ఉన్నప్పుడు ఓ చప్పుడవుతుంది. అది గొంతులను దాటి పిడికిళ్లు బిగిసుకునేంత నినాదమవుతుంది. అదే కొందరి ఉనికి, అస్థిత్వం, బతుకు మజిలీ, బలమైన కోరిక. సమస్య ఎదురుపడ్డ చోట వారి గొంతు వినపడుతుంది.. పిడికిలి బిగుసుకుంటుంది.. కలం కదులుతుంది. రాజ్యం లాఠీ దెబ్బలనిస్తుందనీ తెలుసు.. ఊచల వెనుక నిలబెడుతుందనీ తెలుసు.. అయినా ఆ అడుగుల్లో అదురుండదు.. బెదురుండదు. సరిగ్గా అలాంటి అమ్మాయే చైతన్య పింగళి. నాన్న చేతుల్లో నలిగిన మహాప్రస్థానాన్ని ప్రేమగా నిమురుకుంటూ.. బడి వయసు నుంచే శ్రీశ్రీ వేలు పట్టుకుని నడిచింది. కడుపులో బిడ్డను మోస్తూ ప్రపంచానికి చిట్టగాంగ్ వీర వనితల గురించి చెప్పింది. దళితుల.. ట్రాన్స్‌జండర్ల కష్టాలు.. కన్నీళ్లనూ కథలను చేసింది. కొత్తగా 'ఫిదా' సినిమాలో మాట, పాటల భాగస్వామ్యంతో తనలోని కొత్తకోణాన్ని ప్రదర్శించింది. ఇలా రచయితగా, యాక్టివిస్ట్‌గా తన జీవితపు అనుభవాలు, ఫిదా సినిమాతో పంచుకున్న అనుభూతులను చైతన్య మాటల్లోనే విందాం!!

మాది కృష్ణాజిల్లా కోదాడ దగ్గరలోని నందిగామ. స్కూలింగ్ అంతా ఊర్లోనే సాగింది. డిగ్రీ రెండు సంవత్సరాలు విజయవాడలో చదివా. మూడో సంవత్సరం హైదరాబాద్‌లో పూర్తిచేశాను. ఆ తర్వాత నుంచీ హైదరాబాద్‌లోనే ఉంటున్నాను. నాకు మూడేళ్ల వయసు ఉన్నప్పుడే నాన్న చనిపోయారు. నాన్నది పొలిటికల్ మర్డర్ అవ్వడంతో.,. అమ్మ ఆ విషయాలు మా వరకూ చేరకుండా ఉండటానికే ఎక్కువగా ప్రయత్నించేది.

నడిపిస్తోన్న మహాప్రస్థానం

అమ్మ ఒకరోజు నాన్న చేతిలో ఎప్పుడూ ఉండే శ్రీశ్రీ మహాప్రస్థానాన్నీ నాకు, తమ్ముడికేమో నాన్న వాచ్‌ని గిఫ్ట్‌గా ఇచ్చింది. తమ్ముడికి ఇచ్చిన వాచ్ ఆగిపోయింది.. కానీ మహాప్రస్థానం మాత్రం నన్ను ఇప్పటికీ నడిపిస్తూనే ఉంది. నాకు మొదటగా ప్రశ్నించడం నేర్పిందీ.. ఆలోచించడం నేర్పిందీ.. మహాప్రస్థానమే. ఆ తర్వాత "అంటరాని వసంతం, ఏడు తరాలు, స్పార్టకస్" అంటే నాకు బాగా ఇష్టం. చలం, అరుంధతీరాయ్, మద్దూరి నగేష్‌బాబుల రచనలు నాకు బాగా నచ్చుతాయి.

చిట్టగాంగ్ అలా పుట్టింది

ఇప్పుడు.. వెనక్కి తిరిగి చూసుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. మొదట్లో కొద్దిగా కవిత్వం రాశాను. కానీ అవన్నీ పత్రికలకూ, వీక్లీలకూ ఎలా పంపాలో తెలిసేది కాదు. డిగ్రీ తర్వాత విజయవిహారం అనే పత్రికలో చేరాను. ఆ తర్వాత ఫ్రీలాన్సర్‌గా కొన్ని పత్రికలకు రాశాను. కానీ అవేవీ పెద్దగా సంతృప్తినివ్వలేదు. నాకు ప్రెగ్నెన్సీ సమయంలోనే చిట్టగాంగ్ కల్పనాదత్ కథను చదివాను. అదే సమయంలో నిర్భయ ఘటన జరిగింది. ఇవన్నీ చూశాక చిట్టగాంగ్ వనితల కథ ప్రపంచానికి తప్పక తెలియజేయాల్సిందనిపించి.. రాయడం మొదలుపెట్టాను. రాశాక ఆ పుస్తకానికి 2016లో సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. ఆ తర్వాత 'మనసులో వెన్నెల' అనే కథల సంపుటిని తెచ్చాను.



సమస్యలే.. రాసేలా చేశాయి

సాహిత్యపరంగా నా రచనాశైలి అంత గొప్పగా ఉన్నట్టు నాకైతే అనిపించదు. కానీ నన్ను కుదిపేసిన ఎన్నో సమస్యలే నన్ను ముందుకు నడిపించేవి... రాసేలా చేసేవి. అవే 'మనసులో వెన్నల' కథలుగా పుట్టాయి. నాకు థర్డ్ పర్సన్ ఫ్రెండ్స్ ఉన్నారు. వాళ్ల జీవితాలనూ, బాధలనూ కథల ద్వారానే చెప్పాను. ముందు పత్రికలకు పంపాను. అయితే రెండు కథలను వేయడానికి చాలా పత్రికలు ఒప్పుకోలేదు. నాకు అవే బాగా ముఖ్యమనిపించాయి. దాంతో నేనే పుస్తకం తెచ్చాను.

యాక్టివిస్ట్‌గానే గర్వపడతాను

నిజానికి 'మనసులో వెన్నెల' పుస్తకం తర్వాతనే నేను ఎక్కువమందికి పరిచయమయ్యాను. దానికి ముందు ఎన్నోసార్లు అనేక ధర్నాల్లో పాల్గొన్నాను. లాఠీదెబ్బలూ తిన్నాను. కానీ అప్పుడు చిన్న పరామర్శ చూడలేదు. కానీ, చిన్న కథ రాయగానే వచ్చిన గుర్తింపుకి ఆనందపడాలో, బాధ పడాలో అర్థంకాదు. నిజానికి బాధే ఉంటుంది. ఏమైనా యాక్టివిస్టుగానే నా జీవితం బాగుందని అనుకుంటాను. యాక్టివిస్ట్‌గా ఉండటానికే గర్వపడతాను కూడా.

భాగస్వామి ప్రోత్సాహం

ముందుగా అనుకున్న ప్రకారం 'ఫిదా' సినిమా స్క్రిప్ట్ పని అయ్యాక తిరిగి వచ్చేద్దామనుకున్నాను. కానీ అక్కడికి వెళ్లాక 'ఫిదా' టీంతో స్నేహం బాగా కుదిరింది. నాకు కూడా ఎప్పటి నుంచో డాక్యుమెంటరీలు తీయాలని కోరిక ఉండేది. ఇరోంషర్మిలాపై డాక్యుమెంటరీ తీద్దామనుకున్నాను. దాంతో ఇక అసిస్టెంట్ డైరెక్టర్‌గానూ పనిచేశాను. మూడు నెలల్లో అయిపోతుందనుకున్న సినిమా.. హీరో కాలికి దెబ్బ తగలడంతో సంవత్సరం పట్టింది. నాకో చిన్నబాబు ఉన్నాడు. ఆ సమయంలో నా జీవిత భాగస్వామి బాలూనే మొత్తం చూసుకున్నారు.

శేఖర్.. ప్రత్యేకత వేరు

శేఖర్ చాలా మంచివ్యక్తి. నేను 'ఫిదా'కు పనిచేసినప్పుడు చూశాను. కథను తయారుచేసుకునేటప్పుడు బయటకు చెప్పలేనన్ని ఒత్తిడులకు తలొగ్గాల్సి ఉంటుంది. నాకు తెలిసీ శేఖర్ ఇండస్ట్రీలో చాలా ప్రత్యేకతగల వ్యక్తి. ఆ మూసపద్ధతులకు అలవాటుపడలేదు. అమ్మాయిలకి గౌరవమైన పాత్రలు ఇస్తారు. కొన్నికొన్ని చోట్ల నాకూ బేధాభిప్రాయాలు ఉన్నా... పర్సనల్‌గా కానీ, సినిమాపరంగా కానీ శేఖర్ ఆడవారి పట్ల గౌరవంగా ఉంటారు. జీవతంలోనూ, సినిమాలోనూ చాలా డెమొక్రెటిక్‌గా ఉంటారు.

డాక్టర్ సాయిపల్లవి

సాయిపల్లవిని చూసి చాలా షాక్ అయ్యాను. అవలీలగా ట్రాక్టర్ నడిపేసింది. ఆ అమ్మాయి ఎంబీబీస్ కంప్లీట్ చేసుకుని ఇక్కడికి వచ్చింది. మళ్లీ ఇప్పుడు పీజీ చేయటానికి వెళ్లింది. తనకు డాక్టర్‌గా స్థిరపడాలని కోరిక. ఈ సినిమా తెలంగాణలోని బాన్సువాడ అనే పల్లెటూరులో చేశాం. ఆ అమ్మాయి లైట్‌బాయ్స్‌తోనూ, పనివాళ్లతోనూ చక్కగా కలిసిపోయేది. అక్కడ పనిచేసుకునేవాళ్ల పాపకు కళ్లకు సమస్య వస్తే.. తానే చెక్ చేసి, మందులన్నీ తన డబ్బులతోనే తెప్పించింది. ఈ కథలో ఆ అమ్మాయిది బలమైన పాత్ర. సామాన్యంగా ఇప్పటి హీరోలు ఇలాంటి కథను ఒప్పుకోవడం కష్టం. అదీ వరుణ్‌లాంటి హీరో అయితే ఒప్పుకోడనే అనుకున్నాం. కానీ ఒప్పుకోవడమే కాదు.. చాలా బాగా చేశాడు.

నాన్నగా చేసిన సాయ్‌చంద్ పుస్తకాల పురుగు. బాగా చదువుతారు. మేమిద్దరం ఎక్కువగా సాహిత్యం, పుస్తకాల గురించే మాట్లాడుకునేవాళ్లం. కొత్తగా పుస్తకం కూడా తీసుకురాబోతున్నారు. ఆయన 'మా భూమి' గురించి చెప్తుంటే.. అప్పటి విషయాలన్నీ భలే అనిపించాయి. మళ్లీ అలాంటి సినిమా రావాలంటే కమిట్‌మెంట్ ఉన్నోళ్లు రావాలి.

ఇంటర్వ్యూ : సిద్ధార్థ కట్టా

వస్తువుగా చూడ్డం బాధే

సినిమా అంటే చాలా కష్టం. ఆ వాతావరణం పూర్తిగా వేరు. ఇక్కడ అమ్మాయిలు ఒదగటం చాలా కష్టం. ఇదొక పక్కా పెట్టుబడిదారీ బిజెనెస్ విధానం. కొన్నిమాటలు అయితే వినటానికే ఇబ్బందిగా ఉంటాయి. 'ఐటం గార్ల్, ఐటం సాంగ్' అంటూ వస్తురూపంలో అమ్మాయిని మాట్లాడటం చాలా దారుణంగా అనిపిస్తుంది. మనమందరం రొటీన్ సినిమాలకు బాగా అలవాటుపడిపోయాం. 'పింక్' లాంటి సినిమాలను అయితే మనం ఊహించలేం. అసలు తాప్సీని తీసుకొచ్చి.. మనం ఏం చేయించాం ఇక్కడ. అక్కడ అమ్మాయి యాక్టింగ్ చూశాక ఆశ్చర్యం వేసింది. ఈ పద్ధతి మారాలి. గవర్నమెంట్ ఫిలిం ఇనిస్టిట్యూట్ పెట్టాలి. పల్లెల నుంచి వచ్చేవారు కూడా తమతమ కథలను ప్రపంచానికి చెప్పగలగాలి.



చెప్పాల్సిందంతా అబ్బాయిలకే



అమ్మాయిలకంటూ ప్రత్యేకించి చెప్పేదేమీ లేదు. చెప్పాల్సిదంతా అబ్బాయిలకే. అమ్మాయిలు బాగా చదువుకుంటున్నారు. అమ్మాయిలు మారుతూ ఉన్నారు. అబ్బాయిలే అర్థంచేసుకునే స్థాయి పెంచుకోవాలి. అమ్మాయిలు ఈ రోజు బయటికొచ్చి అబ్బాయిలతో సమానంగా క్లాస్‌రూంలో కూర్చుంటున్నారు. అనేక ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. అందుకే.. అబ్బాయిలు అమ్మాయిల గురించి ఆలోచించాలి. అమ్మాయిలకు స్కూల్స్‌లోనూ, కాలేజీల్లోనూ, బయటా టాయిలెట్స్ కూడా సరిగ్గా ఉండటంలేదు. మంచినీళ్లు తాగితే యూరిన్‌కు వెళ్లాల్సి వస్తుందని తక్కువ తీసుకుంటారు. కిడ్నీల్లో రాళ్ళకు, మరికొన్ని వ్యాధులకు ఇదే ప్రధానకారణం. ఈ రోజుకూ అమ్మాయిలు ప్రతిదానికీ సర్దుకుపోవాల్సి వస్తోంది. శానిటరీప్యాడ్స్‌పై పన్ను విధించడం లాంటివి మరీ దారుణమైన విషయాలు. ఇవన్నీ అబ్బాయిలూ తెలుసుకోవాలి. అందరూ కలసి పోరాడే సాధించుకోవాలి.

- చైతన్య


Chaithanyapingali@gmail.com

జీవన సౌరభం

ఒక ధ్యేయంతో కృషి చేస్తే, నేడు కాకపోయిన రేపయినా విజయం తప్పదు.

మీ కోసం

ఉదయాన్నే కనీసం అరలీటరు నీటిని తాగడం వల్ల 24 శాతం శరీర మెటబాలిజాన్ని పెంచుతుంది. బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది.



సెల్‌ఫోన్‌తో జాగ్రత్త!!



కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లు లేని ప్రపంచాన్ని నేడు ఎవరమూ ఊహించలేము. ముఖ్యంగా ఈ రోజుల్లో ప్రతిఒక్కరికీ సెల్‌ఫోన్ ఒక తప్పనిసరి అవసరంగా మారిపోయింది. అయితే..

✧ సెల్‌ఫోన్‌లు, సెల్‌ఫోన్ టవర్లు సమాచారానికి సంబంధించిన సంకేతాలను ఒకచోటి నుంచి మరోచోటికి పంపేందుకోసం అత్యంత శక్తిమంతమైన సూక్ష్మతరంగాలను (మైక్రోవేవ్స్) ఉపయోగిస్తాయి. ఎక్సరేలలాగా ఈ తరంగాలు కూడా అతిసులభంగా మన శరీరంలోకి చొచ్చుకుపోగలుగుతాయి. ఇలా శరీరంలో నుంచి ప్రయాణించే ఈ సూక్ష్మ తరంగాలు మన శరీరకణాల్లో కొన్ని అవాంఛనీయమైన మార్పులను తీసుకొస్తాయని, అవి దీర్ఘకాలంలో మనకు ప్రమాదకరంగా పరిణమిస్తాయని కొందరు నిపుణులు చెబుతున్నారు. వారు చెప్పేదాని ప్రకారం..

✧ సెల్‌ఫోన్‌లకు సంబంధించిన తరంగాలు పెద్దవారి మెదడుపై కంటే పిల్లల మెదడుపై మూడురెట్లు అధికంగా ప్రభావాన్ని చూపుతాయి.

✧ మనలో ఎడమభాగపు మెదడు కన్నా కుడిభాగపు మెదడు సున్నితంగా ఉంటుంది. అందుకని సెల్‌లో మాట్లాడేటప్పుడు ఎడమ చెవినే ఎక్కువగా ఉపయోగించడం మంచిది.

✧ సెల్‌ఫోన్ ఎంత చిన్నగా ఉంటే తరంగాల వల్ల కలిగే దుష్ప్రభావం అంత ఎక్కువగా ఉంటుంది. సెల్‌ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడటం మన ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. సాధ్యమైనంతవరకు సెల్‌ఫోన్‌లో క్లుప్తంగా మాట్లాడటం మంచిది. ★



టవల్‌తో.. తడిజుట్టుకు సమస్యే





తలస్నానం తరువాత చాలా మంది ముఖ్యంగా మహిళల్లో జుట్టు ఆరడానికి టవల్‌ను ఉపయోగిస్తుంటారు. అయితే తడిజుట్టు చుట్టూ టవల్‌ని చుట్టేయడం వల్ల సమస్య తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

✧ టవల్ పట్టుకోవడానికి సున్నితంగా అన్పించినా రఫ్‌గానే ఉంటుంది. అందులోనూ ఫ్రైబ్రిక్ లేదా టెర్రీ టవల్‌ను వాడితే వెంట్రుకల కొసలు తెగి, జుట్టు అనారోగ్యానికి గురౌతుంది.

✧ పొడిగా ఉండే జుట్టు కన్నా, తడి జుట్టు ప్రమాదానికి లోనయ్యే అవకాశాలు చాలా ఎక్కువ. ఎందుకంటే నీటిలో నానిన జుట్టు, స్థితిస్థాపకత కలిగి తెగిపోవటానికి సులువుగా ఉంటుంది. ఇలాంటి సమయంలో కఠినంగా, పొడిగా ఉండే టవల్ లేదా టెర్రీ టవల్‌తో జుట్టు లాగటం వలన మృదువుగా ఉండే టవల్ దాటికి వెంట్రుకల బయటిపొర ప్రమాదానికి గురై, జుట్టు రాలిపోతుంది. దీనికి బదులుగా కఠిన నిర్మాణంగల టవళ్లకు బదులుగా నీటిని గ్రహించే టవల్, మైక్రోఫైబర్ టవళ్లను వాడాలి.

✧ మైక్రోఫైబర్ టవళ్లు కృత్రిమ ఫైబర్ల నుంచి తయారుచేస్తారు. ఇవి నీటిని త్వరగా జుట్టు నుంచి పీల్చుకుంటాయి. దీనివల్ల తక్కువ సమయంలోనే గాలికి జుట్టు ఆరుతుంది.

✧ సహజంగా గాలి ద్వారా ఆరబెట్టడమే ఉత్తమమైన పద్ధతి.

✧ కొంతమంది జుట్టును ఆరబెట్టడానికి హెయిర్ డ్రయర్‌లను వాడతారు. వీటి వలన జుట్టు ఆరోగ్యం ప్రమాదానికి గురవుతుంది.

✧ స్నానం చేసిన తరువాత, మృదువుగా ఉండే టవల్ లేదా షర్ట్ ను జుట్టుపై కప్పండి, ఇలానే కొద్ది సమయం ఉంచటం వలన సహజంగానే జుట్టు ఆరిపోతుంది.

✧ జుట్టుని పునరుద్దరించుకోవాలంటే మీ జుట్టుకు సరిపోయే షాంపూ మరియు కండిషనర్ ను వాడటం ముఖ్యం. ★

సెన్సెక్స్ ▼ 266
31,258

నిఫ్టీ ▼ 83
9,754

రూపాయి ▲ 01 పైసలు
ఒక అమెరికా డాలరుకు రూ. 64.15

టిటికె ప్రెస్టీజ్ నుంచి కొత్త బ్రాండ్

బెంగళూరు : వంటింటి ఉపకరణాలను అందించే టిటికె ప్రెస్టీజ్ బ్రిటన్‌కు చెందిన 'జడ్జ్' బ్రాండ్‌ను భారత్ మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్లు ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో నూతన వినియోగదారులను చేరుకునేందుకు, విస్తరించేందుకు ఈ కొత్త బ్రాండ్ దోహదం చేయనుందని టిటికె గ్రూపు ఛైర్మన్ టిటి జగన్నాథన్ ఆశాభావం వ్యక్తం చేశారు. జడ్జ్ బ్రాండ్ 120 ఏళ్ల నుంచి ప్రపంచ మార్కెట్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుతో కొనసాగుతుందన్నారు.

మార్కెట్లోకి యమహా ఫజర్ 25

న్యూఢిల్లీ : యమహా ఇండియా స్పోర్ట్ బైకు విభాగంలో 'ఫజర్ 25' ద్విచక్ర వాహనాన్ని మార్కెట్లోకి విడుదల చేసింది. న్యూఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద దీని ధర రూ.1,29,335గా నిర్ణయించింది. ఈ బైకు లైట్ వెయిట్ ఫ్రేమ్‌పై నూతనంగా డిజైన్ చేయబడిందని ఆ కంపెనీ పేర్కొంది. 249 సిసి, 4 స్ట్రోక్, 2 వాల్వ్, సింగిల్ సిలిండర్, ఫ్యూయల్ ఇంజెక్టడ్ ఇంజిన్‌తో అందుబాటులోకి తెచ్చింది. వచ్చే సెప్టెంబర్ నుంచి ఈ ద్విచక్ర వాహనాలను వినియోగదారులకు అందించనున్నామని యమహా మోటార్ ఇండియా సేల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మసాకీ అసాకో తెలిపారు. దీన్ని రెండు రంగుల్లో అందిస్తున్నామన్నారు.

ఈ బైకు ప్రీమియం సెగ్మెంట్‌లో బజాజ్ పల్సర్ ఆర్ఎస్200, హోండా సిబిఆర్, కేటీఎం ఆర్‌సి 200 మహీంద్రా మోజో, కావాసాకి జెడ్ 250, రాబోయే టివిఎస్ అపాచే 310 వంటి వాటికి గట్టిపోటీ ఇవ్వనుందని మార్కెట్ వర్గాల విశ్లేషణ.



ఫజర్ 25ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న యమహా ఇండియా ప్రతినిధులు

విశ్వాసం సన్నగిల్లుతోంది..!

- దేశ ఆర్థికంపై ప్రజల మాట
- ఉపాధి, జీవన ప్రమాణాలపై అనిశ్చితి
- మాస్టర్‌కార్డ్ సంస్థ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వం దేశం అభివృద్ధి చెందుతోందని సర్కారు ప్రకటనలు చేస్తున్నప్పటికీ ప్రజలు మాత్రం వాటిని పూర్తిగా విశ్వసించే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలైతో ముగిసిన మొదటి అర్థ భాగంలో భారత ఆర్థిక వ్యవస్థపై వినియోగదారుల విశ్వాసం భారీగా తగ్గిపోయిందని మాస్టర్‌కార్డ్ సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. అంతకు ముందు జులై–డిసెంబరు మధ్య కాలంతో పోలిస్తే వినియోగదారుల విశ్వాసం ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో బాగా దెబ్బతిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశంలో జీవన ప్రమాణాలు బాగా ప్రభావితమైనట్టుగా పేర్కొంది.

మాస్టర్ కార్డ్ సంస్థ సోమవారం 'కన్జ్యూమర్ కాన్ఫిడెన్స్ సూచీ' వివరాలను వెల్లడించింది. ఈ నివేదికలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని 19 మార్కెట్లలో మొత్తం 11 మార్కెట్లలో వినియోగదారుల విశ్వాసం నిలకడగా ఉందని సంస్థ పేర్కొంది. భారత్‌లో వినియోగదారుల విశ్వాసం సన్నగిల్లుతున్నప్పటికీ ఆశావాద విభాగంలోని నిలిచి ఉందని పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్– జూన్ మధ్య కాలంలో 18 నుంచి 64 ఏండ్ల మధ్య వయస్కులైన దాదాపు 9,153 మంది నుంచి వారివారి ఆర్థిక వ్యవస్థల పట్ల అభిప్రాయ సేకరణ జరిపిన అనంతరం మాస్టర్ కార్డ్ ఈ నివేదికను విడుదల చేసింది.

ఆర్థిక వ్యవస్థ, ఉపాధి అవకాశాలు, నిరంతర ఆదాయ అవకాశాలు, స్టాక్ మార్కెట్లు, జీవన ప్రమాణాలలో పరిణామాలను గురించి ఆయా దేశాల్లో ప్రజలు అభిప్రాయాలను మాస్టర్ కార్డ్ సమీకరించి ఈ నివేదికను తయారు చేసింది. భారత్ విషయానికి వస్తే నివేదికకు ప్రామాణికంగా తీసుకున్న అయిదు అంశాల్లోనూ ప్రజల విశ్వాసం సన్నగిల్లుతూ కనిపించడం విశేషం. ప్రధానంగా ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం (–11.0), జీవన ప్రామాణాలు (–11.6 విభాగంలో ప్రజల్లో భారీగా విశ్వాస లోపం కనిపించింది. అయిదు విభాగాల్లో మేటి ప్రదర్శనను కనబరిచిన చైనా ర్యాకింగ్‌లో భారత్ కంటే మెరుగైన స్థానంలో నిలిచింది.

ప్రధానంగా ఉపాధి అవకాశాల రంగంలో అత్యధికంగా (12.1%) వృద్ధి కనిపించింది. దక్షిణ–కొరియా, సింగపూర్, మలేషియాలలో కూడా వినియోగదారుల విశ్వాసం పెరగడం గమనార్హం. స్టాక్ మార్కెట్లలో మెరుగైన వృద్ధి, ఉపాధి అకవాలు మెరుగవుతుండడంతో దాదాపు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వినియోగదారుల విశ్వాసం పెరగడం కనిపించింది.

జియోనీ నుంచి ఎక్స్1

న్యూఢిల్లీ : మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ జియోనీ భారత మార్కెట్లోకి ఎక్స్ 1 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. దీని ధర రూ.8,999గా నిర్ణయించింది. ఈ ఫోన్లను అన్ని ప్రముఖ రిటైల్ స్టోర్లలో విక్రయించనున్నట్లు ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా జియోనీ ఎక్స్1 కొనుగోలు చేసిన ఎయిర్‌టెల్ వినియోగదారులు ప్రతీనెలా 10జిబి అదనపు డేటాను పొందవచ్చుని పేర్కొంది. అదే విధంగా రూ.250 విలువ చేసే రెండు పేటియం వోచర్లను అందిస్తోంది. 5 అంగుళాల డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ నోగట్ 7.0 ఆపరేటింగ్ సిస్టం, 1.3 గిగాహెడ్జ్ ప్రాసెసర్, 2జిబి ర్యామ్, 8 మెగాపిక్సెల్ ముందు, వెనుక కెమేరాలు, 16జిబి అంతర్గత మెమొరీ, 3000 ఎంఎహెచ్ బ్యాటరీ సామర్థ్యం ఈ ఫోన్ ప్రత్యేక ఫీచర్లుగా ఉన్నాయి.

రష్యా కంపెనీ చేతికి ఎస్సార్ ఆయిల్

ముంబయి : భారత్‌కు చెందిన ప్రముఖ ప్రయివేటు చమురు సంస్థ ఎస్సార్ ఆయిల్ దేశంలోని తన అన్ని ఆస్తులను రష్యన్ కంపెనీ రోస్‌నెఫ్ట్‌కు విక్రయించింది. ఎస్సార్ గ్రూప్‌నకు చెందిన గుజరాత్‌లోని చమురుశుద్ధి యూనిట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆ సంస్థకు ఉన్న 3500 పెట్రోల్ బంకులను 12.9 బిలియన్ డాలర్ల (రూ.86,000 కోట్ల)కు రోస్‌నెఫ్ట్, దాని భాగస్వామ్య సంస్థలు స్వాధీనం చేసుకున్నాయి. గతేడాది అక్టోబర్‌లో గోవాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ సమక్షంలోనే ఈ ఒప్పందం కుదిరింది. కాగా ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంకు, ఎల్ఐసితో పాటు 23 రుణ సంస్థలు వాటికి రావాల్సిన రూ.45వేల కోట్ల రుణాలపై స్పష్టత కోసం కోసం తొలుత ఈ ఒప్పందానికి అడ్డు చెప్పాయి. దీంతో ఈ ప్రక్రియ 10 నెలలు ఆలస్యమయ్యింది. రుణం చెల్లింపుపై ఎస్సార్ గ్రూపు ఇచ్చిన హామీపై రుణదాతలంతా తాజాగా అంగీకరించడంతో ఒప్పందం పూర్తి అయ్యింది. ఇప్పటి వరకు దేశంలో జరిగిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఎస్సార్–రోస్‌నెఫ్ట్ ఒప్పందం కానుంది. ఈ ఒప్పందం ముగిసిన నేపథ్యంలో రుణదాతలకు రూ.70వేల కోట్లను రోస్‌నెఫ్ట్ చెల్లించనుంది. దేశంలో అత్యంత రుణ భారం కలిగిన కంపెనీల్లో ఎస్సార్ గ్రూపు ఒక్కటి. ఈ విక్రయంతో ఎస్సార్ గ్రూపు రుణ భారం 60 శాతం మేర తగ్గిపోనుందని అంచనా.

ముందస్తు 'దీపావళి' డిస్కౌంట్

రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు రద్దు
ఎస్‌బిఐ రుణ గ్రహీతలకు ఆఫర్

ముంబయి : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తన ఖాతాదారులకు ముందస్తు దీపావళి ఆఫర్‌ను ప్రకటించింది. కార్లు, వ్యక్తిగత, పసిడి తదితర రుణాలపై ప్రాసెసింగ్ ఫీజులో రాయితీ కల్పిస్తోన్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే గృహ రుణాలపై కూడా ప్రాసెసింగ్ ఫీజును తీసుకోవడం లేదు. రాబోయే పండుగ సీజన్‌ను దష్టిలో పెట్టుకుని రుణగ్రహీతలను ఆకర్షించడానికి ఎస్‌బిఐ ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. డిసెంబర్ 2017 ముగింపు వరకు కార్ల రుణాలపై పూర్తిగా ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. కాగా అక్టోబర్ 31 వరకు బంగారం రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును 50 శాతం మేర తగ్గించింది. ఎక్స్‌ప్రెస్ క్రెడిట్, వ్యక్తిగత రుణాలపై సెప్టెంబర్ 30 వరకు ప్రాసెసింగ్ ఫీజులో సగం తగ్గిస్తోన్నట్లు తెలిపింది. కాగా ఇప్పటివరకు బ్యాంక్ రుణం మొత్తంపై 0.5శాతం, కారు లోన్లపై 2శాతం, ఎక్స్‌ప్రెస్ క్రెడిట్‌పై 0.5శాతం, ద్విచక్ర వాహనాల అప్పులపై 1.5శాతం, పసిడి రుణాలపై 0.51శాతం ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేస్తోంది. దీనికి అదనంగా జిఎస్టీని కూడా వసూలు చేస్తోంది. కాగా జూన్ 2017 త్రైమాసికం ముగింపు నాటికి ఎస్‌బిఐ రిటైల్ రుణాలు 13.31 శాతం పెరిగి రూ.4,90,005 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.4,32,455 కోట్ల అడ్వాన్సులు జారీ చేసింది. ఇదే సమయంలో రూ.2,48,709 కోట్లుగా ఉన్న గృహ రుణాలు 2017 జూన్ నాటికి రూ.2,83,331 కోట్లకు చేరాయి.

చిత్తూరులో 'పరాఠా'ల ప్లాంట్

ఐఎఫ్ఎల్ వైస్ ప్రెసిడెంట్ వెల్లడి

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

వంటకానికి సిద్దంగా ఉండే ఫ్రాజెన్ ఉత్పత్తులను అందించే ఇన్నోవేటివ్స్ ఫుడ్స్ లిమిటెడ్ (ఐఎఫ్ఎల్) రాష్ట్రంలోని చిత్తూరు ఫుడ్‌పార్కులో నూతన ప్లాంట్‌ను నెలకొల్పుతున్నట్లు ప్రకటించింది. సుమెరు బ్రాండ్‌తో ఉత్పత్తులను విక్రయించే ఐఎఫ్ఎల్ సోమవారం మార్కెట్లోకి నాలుగు కొత్త 'క్లాసిక్ పరాఠా' వేరియంట్లను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఐఎఫ్ఎల్ వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ కుమార్ మాట్లాడుతూ చిత్తూరు సమీపంలోని ఫుడ్ పార్కులో ఏర్పాటు చేస్తున్న తమ నూతన ప్లాంట్ వచ్చే డిసెంబర్ ముగింపు నాటికి ఉత్పత్తిలోకి రానుందన్నారు. అయితే ఈ ప్లాంట్‌కు ఎంత పెట్టుబడి పెడుతున్నది ఆయన వెల్లడించలేదు. ప్రస్తుత ఏడాదిలో తమ రెవెన్యూ రూ.100 కోట్లను చేరనుందని అన్నారు. వచ్చే రెండేళ్లలో రూ.200 కోట్ల టర్నోవర్ చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఫ్రాజెన్ ఫుడ్ రంగంలో తమకు 10 శాతం వాటా ఉందని, పరాఠాల విభాగంలో 50 శాతం వాటా ఉందన్నారు.



సుమెరు బ్రాండ్ నూతన శ్రేణీ పరాఠాలను ఆవిష్కరిస్తున్న మాస్టర్ చెఫ్ అజయ్ చోప్రా

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం

'మితవాదయుగం' అని దేనినంటారు?



ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

భారతదేశ చరిత్ర - జాతీయోద్యమం

భారతదేశంలో జాతీయవాదం ప్రభావం వల్ల 19వ శతాబ్దంలో కొన్ని సంస్థలు ఏర్పడినాయి. 1837లో స్థాపించిన భూస్వామ్య సంఘం, 1843లో ఏర్పడిన బెంగాల్ బ్రిటీష్ ఇండియన్ సొసైటీ, దాదాబాయి నౌరోజీ 1866లో లండన్‌లో 'ఈస్టిండియా అసోసియేషన్, 1881లో ఆవిర్భవించిన మద్రాసు మహాసభ, 1885లో ఏర్పడిన బొంబాయి (ముంబయి) ప్రెసిడెన్సీ అసోసియేషన్ మొదలైన సంస్థలు నాటి విద్యాధికుల జాతీయవాదం, పౌరహక్కులు, రాజ్యాంగబద్ధ ప్రభుత్వం మొదలైన ఆశయాలకు రూపకల్పనలు. ఈ సంఘాల ద్వారా నౌరోజీ, జస్టిస్ మహదేవ్ గోవింద్ రనడే, ఆనందాచార్యులు, సురేంద్రనాథ్‌బెనర్జీ, ఫిరోజ్‌మెహతా, బద్రుద్దీన్ త్యాబ్జి వంటి మహానాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం : (28-12-1885)

బ్రిటీష్ ప్రభుత్వ మాజీ ఉద్యోగి అలెన్ ఆక్టేవియన్ హ్యూమ్ ప్రోత్సాహంతో ఐఎన్‌సి స్థాపించారు. భారత జాతీయ కాంగ్రెస్ ప్రథమ సమావేశం క్రీ.శ 1885 డిసెంబర్ 28 తేదీన ఉమేశ్ చంద్రబెనర్జీ అధ్యక్షతన ముంబయిలో నిర్వహించారు.

మితవాదయుగం (1885-1905)

క్రీ.శ 1885–1905 మధ్య జాతీయోద్యమ చరిత్రను జాతీయవాద వ్యాప్తి శకంగానూ, మితవాద యుగంగానూ చెప్పవచ్చు. ఈ రెండు దశాబ్దాల కాలంలో ఐఎన్‌సి మితవాదులతో నడిపించారు. ఏ.ఓ.హ్యూమ్, నౌరోజీ, సురేంద్రనాథ్‌బెనర్జీ, గోపాలకృష్ణ గోఖలేలు ఈ మితవాద నాయకులలో ప్రముఖులు. వీరు ప్రార్థన, విజ్ఞప్తి, నిరసన అనే విధానాలను అనుసరించారు. నౌరోజీ ఇంగ్లాండుకు వెళ్లి బ్రిటీష్ పార్లమెంటుకు ఎన్నికై, భారత ప్రజల సమస్యలపై బ్రిటీష్ పార్లమెంటులో పోరాడాడు. వీరి విజ్ఞప్తుల ఫలితంగానే క్రీ.శ 1892లో ఇండియా కౌన్సిల్ చట్టం ప్రవేశపెట్టారు. నాటి బ్రిటీష్ గవర్నర్ జనరల్ డఫ్రిన్ 'కాంగ్రెస్ ఒక అల్ప సంఖ్యాక వర్గ ప్రతినిధ్య సంస్థ అని విమర్శించాడు. కనుకనే 1890లో బ్రిటీష్ ప్రభుత్వం కాంగ్రెస్ సమావేశాలకు ఏ బ్రిటీష్ ఉద్యోగీ హాజరుకారాదని కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి సంబంధమూ పెట్టుకోరాదని ఆదేశించింది.

అతివాద యుగం (1905-1919)

కాంగ్రెస్‌లోని ఒక వర్గం మాటల ద్వారాకాక చేతల ద్వారా మాత్రమే తమ కోర్కెలను సాధించవచ్చుననీ భావించింది. ఈ సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తెచ్చిన వారిలో ప్రముఖుడు బాలగంగాధర తిలక్. ప్రతి సంవత్సరం గణపతి నవరాత్రి ఉత్సవాలు, శివాజీ ఉత్సవాలు నిర్వహించి ప్రజలలో జాతీయ చైతన్యాన్ని కలిగించాడు. ఇంగ్లీష్‌లో 'మరాఠా', మహారాష్ట్రలో 'కేసరి' అనే పత్రికను స్థాపించి, తద్వారా జాతీయవాద వ్యాప్తికి కృషి చేశాడు. తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు...దానిని నేను పొందుతాను' అని ఉద్ఘాటించాడు.

బెంగాల్ విభజన (పార్టిషన్ ఆఫ్ బెంగాల్) 1905

క్రీ.శ 1905లో లార్డ్‌కర్జన్ విశాలమైన బెంగాల్ రాష్ట్రాన్ని రెండుగా విభజించాడు. దీంతో హిందువుల ప్రాబల్యం ఉన్న పశ్చిమ బెంగాల్, ముస్లింలు ఎక్కువగా ఉన్న తూర్పుబెంగాల్ ఏర్పడ్డాయి. బెంగాల్ విభజన ప్రతిఘటనోద్యమం కార్చిచ్చువలే దేశం నలుమూలలా వ్యాపించింది. బెంగాల్ పోరాటం దేశంలోని అన్ని ప్రాంతాలనూ ఏకం చేసింది.

స్వదేశీ ఉద్యమం-వందేమాతర ఉద్యమం

బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా బ్రిటీష్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి స్వదేశీ ఉద్యమం ప్రారంభమైంది. విదేశీవస్తు బహిష్కరణం, స్వదేశీ వస్తు వినిమయం ఈ ఉద్యమ లక్ష్యాలు. లాల్–బాల్–పాల్ త్రయం వల్ల దేశమంతా వ్యాపించింది. బెంగాల్ విభజనకు నిరసనగా జన్మించిన 'వందేమాతరం' గీతం అతివాదులకు అనధికార జాతీయగీతమైంది. అందువల్లనే దీనిని 'వందేమాతరం' ఉద్యమం అని కూడా అంటారు.

క్రీ.శ 1907 సూరత్ కాంగ్రెస్-కాంగ్రెస్ చీలిక

క్రీ.శ 1906లో కాంగ్రెస్ స్వదేశీ సిద్ధాంతాన్ని బలపర్చడమేకాక 'స్వరాజ్యం' తన లక్ష్యమని ప్రకటించింది. ఈ కొత్త విధానం అతివాదులందరికీ ఉత్సాహాన్ని కలిగించింది. కానీ సురేంద్రనాథ్‌బెనర్జీ, గోపాలకృష్ణ గోఖలే వంటి మితవాదులకు ఈ విధానాలు నచ్చలేదు. దీంతో కాంగ్రెస్‌లో చీలిక వచ్చింది.

ముస్లింలీగ్ (క్రీ.శ 1906)

కాంగ్రెస్ హిందూ సంస్థ అనీ, అల్ప సంఖ్యాక వర్గమైన తమకు ప్రత్యేకరక్షణ కావాలని ముస్లింలు క్రీ.శ 1906లో ఢాకా నవాబ్ సలీముల్లా నాయకత్వంలో 'ముస్లింలీగ్' అనే సంస్థ ఏర్పాటు చేశారు. ఈ సంస్థ బెంగాలు విభజనను స్వాగతించింది. స్వదేశీ ఉద్యమాన్ని నిరసించింది.

భీతావహోద్యమం (క్రీ.శ 1907-1914)

బెంగాలులోని విప్లవాదులైన భావేకర్ సోదరులు, అరవిందుని సోదరుడైన బరీంద్రకుమార్ ఘోష్, స్వామి వివేకానందుని సోదరుడైన భూపేంద్రనాథ్ దత్తు, ఎంఎన్.రాయ్.. మొదలైనవారు 'యుగంతర్', 'సంధ్య', 'వందేమాతరం' వంటి పత్రికలను స్థాపించి, వాటిద్వారా విప్లవ భావాలను వెదజల్లి భీతావహోద్యమాన్ని (టెర్రరిస్ట్ మూమెంట్)ను ప్రారంభించారు. మహారాష్ట్ర విప్లవకారులలో వినాయక దామోదర్ సావరాజ్ అగ్రగణ్యుడు. ఆ తర్వాత కాలంలో భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్..మొదలైనవారు వచ్చారు.

మింటో-మార్లే సంస్కరణలు (1909)

బ్రిటీష్ ప్రభుత్వం ఒకవైపు తీవ్రవాదనాయకులను అరెస్టు చేసి, మరోవైపు మితవాద నాయకులను తృప్తిపరచడానికి 1909 మింటో– మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టింది.

మొదటి ప్రపంచయుద్ధం (1914-1918)

ఐఎన్‌సి బ్రిటీష్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసాన్ని ప్రకటించి, యుద్ధంలో బ్రిటీష్ వారికి మద్దతునిచ్చింది. బ్రిటీష్ వారు కూడా యుద్ధానంతరం గణనీయమైన రాజకీయ సంస్కరణలను చేస్తామని వాగ్దానం చేశారు.



హోంరూల్ ఉద్యమం (1916)

ఐడబ్ల్యూడబ్ల్యూ (IWW) కాలంలో యుఎస్ఎ అధ్యక్షుడైన ఉడ్రోవిల్సన్ ప్రతిజాతికి తమ ఇష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే హక్కు ఉన్నదనే స్వయం పరిపాలనాధికారం సూత్రాన్ని ప్రకటించాడు. ఈ సూత్రాన్ని ఆధారం చేసుకుని 1916 సంవత్సరంలో అనీబిసెంట్, తిలక్‌లు హోమ్‌రూల్ ఉద్యమాన్ని ప్రారంభించారు. అనీబిసెంట్ ఐరిష్ వనిత. దివ్యజ్ఞాన సమాజం ద్వారా మనదేశానికి అపారమైన సేవచేసింది.

లక్నో కాంగ్రెస్ క్రీ.శ-1916 కాంగ్రెస్ ఏకీకరణ

క్రీ.శ 1909లో ప్రవేశపెట్టిన మింటో–మార్లే సంస్కరణలు మితవాదులనూ సంతృప్తిపరచలేదు. అందువల్ల వారు అతివాదులతో సహకరించడం ప్రారంభించారు. లక్నో సమావేశంలో అతివాదులు, మితవాదులు ఏకమయ్యారు.

లక్నో ఒడంబడిక (1916)

మొదటి ప్రపంచయుద్ధ కాలంలో యూరోపియన్ రాజకీయాల ప్రభావం వల్ల ముస్లింలీగ్ నాయకులు కాంగ్రెస్‌తో సహకరించడానికి ఆసక్తి చూపారు. కాంగ్రెస్, ముస్లింలీగ్ కలిసి పనిచేయడానికి క్రీ.శ 1916లో లక్నోలో ఒక ఒప్పందాన్ని చేసుకున్నాయి. దీన్నే లక్నో ఒడంబడిక అంటారు.

ఖిలాఫత్ ఉద్యమం (1916)

ఐడబ్ల్యూడబ్ల్యూ (IWW)లో బ్రిటన్ టర్కీని ఓడించి, టర్కీ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసింది. దీంతో ముస్లింలు బ్రిటీష్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలీ సోదరులు (మహమ్మద్ షౌకత్ ఆలీ), మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ల నాయకత్వంలో ఆందోళన సాగించారు. దీనినే ఖిలాఫత్ ఉద్యమం అంటారు. హిందూ– ముస్లిం సఖ్యతకు ఈ ఉద్యమాన్ని ఒక అవకాశంగా భావించి కాంగ్రెస్ కూడా ఈ ఉద్యమానికి సహకరించింది.

మాంటేగ్-ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు (1919)

ఐడబ్ల్యూడబ్ల్యూ (IWW) ముగిసిన తర్వాత యుద్ధంలో బ్రిటీష్ వారు భారతీయులు చేసిన సహాయానికి ప్రతిఫలంగా మాంటేగ్–ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఈ సంస్కరణల ప్రకారం కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టకూడదని. రాజప్రతినిధి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఇంకొక భారతీయునికి ప్రవేశం కల్పించారు. శాసనసభను ఏర్పాటుచేశారు. అందులో 2/3 మంది ఎన్నికైన సభ్యులుంటారు. రాష్ట్రాలలో శాసనసభలను ఏర్పాటు చేశారు. వాటి నుంచి కొంతమంది మంత్రులను గవర్నరు నియమిస్తాడు. ఆ మంత్రులు ట్రాన్స్‌ఫర్డ్ శాఖలకు సంబంధించిన విషయాల పరిపాలనను చేస్తారు. మిగిలిన శాఖల పరిపాలనా వ్యవహారాలను గవర్నర్, ఆయన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ చూస్తుంది. దీనినే ద్వంద్వ పరిపాలన అంటారు.

రౌలట్ చట్టాలు (1919)

బ్రిటీష్ ప్రభుత్వం విప్లవోద్యమాన్ని అణచడానికి ప్రత్యేక శాసనాలు చేసింది. ఈ శాసనాలను తయారుచేసిన సంఘానికి అధ్యక్షుడు రౌలట్. అందువల్ల ఈ చట్టాలకు రౌలట్ చట్టాలనే పేరు వచ్చింది. ఈ చట్టాల ప్రకారం ఎవరినైనా విచారణ లేకుండానే అనుమానం మీద ప్రభుత్వం నిర్భందించవచ్చు. ఈ శాసనాన్ని ఎదుర్కొనడానికి మహాత్మాగాంధీ సాత్విక నిరోధ ఉద్యమాన్ని ప్రారంభించారు.

జలియన్‌వాలాబాగ్ దురంతాలు (13-04-1919)

జాతీయోద్యమం అణచివేతకు బ్రిటీష్ ప్రభుత్వం పంజాబులో అతి దారుణ చర్యలను తీసుకుంది. ఈ రోజునే జాతీయవాదులు అమృతసర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో శాంతియుతంగా సమావేశం జరుపుతున్నారు. ప్రభుత్వ ఆజ్ఞలకు వ్యతిరేకంగా సమావేశం జరుపుతున్నారని జనరల్ డయ్యర్ సేనాని ఆదేశంతో బ్రిటీష్ సైనికులు ఆకస్మికంగా వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో వందలాది మంది మృతిచెందారు.


సహాయనిరాకరణోద్యమం (1920-1922)

భారతీయులు బ్రిటీష్ ప్రభుత్వం వారిచ్చిన బిరుదులను వదలాలని, శాసనసభ్యులను, న్యాయస్థానాలను, ప్రభుత్వ విద్యాసంస్థలను విడనాడాలనీ, పన్నులను చెల్లించకూడదనీ, విదేశీ వస్తువులను బహిష్కరించాలనీ, స్వదేశీ వస్తువులను ఆదరించాలనీ, మద్యపానాన్ని నిషేధించాలనీ, అస్పృశ్యతా నివారణను చేపట్టాలనీ తీర్మానించారు.

★

గాంధీయుగం (1920-1947) మహాత్మా (1869-1948)

మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ పోరుబందరు (గుజరాత్)లో జన్మించారు. ఆయన ఇంగ్లాండులో ఉన్నత విద్యను అభ్యసించాడు. దక్షిణాఫ్రికా వెళ్లి అక్కడ భారతీయుల పట్ల శ్వేతజాతి ప్రభుత్వం అనుసరిస్తున్న జాతి విచక్షణ ఖండించి, భారతీయుల సమాన హక్కుల కోసం సత్యాగ్రహం చేశాడు. 1906లో ప్రారంభమైన సత్యాగ్రహ పోరాటం 1914లో జారీ చేసిన రిలీవ్ చట్టంతో విజయవంతంగా అంతమైంది. 1915 సంవత్సరంలో గాంధీజీ భారత్‌కు తిరిగి వచ్చాడు.



ఉద్యోగాలు

నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్టింగ్‌లో 29 ఖాళీలు

నోయిడాలోని నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్టింగ్ (ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్).. 29 'సైంటిస్ట్' ఖాళీలను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తు కోరుతోంది.

పోస్టుల పేరు-ఖాళీలు: సైంటిస్ట్ 'సి'–20, సైంటిస్ట్ 'డి'–9.

అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి 60 శాతం మార్కులతో ఎంఎస్సీ/ ఎంటెక్. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం. పోర్ట్రాన్/ సి/ పైథాన్/ యునిక్స్/ లినిక్స్‌లో నైపుణ్యం తదితరాలు.

వేతనం : సైంటిస్ట్ 'సి' పోస్టులకు రూ.60,000, సైంటిస్ట్ 'డి' పోస్టులకు రూ.62,000.

వయోపరిమితి : 2017 సెప్టెంబర్ 3 నాటికి సైంటిస్ట్ 'సి' పోస్టులకు 40 ఏళ్లు, సైంటిస్ట్ 'డి' పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : ఇంటర్వ్యూ ద్వారా..

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులు పంపాల్సిన చిరునామా : ది హెడ్, ఎన్‌సీఎంఆర్‌డబ్ల్యూఎఫ్, ఎ–50, సెక్టార్–62, నోయిడా–201309.

దీంతోపాటు దరఖాస్తు సాఫ్ట్ కాపీని director@ncmrwf.gov.in మెయిల్ ఐడీకి మెయిల్ చేయాలి.

దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : సెప్టెంబర్ 3, 2017

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.ncmrwf.gov.in

భూ కబ్జాదారులను తరిమేయండి

- పేదలకు అండగా ఉంటాం
- విచారణ నిష్పక్షపాతంగా చేయాలి
- ఆక్రమణదారులను కాపాడే దోరణి ఆర్‌డిఒకు తగదు
- అక్కెంగుండ్ల కబ్జాభూముల పరిశీలనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు



కడప జిల్లా సావిశెట్టిపల్లె సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి - కాశినాయన(కడప)

భూ కబ్జాదారులను తరిమేయాలని, భూమిలేని పేదలు ఆ ఆక్రమిత భూములను సాగు చేసుకోవాలని, అందుకు సిపిఎం అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు పేదలకు భరోసా ఇచ్చారు. సోమవారం కడప జిల్లా కాశినాయన అక్కెంగుండ్లలో ఘరానా వ్యక్తులు ఆక్రమించిన భూములను పరిశీలించారు. పేదలు, దళితులతో మాట్లాడి వివరాలను సేకరించారు. అనంతరం సావిశెట్టిపల్లెలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. భూమిని సాగుచేసుకొంటూ ఉద్యమం చేస్తుంటే సిపిఎం వెన్నంటి ఉంటుందని, భూమికి పట్టాలు సాధిద్దామని పేదలకు భరోసా ఇచ్చారు. బయటవారు వచ్చి ఇక్కడ బినామీ పట్టాలు పొంది భూములు దున్నుతుంటే రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన భూ కబ్జాదారులైన కొందరు ఘరానా వ్యక్తులకు వందలాది ఎకరాలను ప్రభుత్వం ఏ పద్దతిన, ఏ ప్రాతిపదికన కట్టబెట్టిందో పూర్తి స్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దొంగ పట్టాలు ఇవ్వడంలో ఈ ప్రాంతంలోని కొంత మంది స్వార్థ రాజకీయ నాయకుల మద్దతు రెవెన్యూ అధికారులకు ఉందని, అందువల్లే వీరు భూ కబ్జాదారులకు బినామీ పట్టాలిచ్చారని విమర్శించారు. భూమి లేని పేదలందరూ ఐక్యమత్యంతో భూ కబ్జాదారుల చేతిలోని ప్రభుత్వ భూమిని దుక్కి దున్ని సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కడపలోని తిరుమల ఆసుపత్రి అధినేత సురేంద్రబాబు 14 ఎకరాలు కొని 150 ఎకరాలు అసైన్డ్ భూమిని స్వాధీన పరచుకొన్నారన్నారు. భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి వంద ఎకరాలు సాగు చేశారని తెలిపారు. ఇలా చెప్పుకొంటూ పోతే వరంగల్, గుంటూరు, విజయవాడ, ప్రొద్దుటూరు, ఇతర ప్రాంతాల వారందరూ వందల ఎకరాల భూములను ఆక్రమించుకున్నారన్నారు. కాశినాయన మండలం బసనపల్లెకు చెందిన శీను అనే వ్యక్తికి 300 ఎకరాలు ఎలా వచ్చిందో తేల్చాలన్నారు. కొందరు ఇంటి పేరు మార్చి పూర్వీకులు తమవారే అని ఈ ప్రాంతంలో దొంగ రికార్డులను సృష్టించి రిజిస్టర్ చేసుకొన్నారన్నారు. ఒక దళితుడు భూమి దున్నేందుకు పోతుండగా ప్రభుత్వ అధికారుల అండతో శీను అతని అనుచరులు దాడి చేశారని వివరించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారాయణ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో 15 వేల ఎకరాల భూమిని భూ కబ్జాదారులే అనుభవిస్తుంటే అధికారులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఐక్యమత్యంతో ఈ పోరాటం ముందుకు సాగించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. భూ కబ్జాదారులు అధికారులను డబ్బుతో కొని మనలను ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కబ్జా భూములపై విచారణను పక్క దారి పట్టించేందుకు ఆర్‌డిఒ వీరబ్రహ్మం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వెంకటరమణ, సునీల్, ఆరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పెంచిన వేతనాల అమలుకు సిఆర్‌పిల ఆందోళన

ప్రజాశక్తి - మచిలీపట్నం (కలెక్టరేట్)

సిఆర్‌పిలకు ప్రభుత్వం ఆమోదించిన ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ క్లస్టర్ రీసోర్స్ పర్సన్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఆర్‌పి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.కాశీ మాట్లాడుతూ.. సర్వశిక్షా అభియాన్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 4,034 మంది సిఆర్‌పిలుగా పనిచేస్తున్నారన్నారు. వీరందరికీ ఆగస్టు 1 నుంచి వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆమోదించిన దానికంటే తక్కువగా వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ అవడం శోచనీయమన్నారు. ఇదే అమలు జరిగితే రాష్ట్రవ్యాప్తంగా సిఆర్‌పిలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పెరిగిన ధరలు, నిత్యావసర ఖర్చులు, ప్రయాణ ఖర్చులన్నీ పరిగణనలోకి తీసుకుని ఆమోదించిన విధంగా వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ గంధం చంద్రుడుకి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వెంకట్, సిఆర్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి.నాంచారయ్య, పలువురు సిఆర్‌పిలు పాల్గొన్నారు.

'రైతులకు రూ.5వేలు పింఛను ఇవ్వాలి'

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

వరుస కరువుతో దుర్భిక్ష పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న రైతులు, మహిళా సంఘాల రుణాలన్నింటినీ మాఫీ చేయాలని సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను తెలియజేస్తూ సోమవారం రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాంభూపాల్ మాట్లాడుతూ.. వరుస కరువుతో పంటలు పండక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందడం లేదన్నారు. 30 ఎకరాల భూమి ఉన్న రైతులు కూడా ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని చెప్పారు. వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో పడిపోయిందన్నారు. కేంద్రంలో బిజెపి వస్తే రైతులకు అచ్చేదిన్ అని ప్రకటించారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అచ్చేదిన్ అయిందని, రైతులకు సచ్చేదిన్‌గా దాపురించిందన్నారు. రైతుల సంక్షేమాన్ని పాలకులు విస్మరించారన్నారు. రైతులు, కార్మికుల సమస్యల పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాప్తాడు మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు పోతులయ్య, ఎర్రిస్వామి రెడ్డి, ముత్యాలు, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పెరల్స్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం

తమకు న్యాయం చేయాలని కోరుతూ పెరల్స్ ఫైనాన్స్ సంస్థ బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి, పెరల్స్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోయేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.కామేశ్వరరావు మాట్లాడారు. నిరుపేద కుటుంబాలను సైతం తమ దోపిడికి వాడుకొని అడ్డంగా ఆస్తులను సంపాదించుకొని కస్టమర్లకు, ఏజెంట్లకు తీరని అన్యాయం చేస్తూ పరారైపోయిన పెరల్స్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్లను వెంటనే అరెస్టు చేసి, పెరల్స్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కోరారు. పెరల్స్ కంపెనీలో పొదుపు చేసిన ఖాతాదారులకు 2014లో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక లావాదేవీలను నిలిపివేశారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పెరల్స్ బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూస స్వామినాయుడు, కె.సురేష్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని తమను ఆదుకోవాలని, ఆత్మహత్యలే శరణ్యమన్నారు. అనంతరం కలెక్టర్ వివేక్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు.

'ఆది'ని మంత్రి పదవి నుంచి తప్పించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దళితులను అసభ్య పదజాలంతో కించపరిచిన రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డిని మంత్రి పదవి నుంచి తప్పించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. నాయకులు ఆతవ ఉదయ భాస్కర్, గోక రమేష్, గంట్రేడి సత్యనారాయణ మాట్లాడుతూ చదువు రాదని, శుభ్రంగా ఉండరని ఓట్లు అడిగినపుడు ఆ నేతలకు తెలియదా అని ప్రశ్నించారు. మంత్రి ఆదినారాయణరెడ్డిని మంత్రి పదవినుంచి తొలగించి, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. స్కాట్లాండ్
2. సాగి శ్రీహరి వర్మ
3. రష్యా
4. మధ్యప్రదేశ్
5. హుజి

'ఆక్వా' పనులను నిలిపేయాలని ర్యాలీ


పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆక్వా ఫుడ్‌పార్కు బాధితులు

ప్రజాశక్తి-భీమవరం రూరల్

ఆక్వా ఫ్యాక్టరీ పనులను నిలిపేయాలంటూ ఆక్వాఫుడ్ బాధితులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని గోదావరి మెగా ఆక్వాఫుడ్ పార్క్ బాధితులు వందలాదిమంది తుందుర్రు నుంచి జొన్నలగరువు మీదుగా ఆక్వాఫుడ్‌పార్క్ ప్రధాన గేటు వరకు చేరుకున్నారు. ప్రభుత్వానికి, ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అక్కడ నుంచి కంసాల బేతపూడికి చేరుకుని గ్రామంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆక్వాఫుడ్ పార్కు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ ఆరేటి వాసు మాట్లాడుతూ ఆక్వాఫుడ్ పార్కును వేరే ప్రాంతానికి తరలించాలని మూడేళ్లుగా కోరుతున్నా చంద్రబాబు పట్టించుకోలేదని, పైగా మహిళలను సైతం పోలీసుల ద్వారా దారుణంగా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మాయమాటలు చెప్పి గెలిచాక నట్టేట ముంచుతారని, నంద్యాల ప్రజలు టిడిపిని ఓడించి గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, నాయకులు కవురు పెద్దిరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, పోరాట కమిటీ నాయకులు సముద్రాల వెంకటేశ్వరరావు, జవ్వాది సత్యనారాయణ, బెల్లపు సత్తిబాబు, ముచ్చర్ల త్రిమూర్తులు, కొత్తపల్లి కాశీ విశ్వనాథం, వందలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డాక్ సేవకుల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కరించాలని, పిఆర్‌సిని అమలు చేయాలని, హామీలను నెరవేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డాక్ సేవక్‌లు చేపట్టిన సమ్మె ఆరో రోజైన సోమవారం కూడా కొనసాగింది. గుంటూరు జిల్లా తెనాలిలో ప్రధాన తపాలా కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెలో భాగంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో భట్టిప్రోలు, వేమూరు, దుగ్గిరాల, రేపల్లె, కొల్లిపర, చెరుకుపల్లి, బాపట్ల, పొన్నూరు, తెనాలి, అమర్తలూరు, చుండూరు, మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, నూజివీడు, తిరువూరు, నందిగామ, ఉయ్యూరు, అవనిగడ్డ, పామర్రు, పెడన ప్రాంతాల్లో తపాలా ఉద్యోగులు సమ్మె పాటించారు. సాలూరు, పార్వతీపురం పోస్టాఫీసుల వద్ద ధర్నాలు చేశారు. పార్వతీపురంలో ఉద్యోగులంతా ర్యాలీ చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లాలోని పోస్టాఫీసుల ఎదుట సమ్మె శిబిరాలను నిర్వహిస్తున్నారు. వీరి సమ్మెకు తపాలా శాఖలో క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె పశ్చిమగోదావరి జిల్లాలో కొనసాగింది. ఆయా ఉద్యోగులు సమీప హెడ్‌పోస్టాపీసుల వద్ద ఆందోళనలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ధర్నా చేపట్టారు.

రోబోటిక్స్‌తో ఉద్యోగాలకు ఎసరు

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు



విశాఖలో మాట్లాడుతున్న సిహెచ్ నరసింగరావు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

పెట్టుబడిదారీ విధానం కంటే కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ విప్లవమే ప్రపంచానికి ప్రమాదకరంగా మారుతోందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. విశాఖపట్నంలోని స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం ఉదయం సిఐటియు రాష్ట్ర క్యాడర్‌కు నాలుగు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షులు బేబీరాణి సిఐటియు పతాకావిష్కరణ, అనంతరం జరిగిన ప్రారంభోత్సవంలో నరసింగరావు మాట్లాడారు.. అమెరికాలో కృత్రిమ మేధస్సుపై పరిశోధనలు చేసి మనిషిలా ఆలోచించే రోబోట్‌లను తీసుకొస్తున్నారని, ఒక రోబోట్ సగటున నలుగురు మనుషుల పని చేస్తుందన్నారు. హోటల్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ నిర్వహణలోనూ రోబోట్‌లను ఉపయోగిస్తారన్నారు. మనిషి లేకుండా కారు డ్రైవింగ్ చేస్తుందన్నారు. ఈ పరిశోధన అమెరికాతో ఆగిపోదని, సింగపూర్‌లోనూ 2018 కల్లా రోబోట్‌లను వినియోగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోందన్నారు. పదేళ్లలో అమెరికాలో 40 శాతం ఉద్యోగాలు ఉడిపోతాయని మెకెన్సీ తన రిపోర్టులో నివేదించారని పేర్కొన్నారు.

జిఒ 25ను అమలు చేయాలని మాదిగ చర్మకారుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

రాష్ట్రంలో ఎస్‌సి కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జిఒ 25 ప్రకారం అమలు చేయాలని మాదిగ చర్మకారుల డప్పు కళాకారుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగ్రాజుపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలను ఎస్‌సి ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం అమలు చేయాలని జిఒ ఉన్నా జిల్లాలో అమలుకావడం లేదన్నారు. దీని అమలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్‌సి కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం పంపిణీ చేసిన వాహనాలు అసలైన లబ్ధిదారులకు చెందలేదన్నారు. సమితి జిల్లా అధ్యక్షులు జి.రోశయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాన్‌కాస్ట్ కార్మికుల 'చలో కలెక్టరేట్'

- అడ్డుకున్న పోలీసులు
- 62 మంది అరెస్టు, విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన ఆమదాలవలస మండలం దూసిలోని కాన్‌కాస్ట్ కార్మికులు సోమవారం చలో కలెక్టరేట్ నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలోని వాంబే కాలనీ నుంచి ర్యాలీగా వచ్చిన కార్మికులను కలెక్టరేట్ గేటు వద్ద ఒకటో పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావుతో పాటు 62 మందిని పోలీసులు అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టులకు ముందు కార్మికులను ద్దేశించి గోవిందరావు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకుండా కాన్‌కాస్ట్ యాజమాన్యం కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. బకాయి వేతనాలతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై కార్మిక శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ అండతో యాజమాన్యం కార్మిక చట్టాలను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాన్‌కాస్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, కాన్‌కాస్ట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, కాన్‌కాస్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న 'అగ్రిగోల్డ్' బస్సుయాత్ర


విశాఖ సభలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి టౌన్/గాజువాక (విశాఖ)

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై అసోసియేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళంలో ప్రారంభమైన చైతన్య యాత్ర సోమవారం అనకాపల్లి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక నెహ్రూ చౌక్‌లోని కోడుగంటి గోవిందరావు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం, ఇళ్లు కట్టుకుందామని ఇలా అనేక ఆశలతో పేద, మధ్య తరగతి ప్రజలు అగ్రిగోల్డ్ సంస్థను నమ్మి లక్షలాది రూపాయలు డిపాజిట్ చేశారని తెలిపారు. ఆ సంస్థ బోర్డు తిప్పేయడంతో బాధితులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క నాయకుడు ఆదుకునేందుకు ముందుకు రావడం లేదన్నారు. రాష్ట్రంలో 19.52 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని, 32 నెలల నుంచి బాధితులకు న్యాయం చేయాలని అసోసియేషన్‌గా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం స్పందన కరువైందని విమర్శించారు. దీనికి ముందు చైతన్య యాత్రలో వస్తున్న నాయకులకు అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు బైక్ ర్యాలీ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. ఇచ్ఛాపురం నుంచి బయలుదేరిన అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్ర సోమవారం పాత గాజువాక చేరింది.

నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోండి

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట రైతుల బైఠాయింపు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం)

మార్కాపురం ప్రాంతంలో తీవ్ర కరువుతో పంటలన్నీ దెబ్బతిన్నాయని, మిర్చి రైతులను ఆదుకోవాలని కేంద్రం రూ.232 కోట్లు విడుదల చేసినా నేటికీ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదనీ రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యం లో మార్కాపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామి రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. వరుస కరువుతో రైతులు మూడేళ్లుగా పంటల పెట్టుబడులు పెడుతూ పోయారనీ, కనీసం ప్రభుత్వం అందించే సాయం కూడా రైతులకు చేరకుండా అధికారులు వ్యవహరిం చడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. తీవ్ర ఇక్కట్లలో కొట్టుమిట్టాడు తున్న మిర్చి రైతులను ఆదుకోని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్‌డిఒ కె.పెంచల కిశోర్ రైతులకు వద్దకు వచ్చి కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు.

'ఉపాధి' డబ్బులు చెల్లించాలని ధర్నాలు

ప్రజాశక్తి-ఏజెన్సీ విలేకర్లు

ఉపాధి హామీ కూలీలకు బకాయి పడ్డ కూలీ డబ్బులను చెల్లించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మన్యంలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. అనంతగిరిలో గిరిజన సంఘం కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేశారు. బిల్లుల కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. అరకులోయ మండలంలోని 8 పంచాయతీలకు చెందిన ఉపాధి కూలీలు ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. బకాయిలు చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్యాలయానికి తాళాలు వేసి అధికారులను నిర్బంధించారు. ఎంపిడిఒ విజయ్‌కుమార్, ఉపాధి హామీ ఎపిఒ దొరబాబు, ఎపిడి భ్రమరాంబ వచ్చి వచ్చే నెల 10లోగా బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ గిరిజనులు ఎంపిడిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేపట్టారు.



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, ఇతర నాయకులు

గ్రూప్-2 మెయిన్స్ రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

గ్రూప్-2 మెయిన్స్ రద్దు చేయాలని కోరుతూ నిరుద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరుద్యోగ అభ్యర్థులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. జులై 15, 16వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్‌లో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని చెప్పారు. విశాఖ, చీరాల తదితర ప్రాంతాల్లో మాస్ కాపీయింగ్ జరిగిందని పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షను తక్షణమే రద్దు చేసి, తిరిగి ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రంలోనూ నిర్దేశించిన సిలబస్‌తో సంబంధం లేకుండా ప్రశ్నలు అడిగారన్నారు. అవకతవకలతో నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం వాటిల్లుతోందని ఆవేదన వెలిబుచ్చారు. ఆది నుంచి అనేక విమర్శలు ఎదుర్కొంటున్న ఎపిపిఎస్‌సిని సైతం ప్రక్షాళన చేయాలని కోరారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడారు. ధర్నాకు సిపిఐ, ఎఐఎస్ఎఫ్, యువజన కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

నేడు మున్సిపల్ కార్మికుల 'చలో విజయవాడ'

రైల్వేస్టేషన్ నుంచి మహాప్రదర్శన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


ప్రభుత్వం విడుదల చేసిన జీవో 279ను రద్దు చేయడంతో పాటు ఇతర సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ మంగళవారం 'చలో విజయవాడ' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. సమస్యల్ని పరిష్కరించాలని 19 నెలలుగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా పెడచెవిన పెట్టిందని జెఎసి నాయకులు కె ఉమామహేశ్వరరావు, ఎ రంగనాయకులు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ 13 రోజులుగా విజయవాడలో రిలే నిరాహార దీక్షల్ని నిర్వహించామని, అయినా ప్రభుత్వంలో చలనం లేదని తెలిపారు. 279జీవో కారణంగా ఇప్పటికే ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన ఓలయ్య అనే కార్మికుడు గుండెపోటుతో చనిపోయాడన్నారు. నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం జిల్లాల్లో అనేకమందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. పర్మినెంట్ వారికి పదవీ విరమణ వయస్సు 60 ఏళ్లుంటే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో 45 ఏళ్లుపైబడితే ఉద్యోగం నుంచి తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యంత్రాల యజమానులకు మున్సిపాల్టీల సొమ్మంతా దోచిపెట్టేందుకు రాష్ట్రప్రభుత్వం బరితెగించిందన్నారు. దళారీ వ్యవస్థను అన్ని మున్సిపాలిటీల్లో ప్రోత్సహించేందుకు టిడిపి ప్రభుత్వం అన్ని రకాల అడ్డదారులు తొక్కుతోందన్నారు. స్థానిక సంస్థలకు రాజ్యాంగం 73,74 సవరణల ద్వారా కల్పించిన హక్కుల్ని, అధికారాల్ని కాలరాస్తోందన్నారు. యంత్రాల యాజమానులు, దళారీలకు కమీషన్ల కోసం ప్రజలపై భారాలేసేందుకు కూడా వెనకాడడంలేదన్నారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి మహాప్రదర్శన ప్రారంభమవుతుందని, అనంతరం ధర్నాచౌక్‌లో సభ నిర్వహిస్తామని వారు తెలిపారు.

2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు

'సంకల్పంతో సిద్ధి'లో కేంద్ర మంత్రి సుజనా చౌదరి

ప్రజాశక్తి-గుంటూరు

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతుల ఆదాయం 2022 నాటికి రెట్టింపు చేయటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'సంకల్పంతో సిద్ధి' కార్యక్రమానికి పిలుపునిచ్చిందని కేంద్ర మంత్రి వై.సుజనా చౌదరి అన్నారు. వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం నిర్వహించిన 'సంకల్పంతో సిద్ధి' కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జనాభాలో 60 శాతంగా ఉన్న రైతులు బాగుంటేనే దేశం బాగుటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు వ్యవసాయంతోపాటు, అనుబంధ రంగాలపైనా దృష్టి సారించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. నీతి ఆయోగ్ రూపొందించిన 7 సూత్రాలను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేస్తాయని, రైతులూ వాటిపై అవగాహన పెంచుకొని ఆదాయం రెట్టింపు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే, ఎమ్మెల్యేలు, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కరువు ప్రాంతాల్లో సహాయక చర్యలేవీ?

ఏపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)/గుంటూరు

వర్షాభావం వల్ల కరువు ప్రాంతాల్లో ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వద్ద సోమవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఉపాధి పనులు కల్పించి గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు నివారించాలని కోరారు. జిల్లాలో వ్యవసాయ రంగంలో ఉన్న 18 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ మాట్లాడుతూ కరువు ప్రాంతాల వృద్ధులు, పిల్లలకు ప్రత్యేక సదుపాయలు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొండా వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పనిదినాలు కల్పించాలని గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ముఖ్యవక్తగా మాట్లాడారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని, వలసలు నివారించాలని, దినసరి వేతనం రూ.400 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్లి, 'మీ కోసం' (గ్రీవెన్స్)లో వినతిపత్రం అందించారు.

త్వరలోనే చైనా చర్చలు ప్రారంభిస్తుంది...!

డోక్లాం ప్రతిష్టంభనపై హోం మంత్రి రాజ్‌నాథ్ ఆశాభావం



న్యూఢిల్లీ: ప్రస్తుతం భూటాన్‌లో భారత్-చైనా మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదంపై త్వరలో చైనా చర్చల ప్రక్రియను ప్రారంభిస్తుందన్న ఆశాభావాన్ని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ డోక్లాం ప్రాంతంలో కొనసాగుతున్న ప్రతిష్టంభన త్వరలోనే తొలగిపోతుందని ఆశిస్తున్నానన్నారు. దీనిపై చైనా త్వరలోనే చర్చలు ప్రారంభిస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. డోక్లాం ట్రైజంక్షన్ ప్రాంతం వద్ద చైనా ప్రజావిముక్తి సైన్యం (పిఎల్‌ఎ) చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని రెండు నెలల క్రితం భారత సైన్యం అడ్డుకున్న విషయం తెలిసిందే. భారత్ చైనాల మధ్య కొనసాగుతున్న ఈ ప్రతిష్టంభనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన అమెరికా ఇరుదేశాలూ ఈ వివాదాన్ని దౌత్య మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించింది. గత జూన్ 16న ఈ ప్రతిష్టంభన ప్రారంభమైన తరువాత భూటాన్ సరిహద్దుల్లో భారత్ తన సైన్యాన్ని గణనీయంగా పెంచింది. ఈ సమయంలోనే భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ స్పందిస్తూ చర్చల ప్రక్రియ ప్రారంభించటానికి ముందు ఇరుదేశాలూ తమ సేనలను వెనక్కి రప్పించాలని సూచించారు.

శాంతి చర్చలకై చొరవ చూపండి

పశ్చిమ బెంగాల్, కేంద్ర ప్రభుత్వాలకు జిజెఎం విజ్ఞప్తి

డార్జిలింగ్/కోల్‌కతా : సాధ్యమైనంత త్వరలో డార్జిలింగ్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్చలకై చొరవ చూపాలని గూర్ఖా జనముక్తి మోర్చా (జిజెఎం) సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతోనూ, కేంద్రంతోనూ చర్చలకు జిజెఎం సానుకూలతను వ్యక్తం చేయడం ఇదే తొలిసారి. ప్రత్యేక గూర్ఖాలాండ్ రాష్ట్రాన్ని కోరుతూ డార్జిలింగ్‌లో కొనసాగుతున్న నిరవధిక సమ్మె సోమవారానికి 68వ రోజుకు చేరింది. డార్జిలింగ్, టెరాయ్, డూయర్స్ ప్రాంతాలో శాంతి నెలకొల్పే బాధ్యత అక్కడ నివసిస్తున్న ప్రజలది మాత్రమే కాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత కూడానని జిజెఎం జాయింట్ సెక్రటరి వినయ్ తమంగ్ తెలిపారు. డార్జిలింగ్‌లో శనివారం జరిగిన జంట బాంబు పేలుళ్ళతో సంబంధముందన్న ఆరోపణలపై చట్ట విరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (యుఎపిఎ) కింద జిజెఎం అధ్యక్షుడు బిమల్ గురంగ్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. ప్రత్యేక గూర్ఖాలాండ్‌ను కోరుతూ జనముక్తి మోర్చా గత రెండు నెలలుగా నిర్వహిస్తున్న ఆందోళనలో ఎన్నడూ చర్చలకు వచ్చేందుకు అంగీకరించలేదు.

సమ్మె విరమించే వరకు చర్చల్లేవ్ : రాష్ట్ర ప్రభుత్వం

గూర్ఖాలాండ్ ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న జిజెం పట్ల పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. ప్రత్యేక గూర్ఖాలాండ్ కోరుతున్న సంస్థలు వారి సమ్మెను విరమించి, పోలీసులు కేసు నమోదు చేసిన నాయకులను తమకు అప్పగిస్తేనే చర్చలకు అంగీకరిస్తామని ప్రభుత్వం తెలిపింది.

రూ. 2వేల విరాళం పరిమితి ఆచరణ సాధ్యమేనా?

పార్టీల అభిప్రాయాన్ని కోరిన స్థాయీ సంఘం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు నగదు రూపంలో ఇచ్చే విరాళాలపై రు.2 వేల పరిమితి ఆచరణ సాధ్యమేనా అంటూ న్యాయ, సిబ్బంది వ్యవహారాల శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలపై అధ్యయనం చేస్తున్న ఈ స్థాయీ సంఘం ఇందుకు సంబంధించిన ప్రశ్నా పత్రాన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి పార్టీలన్నింటికీ పంపి వారి అభిప్రాయాలను కోరింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, దేశంలో కొనసాగుతున్న ద్రవ్యోల్బణ పరిస్థితుల నేపథ్యంలో రు.2 వేల నగదు పరిమితి ఆచరణ సాధ్యమో కాదో తెలియచేయాలని ఈ సంఘం పార్టీలను కోరింది. ప్రస్తుత ఆదాయపు పన్ను చట్ట నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషన్ వద్ద రిజిస్టరయిన రాజకీయ పార్టీలు ఆదాయపు పన్ను నుండి మినహాయింపు పొందుతున్నాయి. నగదు లావాదేవీల తగ్గింపు, రాజకీయ పార్టీల నిధుల సేకరణలో పారదర్శకత లక్ష్యంతో రూపొందించిన 2017 ఆర్థిక బిల్లులో రు.2000 మించిన వ్యక్తిగత విరాళాల పరిమితికి సంబంధించిన నిబంధనలను సవరించారు. వ్యక్తిగత విరాళాలపై రు.2 వేల పరిమితి విధించాలని ఎన్నికల కమిషన్ దీర్ఘకాలంగా ప్రతిపాదిస్తున్న విషయం తెలిసిందే. రాజకీయ పార్టీలకు నగదు విరాళాలపై పరిమితులు విధించటాన్ని మాజీ ఎన్నికల ప్రధానాధికారులు స్వాగతించారు. అయితే రాజకీయ పార్టీలు చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే అవకాశాలుండటంతో నిబంధనలను మరింత కఠినతరం చేయాలని వారు సూచించారు.

మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణకు కమిటీలను ఏర్పాటు చేయండి : సుప్రీం


న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకం అమలు, పరిశుభ్రతను ఎలా పర్యవేక్షిస్తారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. జాతీయ, రాష్ట్రస్థాయిలో రెండు కమిటీలను ఈ పథకం అమలను పర్యవేక్షించడానికి ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. అంతరాష్ట్రీయ మానవ అధికార్ నిగ్రాని అనే స్వచ్ఛంద సంస్థ 2013లో దాఖలు చేసిన పిల్‌ను విచారిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. బీహార్‌లోని ఒక గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 23 మంది చిన్నారులు మృతి చెందిన సంఘటనలు లాంటివి జరగకుండా ఆదేశాలను జారీ చేయాలని పిల్‌లో కోరారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఎంత మంది చిన్నారులు లబ్ధిపొందుతున్నారో తమ వైబ్‌సైట్లలో మూడు నెలల్లో తెలపాలని మార్చి 23న రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు సూచించిన నిబంధనలు మేరకు వివరాలు అందచేయడానికి 25 ప్రభుత్వాలు అంగీకరించాయి.

స్పెయిన్‌లో ఉగ్రవాది కాల్చివేత

బార్సెలోనా : స్పెయిన్‌లో ఒక ఉగ్రవాదిని పోలీసులు కాల్చి చంపారు. పేలుడు పదార్థాలతో ఉన బెల్టు ధరించిన ఒక వ్యక్తిని కాల్చి చంపినట్లు కాటలినా పోలీసు బలగాలు సోమవారం తెలిపాయి. బార్సెలోనాలో గురువారం ఒక వ్యాన్‌పై దాడి జరిపిన వ్యక్తి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలో బార్సెలోనాలోని చిన్న పట్టణమైన సుబిరాట్స్‌లో బెల్టు బాంబు ధరించి అనుమానాస్పదంగా సంచరిస్తున్న యోనెస్ అబోయుకోబ్(22) అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. వ్యాన్‌పై దాడికి పాల్పడింది అతనేనని స్థానికులు కూడా గుర్తించారు. అబోయోకోబ్ వ్యాన్‌పై దాడి జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. కాగా శుక్రవారం ఉదయం మరో బాంబు దాడి జరిగిందని కాటలినా పోలీసులు పేర్కొన్నారు. ఈ దాడిలో ఒక ఉగ్రవాద సంస్థకు చెందిన 12 మంది పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఈ దాడిలో పాల్గొన్న ఐదుగురిని పోలీసులు కాల్చి చంపారు. ఈ రెండు దాడులకు తమదే బాధ్యత అని ఇస్లామిక్ స్టేట్ ప్రకటించింది.

శశికళ జైలు బైటికెళ్లి వచ్చారా!

తాజా ఆధారాలను అందచేసిన మాజీ డిఐజి రూప



బెంగళూరు: అక్రమాస్తుల కేసులో జైలు శిక్ష అనుభవిస్తూ ప్రస్తుతం బెంగళూరులోని పరప్పన అగ్రహారంజైలులో వున్న అన్నాడిఎంకె తాత్కాలిక కార్యదర్శి వికె శశికళ, ఆమె బంధువు ఇళవరసి జైలు నుండి బయటకు వెళ్లి వచ్చినట్లు సోషల్ మీడియాలో చెలామణి అవుతున్న వీడియోలు ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేపుతున్నాయి. ఈ వీడియో రికార్డింగ్‌లను కర్నాటక జైళ్ల శాఖ మాజీ డిఐజి డి రూప కర్నాటక పోలీసులోని అవినీతి నిరోధక విభాగం అధికారులకు అందచేశారు. జైలు ఉన్నతాధికారుల సహకారంతో శశికళతో సహా కొందరు నిందితులు స్వేచ్ఛగా జైలు బయటకు వెళ్లి వస్తుండటంపై వ్యక్తమవుతున్న అనుమానాలను ఈ తాజా ఆధారాలు మరింత బలపరుస్తున్నాయి. మాజీ డిఐజి రూప అందచేసిన ఆధారాలతో ఎసిబి సమన్లు జారీచేసిన జైళ్ల శాఖ మాజీ డిజిపి హెచ్‌ఎన్ సత్యనారాయణరావు సైతం ఇందుకు సంబంధించిన మరో 74 ఆధారాలను అందచేశారు. గత నెల 31న సత్యనారాయణ రావు ఉద్యోగ విరమణ చేసిన రోజునే డిఐజి రూపకు ఎసిబి సమన్లు అందాయని పోలీసు వర్గాలు తెలిపాయి. రెండు రోజుల తరువాత ఆమె విచారణ అధికారుల ముందు హాజరైనపుడు వారు ఆమెకు ఒక ప్రశ్నా పత్రాన్ని అందచేశారు. శనివారం నాడు ఆమె తన వాదనను లిఖితపూర్వకంగా సమర్పించటంతో పాటు అందుకు సంబంధించిన కొన్ని ఫొటోలను, వీడియో దృశ్యాలను అందచేశారు.

ఆర్టికల్ 35ఎ పై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలి

కేంద్రానికి సిపిఎం జమ్మూ రీజినల్ కమిటీ డిమాండ్

ఇండియాన్యూస్ నెట్‌వర్క్, జమ్ము:
జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న రాజ్యాంగంలోని 35 ఎ ఆర్టికల్‌ను మార్చేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేసినా అది తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని సిపిఎం జమ్మూ ప్రాంత కమిటీ కార్యదర్శి శ్యాం ప్రసాద్ కేసర్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును కల్పిస్తున్న ఈ అధికరణాన్ని నీరుగార్చేందుకు ఆరెస్సెస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఇటీవల జరిగిన ఒక సమావేశంలో విమర్శించారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న అధికరణాన్ని రద్దు చేసేందుకు అప్పటి భారతీయ జనసంఘ్ ఆందోళనలను నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. వాస్తవానికి జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చేందుకు 1949 అక్టోబర్ 12న అప్పటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన జరిగిన రాజ్యాంగ అసెంబ్లీ సమావేశంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు బలపర్చినప్పటికీ జనసంఘ్ అందుకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆయన వివరించారు.

1932లో అప్పటి మహారాజా హరిసింగ్ ఈఅంశాన్ని ఖరారుచేసిన విషయం ఈ సందర్భంగా ప్రస్తావనార్హమన్నారు. అప్పుడు కాశ్మీర్ ప్రత్యేక రాజ్యంగా కొనసాగిన నేపథ్యంలో బయటి ప్రదేశాలలో ముఖ్యంగా పాటియాలా, లాహోర్ ఆస్థానాలలో విద్యాభ్యాసం చేసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్న డిమాండ్‌ను జమ్మూకు చెందిన డోగ్రా ప్రతినిధి సభతోపాటు కాశ్మీరీ పండిట్లు వ్యతిరేకించారన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టికల్ 35ఎను తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్రాన్ని అస్థిరత్వం పాలు చేసేందుకు మతోన్మాద, ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు పన్నుతున్న కుట్రలో భాగమేనని ఆయన అన్నారు. రాష్ట్రానికి తీవ్రమైన చేటు చేసే ఈ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ప్రజాస్వామిక శక్తులను ఏకం చేయాల్సిన అవసరం వుందన్నారు. దేశ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఆర్టికల్35ఎ కు అనుకూలంగా సుప్రీంకోర్టులో పటిష్టమైన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికలపై అహ్మద్ పటేల్‌కు హై కోర్టు నోటీసు

అహ్మదాబాద్ : గుజరాత్‌లో ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి దాఖలైన ఒక పిటిషన్‌పై సోమవారం హై కోర్టు సీనియర్ కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్‌కు నోటీసు జారీ చేసింది. రాజ్యసభ ఎన్నికల్లో రెబల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవంటూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బిజెపి అభ్యర్థి బల్వంత్ సిన్హ రాజ్‌పుట్ హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అహ్మద్ పటేల్‌తో పాటు రాజ్యసభ స్థానాలను గెలుచుకున్న మరో ఇద్దరు అభ్యర్థులు బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలకు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై సెప్టెంబరు 21లోగా స్పందించాలని కోరింది. ఎన్నికల్లో పటేల్ విజయం సాధించడానికి ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం దోహదపడిందంటూ రాజ్‌పుట్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

నేడే 'తలాక్' తీర్పు

న్యూఢిల్లీ : కొంతకాలంగా తీవ్ర ఆసక్తి రేపుతున్న ట్రిపుల్ తలాక్ చట్టబద్ధత అంశంపై సుప్రీంకోర్టు మంగళవారం తీర్పును వెల్లడించనుంది. దేశంలో ఉమ్మడి పౌర స్మృతి తేవాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న సమయంలో ట్రిపుల్ తలాక్‌పై సుప్రీం కోర్టు ఏ విధమైన తీర్పు ఇస్తుందోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ అధ్యక్షతన గల ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించనుంది. ముస్లిం మహిళల యొక్క గౌరవం, లింగ సమానత్వం, మానవ హక్కుల ఉల్లంఘన వంటి అంశాలను ట్రిపుల్ తలాక్ ఉల్లంఘిస్తోందా అనే అంశాలపై సుప్రీం కోర్టు తీర్పును ఇవ్వనున్నది. ఈ అంశంపై విచారణ ఇప్పటికే పూర్తయింది. తీర్పును కోర్టు రిజర్వ్‌లో వుంచింది. ముస్లిం మహిళల స్థాయిని తగ్గించేవిధంగా వివాహం, విడాకులకు సంబంధించిన చట్టాలను ముస్లిం పర్సనల్ లా కారణమవుతుందా అని 2015 అక్టోబర్ 16న సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఏకపక్ష విడాకులు, బహుభార్యాత్వం, నికా హలాలాతో మహిళల గౌరవానికి భంగం కలుగుతోందని దాఖలైన ప్రజాప్రయోజన వాజ్యం (పిల్)ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. షా బానో, డానియల్ లాతిఫ్ కేసుల్లో లింగ సమానత్వం అంశాన్ని పరిష్కరించడానికి కోర్టుకు అవకాశం కలగ లేదు. షా బానో కేసులో ఉమ్మడి సివిల్ కోడ్‌ను సమర్థించలేకపోయింది. డానియల్ లాతిప్ కేసులో ముస్లిం మహిళలు తిరిగి వివాహం చేసుకునే హక్కును సుప్రీంకోర్టు సమర్థించలేకపోయింది. ట్రిపుల్ తలాక్ కేసులో అనేక మంది ముస్లిం మహిళలు, ముస్లిం సంస్థల వాదనలను కోర్టు పరిశీలించింది. ఏకపక్ష విడాకులు, బహుభార్యాత్వం, నికా హలాలా అంశంపై కోర్టు స్వతంత్ర్యంగా నిర్ణయానికి రాలేకపోయింది.

గవర్నర్ల నియామకం తర్వాతే కేంద్ర మంత్రివర్గ విస్తరణ..!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
గవర్నర్లు లేని రాష్ట్రాలకు నియామకాలు జరిపిన అనంతరమే కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించనున్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాల గవర్నర్లు ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. కొందరు కేంద్ర మంత్రులను గవర్నర్లుగా నియమించాలని మోడీ సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం. దేశంలో ప్రస్తుతం ఆరు రాష్ట్రాలకు తాత్కాలిక గవర్నర్లు ఉన్నారు. బీహార్ గవర్నర్‌గా ఉన్న రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత, ఆయన స్థానంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠికి అదనపు బాధ్యతలు అప్పగించారు. తమిళనాడు గవర్నర్‌గా ఉన్న కొణిజేటి రోశయ్య పదవీకాలం ముగిసిన తరువాత ఆ స్థానంలో మహారాష్ట్ర గవర్నర్ సి.ఎచ్ విద్యాసాగర్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలకు ఉమ్మడి గవర్నర్‌గా ఈఎస్ఎల్ నరసింహన్ వ్యవహరిస్తుండగా, గుజరాత్ గవర్నర్ ఓం ప్రకాశ్ కోహ్లి మధ్యప్రదేశ్‌కు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాగాలాండ్ గవర్నర్‌గా వున్న పద్మనాభ ఆచార్య అరుణాచల్ ప్రదేశ్‌కు, అస్సాం గవర్నర్ భన్వర్ లాల్ పురోహిత్ మేఘాలయకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఏపి, తెలంగాణా ఉమ్మడి గవర్నర్ నరసింహన్, జమ్ముకాశ్మీర్ గవర్నర్ నరేంద్ర నాథ్ బెహర్, ఒరిస్సా గవర్నర్ ఎస్.సి జమిర్, సిక్కిం గవర్నర్ శ్రీనివాస్ పాటిల్ వంటి వారి పదవి కాలం త్వరలో ముగియనుంది. దీంతో వారి స్థానంలో కూడా కొత్త వారిని నియమించాల్సి వుంది. కాంగ్రెస్ హయంలో గవర్నర్లుగా పదవీ బాధ్యలు చేపట్టిన కొందరి పదవీకాలం పూర్తికాకపోయినా, వారిలో కొంత మంది ఉద్వాసనకు అవకాశముంది. ఖాళీ అయిన గవర్నర్ల స్థానాల్లో బిజెపి, ఆరెస్సెస్‌లతో సంబంధాలున్న వారిని మాత్రమే నియమించాలని కేంద్రం యోచిస్తోంది.ఏపి, తెలంగాణలకు వేర్వేరు గవర్నర్లను నియమించేందుకు కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుత గవర్నర్ నరసింహన్‌ను కూడా మార్చేందుకు రంగం సిద్ధమైంది. ఏపికి గుజరాత్ మాజీ సిఎం ఆనంది బెన్ నియమించే అవకాశాలున్నట్లు బిజెపి వర్గాలు చెబుతున్నాయి.

'మాలేగావ్' నిందితుడు పురోహిత్‌కు బెయిల్

శరతులతో మంజూరు చేసిన సుప్రీం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుళ్ల కేసులో కీలక నిందితుల్లో ఒకరైన మాజీ సైనికాధికారి లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్‌కు సుప్రీంకోర్టు సోమవారం నాడు శరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఈ కేసులో ఆయన 9 ఏళ్లుగా జైలులో వున్న విషయం తెలిసిందే. గత విచారణలో పురోహిత్‌కు బెయిల్ మంజూరు చేయటాన్ని ఈ కేసును దర్యాప్తు చేస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) తీవ్రంగా వ్యతిరేకించింది. దాదాపు ఏడుగురిని బలి తీసుకున్న ఈ పేలుడులో పురోహిత్ పాత్రపై తమ వద్ద తగిన ఆధారాలున్నాయని ఎన్ఐఎ పేర్కొంది. ఇరు వర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు తన నిర్ణయాన్ని రిజర్వ్ చేస్తున్నట్లు గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకు ముందు తన బెయిల్ పిటిషన్‌ను ముంబయి హైకోర్టు తిరస్కరించటంతో పురోహిత్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముంబయి హైకోర్టు ఆదేశాలను తాము రద్దు చేస్తున్నట్లు బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తులు ఆర్‌కె అగర్వాల్, ఎఎం సప్రేతో కూడిన ధర్మాసనం ప్రకటించింది.

నిందితులను కాపాడేందుకు బిజెపి యత్నాలు

మాలేగావ్ పేలుళ్ల కేసులో నిందితులను కాపాడేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదన్న తమ అనుమానాలు సుప్రీం కోర్టు తీర్పుతో రుజువయ్యాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. నిందితులందరూ ఆరెస్సెస్‌తో సంబంధాలు కలిగి వున్న వారేనని, అందువల్లే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తోందని తాము అనుమానిస్తూనే వున్నామని దిగ్విజయ్ సింగ్ ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఢిల్లీలో తొలి డెంగ్యూ మరణం

12 ఏళ్ల బాలుడి మృతి

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాదిలో తొలి డెంగ్యూ మరణం సంభవించింది. ఈ వ్యాధితో 12 ఏళ్ల బాలుడు సోమవారం మృతి చెందాడు. 'దక్షిణ ఢిల్లీలో సఫ్దర్జంగ్ ప్రాంతంలో నివాసం వుండే బీహార్‌కు చెందిన నితీష్‌కుమార్ డెంగ్యూతో శ్రీ గంగా రామ్ ఆసుపత్రిలో మరణించాడు' అని దక్షిణ ఢిల్లీ మేయర్ కమల్‌జీత్ సెహ్రావాత్ విలేకరులకు తెలిపారు. జులై 30న ఈ బాలుడ్ని ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. ఈ సీజన్‌లో కనీసం 657 మంది డెంగ్యూ ప్రభావానికి గురయ్యారు. ఈ నెల 19 నాటికి 153 కేసులు నమోదయ్యాయి. 657 డెంగ్యూ కేసుల్లో 325 మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఢిల్లీలో నివాసం వుంటున్నవారిగా గుర్తించారు. అలాగే ఈ నెల 19 నాటికి 412 మంది మలేరియాతోనూ, 311 మంది చికున్‌గున్యాతోనూ బాధపడుతున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో 'గోరఖ్‌పూర్'

ఆక్సిజన్ అందక ముగ్గురు చిన్నారుల మృతి

రాయపూర్: ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి 70 మంది చిన్నారులు మృత్యువాత పడిన 'గోరఖ్‌పూర్' ఘటన మరువక ముందే ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో ఇటువంటి ఘటన చోటు చేసుకుంది. ప్రభుత్వ నిర్వహణలోని బిఆర్ అంబేద్కర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరాలో వత్తిడి ఆకస్మికంగా పడిపోవటంతో ముగ్గురు నవజాత శిశువులు మరణించిన ఘటన వెలుగు చూసింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా వున్నాయి. ఆస్పత్రిలోని స్పెషల్ కేర్ యూనిట్‌కు సరఫరా అయ్యే ఆక్సిజన్ ప్రెజర్ ఆకస్మికంగా పడిపోవటంతో ఈ ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని ఛత్తీస్‌గఢ్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఆర్ ప్రసన్న మీడియా ప్రతినిధులకు వివరించారు. ఆక్సిజన్ సరఫరాలో వత్తిడి పడిపోయిన వెంటనే అలారం మోగించటంతో ఆన్‌డ్యూటీ డాక్టర్లు పరిస్థితిని వెంటనే సరిదిద్దారన్నారు. ఆక్సిజన్ సరఫరాలో వత్తిడి పడిపోవటమే తప్ప ఆక్సిజన్ సరఫరా నిలిచి పోలేదని, ఆస్పత్రి సూపరింటిండెంట్ వెంటనే జోక్యంచేసుకుని పరిస్థితిని సరిదిద్దారని ఆయన వివరించారు. చిన్నారుల మరణాలకు ఆక్సిజన్ సరఫరాలో లోపం కాదని, అస్వస్థత మాత్రమేనని, పూర్తి సమాచారం అందిన వెంటనే తాను మీడియాకు వెల్లడిస్తానని ఆయన చెప్పారు. కాగా ఆస్పత్రి యాజమాన్యం మాత్రం ఆక్సిజన్ సరఫరా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆపరేటర్‌ను వెంటనే సస్పెండ్ చేసింది. విధి నిర్వహణలో మద్యం సేవించి మత్తుగా పడివుండటంతో అతడిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలా వుండగా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ దీనిపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు.



ఒక్కటైన రెండాకులు

(మొదటి పేజీ తరువాయి)

ఉపముఖ్యమంత్రిగా పన్నీర్ సెల్వం నియమితుల య్యారు. మరో సీనియర్ నేత పాండ్యరాజన్ కూడా మంత్రిగా నియమితులయ్యారు. ఇక పార్టీ పరంగా పన్నీర్ సెల్వం కో-ఆర్డినేటర్‌గాను, పళని స్వామి, మునుస్వామి సంయుక్త కో-ఆర్డినేటర్‌లుగా కొనసాగాలని నిర్ణయించారు. పార్టీ కార్యకలాపాల నిర్వహణకు 11 మంది సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పళనిస్వామి సోమవారం మధ్యాహ్నం పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న కొద్దిసేపటికి పన్నీర్ సెల్వం అక్కడికి వచ్చారు. పార్టీ చీలిక అనంతరం దాదాపు ఏడు నెలల విరామం తరువాత ఆయన పార్టీ ప్రధాన కార్యాలయానికి రావటం విశేషం. వీరిరువురికీ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పన్నీర్ సెల్వం పార్టీ కార్యాలయానికి రావటానికి కొద్ది ముందు ఆయన వర్గానికి చెందిన పి మునుస్వామి, రాజ్యసభ సభ్యుడు వి మైత్రేయన్, సీనియర్ నేత సి పొన్నయ్యన్, మాజీ ఎంపి పిహెచ్ మనోజ్ పాండియన్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం జయ సమాధి స్థలికి వెళ్లి ఆమెకు పుష్పాంజలి ఘటించిన తరువాత వీరందరూ రాజ్‌భవన్‌కు చేరుకోవటంతో అక్కడ గవర్నర్ విద్యాధరరావు పన్నీర్ సెల్వంతో ఉపముఖ్య మంత్రిగా, పాండ్యరాజన్‌తో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించి వారికి అభినందనలు తెలియచేశారు.

ఆధిపత్య పోరుకు తెర

శశికళను పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యతిరేకిస్తూ పన్నీర్ సెల్వం తిరుగుబాటు చేయటంతో గత ఫిబ్రవరిలో పాలక అన్నాడిఎంకెలో ఆధిపత్య పోరు ప్రారంభమైంది. తనను ముఖ్యమంత్రి పదవి నుండి బలవంతంగా రాజీనామా చేయించారంటూ సెల్వం ఆందోళన ప్రారంభించటంతో ఆయన్ను పార్టీ కోశాధికారి పదవి నుండి తొలగించారు. దీనితో సెల్వం అన్నా డిఎంకె(పురాచ్చి తలైవి అమ్మ) పేరుతో వేరు కుంపటి పెట్టుకున్నారు. తరువాత ముఖ్యమంత్రి పదవిపై కన్నేసిన శశికళ అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లాల్సి రావటంతో ఆమె పార్టీ శాసనసభా పక్ష నేతగా పళనిస్వామిని నియమించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా తన మేనల్లుడు దినకరన్‌ను నియమించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పళని స్వామి తాను శశికళకు బినామీ అంటూ వచ్చిన విమర్శలను తిరస్కరించారు. ఏప్రిల్‌లో జరిగిన నాటకీయ పరిణామాలలో పళనిస్వామి కేబినెట్ శశికళ, ఆమె మేనల్లుడు దినకరన్‌లను పక్కన పెడుతున్నట్లు సంకేతాలు వెలువరించింది. జయలలిత గతంలో ప్రాతినిధ్యం వహించిన ఆర్‌కె నగర్ ఉప ఎన్నిక రద్దు కావటంతో పళనిస్వామి ఆయన మంత్రివర్గ సహచరులు దినకరన్, శశికళలపై వ్యతిరేక వైఖరిని అనుసరించారు. అదే సమయంలో దినకరన్ ఎన్నికల కమిషన్‌కు లంచాలిచ్చేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు వెలువడటంతో పళనిస్వామి కేబినెట్ ఆయనపై మరింత కఠిన వైఖరి అనుసరించింది. దినకరన్ నియామకం చెల్లదంటూ విలీనానికి సానుకూల సంకేతాలు పంపింది. దీనితో పాటు జయలలిత మృతిపై న్యాయవిచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన పళనిస్వామి సర్కారు ఆమె నివాసం పొయెస్ గార్డెన్‌ను జయ స్మారక స్థలిగా ప్రకటించింది. ఈ చర్యలతో మెత్తబడిన పన్నీర్ సెల్వం విలీనానికి సానుకూలత వ్యక్తం చేశారు. దీనిపై జరిగిన వరుస చర్చల అనంతరం సోమవారం నాడు అధికారికంగా విలీనాన్ని ప్రకటించారు.

శశికళ ఉద్వాసనకు త్వరలో చర్యలు

ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా వున్న శశికళను త్వరలోనే పార్టీ నుండి తొలగించేందుకు చర్యలు తీసుకుంటా మని పళనిస్వామి వర్గానికి చెందిన నేత, రాజ్యసభ ఎంపి ఆర్ వైద్య లింగం చెప్పారు. త్వరలో జరుగనున్న పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. గతంలో పార్టీ జనరల్ కౌన్సిల్ సమా వేశంలోనే శశికళను పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నం దున, తిరిగి కౌన్సిల్ నిర్ణయం ద్వారా మాత్రమే ఆమె తొలగింపు సాధ్యమవుతుందని ఆయన చెప్పారు.

ప్రధాని అభినందనలు

అన్నా డిఎంకె చీలిక వర్గాలు విలీనం కావటంపై ప్రధాని నరేంద్రమోడీ హర్షం వ్యక్తం చేశారు. విలీనానికి అంగీకరిం చిన ఉపముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంకు ఆయన ట్విట్టర్‌లో అభినందనలు తెలియచేశారు.

విశ్వాస పరీక్షకు పళని ప్రభుత్వం సిద్ధం కావాలి...!
గవర్నర్‌ను కలవనున్న శశికళ శిబిరం

అన్నాడిఎంకెలో పళనిస్వామి, పన్నీరు సెల్వం శిబిరాలు విలీనమైన వెంటనే శశికళ శిబిరం నుంచి వారికి బలమైన హెచ్చరికా, సంకేతాలు వచ్చాయి. మెరినా బీచ్‌లోని జయలలిత సమాధి వద్దకు చేరిన పలువురు శశికళ శిబిరంలోని ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి శశికళకు మద్దతుగా నినాదాలు చేశారు. మంగళవారం శశికళ మేనల్లుడు దినకరన్‌తో పాటు ఆ రాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌ను కలిసి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించనున్నట్లు ప్రకటించనున్నారు. ప్రభుత్వ విశ్వాస పరీక్షలను ఎదుర్కొవలసి ఉంటుందని హెచ్చరించారు. 235 మంది ఎమ్మెల్యేలున్న తమిళనాడులో ప్రస్తుతం అధికారంలో ఉన్న అన్నాడిఎంకె ప్రభుత్వానికి పడగొట్టడానికి 18 మంది ఎమ్మెల్యేలు సరిపోతారు. దీంతో 'అవసరమైతే ప్రభుత్వాన్ని కూలుస్తాం' అనే బలమైన సంకేతం శశికళ శిబిరం నుంచి వచ్చినట్లు అయ్యింది.

బొగ్గు స్కాం కేసుల్లో పూర్తికాని దర్యాప్తు : సుప్రీం అసంతృప్తి

న్యూఢిల్లీ : బొగ్గు గనుల కేటాయింపులకు సంబంధించిన కుంభకోణాల్లో సిబిఐ దర్యాప్తు పూర్తి చేయక పోవడం పట్ల సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసుల దర్యాప్తును పూర్తి చేయాలని సిబిఐని ఎప్పటికప్పుడు కోరుతున్నప్పటికీ, వాటిని ఒక ముగింపునకు తెస్తున్నట్లు కనిపించడం లేదని జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సుప్రీం బెంచ్ పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తుపై నివేదికను సమర్పించాలని బెంచ్ సిబిఐని ఆదేశించింది. జస్టిస్ కురియన్ జోసఫ్, ఎ.కె. సిక్రీలు ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు. కాగా ఈ కేసు తదుపరి విచారణను అక్టోబరు 9కి వాయిదా వేసింది.

ప్రజల నెత్తిపై ఎఐఎడిఎంకె కుచ్చు టోపి? : కమల్‌హాసన్



చెన్నై : తమిళనాడులో అధికార ఎఐఎడిఎంకెలోని రెండు గ్రూపులు విలీనాన్ని నటుడు కమల్‌హాసన్ వ్యంగ్యమైన వ్యాఖ్యలతో తీవ్రంగా విమర్శించారు. పార్టీ నాయకులు ప్రజలను "ఫూల్స్"ను చేశారంటూ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. పాలకులు ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. "ప్రజల నెత్తిపై గాంధీ టోపి, కాషాయ టోపి, కాశ్మీరీ టోపి పెట్టడం అయిపోయిందని, ఇప్పుడు కుచ్చుటోపి పెట్టారని" ఆయన ఆరోపించారు. ఎఐఎడిఎంకె అప్పుడు విడిపోయి, ఇప్పుడు కలిసిపోయి పెద్ద డ్రామా ఆడిందని విమర్శించారు. రాష్ట్రంలో నేరాలను, అవినీతిని అరికట్టడంలో ముఖ్యమంత్రి ఇ. పళనిస్వామి ప్రభుత్వం విఫలమైందని గతంలో ఆరోపించి కమల్‌హాసన్ తీవ్ర విమర్శలకు గురయ్యారు.

పాట్నాలో ప్రతిపక్షాల ర్యాలీకి మాయావతి దూరం?!

లక్నో : పాట్నాలో ఈ నెల 27న ప్రతిపక్షాలు నిర్వహించనున్న ఐక్యతా ర్యాలీలో పాల్గొనే విషయమై బిఎస్‌పి అధినేత్రి మాయావతి మౌనం వహిస్తూ, ర్యాలీకి సంబంధించి ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇటీవల సామాజిక మాధ్యమంలో షేర్ అయిన బిజెపియేతర నేతలతో తాను కలిసి ఉన్నట్లున్న పోస్టర్ పట్ల ఆమె ఒకింత విముఖతను వ్యక్తం చేయడం, దానిపై వివరణ ఇవ్వడం తదితర అంశాలు ఆమె ర్యాలీలో పాల్గొనే విషయమై సందేహాన్ని కలిగిస్తున్నాయి. బిజెపియేతర నేతలతో పాటు తనను కూడా చిత్రించిన ఆన్‌లైన్ పోస్టర్ వ్యవహారాన్ని సోమవారం ఆమె తీవ్రంగా ఖండించారు. అది ఒక కొంటె పని అని, అంతకు మించి తప్పు పని అని ఆమె పేర్కొన్నారు. అయితే ఆ పోస్టర్ బిఎస్‌పి పేరుతో ఉన్న ట్విట్టర్‌లో షేర్ కావడం విశేషం. దీనిపై ఆమె వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాజిక న్యాయానికి మద్దతుగా ప్రతిపక్షాలు ఏకమవ్వాలన్న నినాదంతో ముద్రించిన ఆ పోస్టర్‌లో అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, లాలూ ప్రసాద్ , శరద్ యాదవ్, మమతా బెనర్జీ, సోనియా గాంధీలతో పాటు ఆమె కటవుట్ కూడా ఉంది. ఇది తప్పుడు ప్రచారమని ఆమె వివరణ ఇచ్చారు. బిఎస్‌పికి అధికారిక ట్విట్టర్ ఏదీ లేదన్నారు. తరుచూ ప్రెస్‌నోట్ల ద్వారానే బిఎస్‌పి తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తోందన్నారు. మీడియాకు, సామాన్య ప్రజలకు అర్థమయ్యేందుకు ప్రెస్‌నోట్లను హిందీలో విడుదల చేస్తామని తెలిపారు. ట్విట్టర్‌లో ఈ సౌలభ్యం ఉండదని ఆమె చెప్పారు. అంతేకాక పోస్టర్‌లో పేర్కొన్న విధంగా "దళిత్-ఓబిసి ఐక్యత" అనే రాజకీయ సందేశానికి ఆమె దూరంగా ఉన్నారు.

ఆయిల్ టాంకర్‌ను ఢీకొన్న అమెరికా యుద్ధనౌక

సింగపూర్ : ఆయిల్ టాంకర్‌ను అమెరికా యుద్ధనౌక ఢీ కొన్న ఘటనలో 10 మంది అమెరికా సైనికులు గల్లంతు కాగా, మరో ఐదుగురు సైనికులకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా యుద్ధనౌకలోకి భారీ ఎత్తున నీళ్లు చేరాయి. సైనికుల కోసం తీవ్ర స్థాయిలో అన్వేషణ కొనసాగిస్తున్నారు. యుద్ధనౌకలను సాధారణ నౌకలు ఢీ కొనడం చాలా అరుదు. ఇలాంటి సంఘటన 50 సంవత్సరాలకు పూర్వం జరిగినట్లుగా అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు అమెరికా రక్షణ శాఖ కార్యదర్శి జెమ్స్ మిట్టిస్ తెలిపారు.



చైనా బుల్లెట్ రైళ్ల వేగం పెంపు

బీజింగ్ : ప్రపంచంలోనే అత్యంత వేగంగా నడిచే బుల్లెట్ రైళ్ళను చైనా తిరిగి ప్రారంభిస్తోంది. గంటకు 350కిలోమీటర్ల వేగంతో ఈ రైళ్ళు నడుస్తాయి. బీజింగ్ నుండి షాంఘై వరకు నడిచే ఈ రైళ్ళను వచ్చే నెల నుండి ప్రారంభించనున్నారు. కేవలం నాలుగున్నర గంటల్లో 1250కిలోమీటర్లు ప్రయాణించగలిగే సామర్ధ్యం వీటి సొంతం. 2008 ఆగస్టులో తొలిసారిగా గంటకు 350కిలోమీటర్ల వేగంతో చైనాలో రైలు నడిచింది. అయితే వెన్‌ఝు నగరం సమీపంలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 40మంది మరణించగా, 191 మంది గాయపడడంతో 2011లో ఈరైళ్ళ వేగాన్ని గంటకు 250-300కిలోమీటర్లకు తగ్గించారు. 20వేల కిలోమీటర్లకి పైగా హై స్పీడ్ రైలుకు అవసరమైన ట్రాక్‌ను చైనా వేసింది. 2020 నాటికి మరో 10వేల కిలోమీటర్లను పొడిగించాలని భావిస్తోంది. ఈ రైళ్ళపై చైనా ఇప్పటివరకు 360 బిలియన్ల డాలర్లను ఖర్చు పెట్టింది.



నవంబరు 26న నేపాల్ సార్వత్రిక ఎన్నికలు

ఖాట్మండ్: నేపాల్ పార్లమెంట్‌కు నవంబరు 26న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నట్లు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. 239 ఏళ్ల రాచరిక వ్యవస్థ నుంచి బయటకు వచ్చి ప్రజాస్వామ్యంలో తప్పటడుగులు వేస్తున్న నేపాల్, ఈ ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పాలనను గాడిలో పెట్టాలని చూస్తోంది. 2015లో ఆమోదించిన రాజ్యాంగాన్ని అనుసరించి ఈ హిమాలయ దేశంలో తొలి ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల క్రతువును పూర్తి చేసి జనవరి 21 లోపు ఆ దేశంలో కొత్త పార్లమెంట్ కొలువుతీరాల్సి ఉందని ప్రస్తుత కేబినేట్ నిర్ణయించినట్లు న్యాయశాఖ మంత్రి యోగ్య బహద్దూర్ థాపా ప్రకటించారు. నేపాలీలకు ఇది పెద్ద పండుగలాంటిదని అందులో ఎలాంటి సందేహం లేదనీ ఆయన విలేకర్లతో పేర్కొన్నారు. రాజ్యాంగం ఆమోదించిన ఫెడరల్ వ్యవస్థలో ఏడు రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా అదే రోజు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేపాల్ రాజకీయాలపై పొరుగు దేశాలైన చైనా, భారత్‌లు కూడా ఆసక్తి కనబరుస్తున్నాయి.

వెనిజులాకు మద్దతుగా ప్రపంచ సంఘీభావ సదస్సు

కారకస్ : వెనిజులాకు వ్యతిరేకంగా అమెరికా నిరంతరంగా చేపడుతున్న దాడులను ఖండించేందుకు ప్రపంచ సంఘీభావ సదస్సు నిర్వహించాలని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో పిలుపిచ్చారు. ప్రముఖ మేధావి జోస్ విన్సెంట్ రంగెల్‌తో జరిగిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన, అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సన్నాహాలు వచ్చే వారం ప్రారంభమవుతాయని చెప్పారు. వెనిజులా సార్వభౌమాధికారానికి, స్వయం నిర్ణయాధికారానికి వ్యతిరేకంగా మీడియా సంస్థలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడానికే ఈ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. వెనిజులాలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులకు మద్దతుగా ప్రపంచ ప్రజల అభిప్రాయాన్ని సమీకరించేందుకు ఈ సంఘీభావ సదస్సు ఉపయోగపడతుందని మదురో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రపంచ దేశాల ప్రతినిధులతో చర్చలు జరుగుతున్నాయన్నారు.

కొద్ది రోజుల్లో జరగనున్న సెలాక్ సమావేశాన్ని ప్రస్తావిస్తూ, సెలాక్ అధ్యక్షుడు ఈ సదస్సుకు సంఘీభావం తెలుపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.



తీవ్రవాదానికి మద్దతు నిలిపితేనే చర్చలు

పశ్చిమ దేశాలకు స్పష్టం చేసిన సిరియా అధ్యక్షుడు



డమాస్కస్ : తీవ్రవాదులకు మద్దతు నిలిపివేస్తేనే పశ్చిమ దేశాలు, వాటి ప్రాంతీయ మిత్రపక్షాలతో ఏ రూపంలోనైనా నిర్మాణాత్మక చర్చలు సాధ్యమవుతాయని సిరియా అధ్యక్షుడు బషర్ అసద్ స్పష్టం చేశారు. ఇటీవల తాము కొన్ని విజయాలు సాధించినప్పటికీ విజయం గురించి ఇప్పుడే మాట్లాడడం తొందరపాటు అవుతుందని వ్యాఖ్యానించారు.

తీవ్రవాదులను నిర్మూలించే దిశగా ప్రతి రోజూ మన సైన్యం విజయాలు సాధిస్తోంది. సిరియా గడ్డపై చిట్టచివరి తీవ్రవాదిని కూడా నిర్మూలించేవరకు సైన్యం పోరు కొనసాగిస్తుంది." అని అసద్ ఆదివారం టివిలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ పేర్కొన్నారు. ఇంకా పోరాటం కొనసాగుతున్నపుడు విజయం గురించి మాట్లాడడం అవివేకమని అన్నారు. తీవ్రవాద నిర్మూలనలో రష్యా వైమానిక బలగాలు, హిజ్బుల్లా బలగాలు పోషిస్తున్న పాత్రను ఆయన ప్రశంసించారు. "రాజకీయంగా, ఆర్థికంగా, సైనికపరంగా మన మిత్రులు ఇస్తున్న ప్రత్యక్ష తోడ్పాటు వల్ల తక్కువ యుద్ధ నష్టాలతో మనం మరింత ముందుకు పురోగమిస్తున్నామని చెప్పారు. తీవ్రవాదాన్ని అణచివేసేందుకు మనం జరుపుతున్న ఈ పోరులో వారు మన భాగస్వాములని వ్యాఖ్యానించారు. తీవ్రవాదంతో గల సంబంధాలను తెగతెంపులు చేసుకోకపోతే సిరియాతో వారెలాంటి సంబంధాలను పెట్టుకోలేరని, భద్రతా సహకారం వుండదని, ఎంబసీలు ప్రారంభించడం వంటి చర్యలు వుండవని అసద్ స్పష్టం చేశారు. తీవ్రవాదులతో అన్ని విధాలుగా సంబంధాలు తెగిపోయాయని భావిస్తే ఆ సమయంలో దౌత్య కార్యాలయాలు ప్రారంభించే విషయంపై ఆలోచించవచ్చని అన్నారు. పశ్చిమ దేశాలు పాము లాంటివని, పరిస్థితులకు అనువుగా మారుతూ వుంటాయని అసద్ వ్యాఖ్యానించారు. ప్రజల సంగతి పట్టించుకోకుండా అంతర్జాతీయ చట్టాలను కాలరాయాలనుకునే శక్తులకు, ప్రజల ప్రాణాలను కాపాడుతూ, జాతీయ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకోవాలనుకునే శక్తులకు మధ్య జరుగుతున్న ఘర్షణే సిరియా యుద్ధమని అసద్ ఉద్ఘాటించారు. ఈ యుద్ధంలో సిరియా పెద్ద మూల్యమే చెల్లించిందని, అయితే సిరియాలో పశ్చిమ దేశాలు చేపట్టదలచుకున్న చర్యలను అడ్డుకోగలిగామని చెప్పారు. ఇప్పటివరకు వారు ప్రతీ నిముషం ఓడిపోతునే వున్నారని అన్నారు. మన వరకు అయితే విజయ సంకేతాలు కనిపిస్తున్నాయని, కానీ విజయం వేరు, విజయ సంకేతాలు వేరని, పూర్తి స్థాయిలో విజయం సిద్ధించేవరకు పోరు తప్పదని పేర్కొన్నారు.

ఖలీదా విజ్ఞప్తికి బంగ్లా సుప్రీం నిరాకరణ



ఢాకా : తనపై నమోదైన అవినీతి కేసు విచారణను నిలిపివేయాలని మాజీ ప్రధాన మంత్రి ఖలేదా జియా చేసుకున్న అభ్యర్ధనను బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు సోమవారం నిరాకరించింది. ప్రధాన మంత్రి ఖలేదా జియా అవినీతి వల్ల ప్రభుత్వ ఖజానాకు 120 మిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లింది. అవినీతి ఆరోపణలతో 2007లో ఆమెపై కేసు నమోదయ్యింది. జియా 2001-2006 మధ్య కాలంలో ప్రధాన మంత్రి పదవిలో కొనసాగారు. ఆ సమయంలో గ్లోబల్ అగ్రో ట్రేడ్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్(గాట్కో)కు ఢాకా, చిట్టగాంగ్‌లలోని డిపోల వద్ద కంటైనర్ల నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్టును కేటాయించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కాంట్రాక్టును కేటాయించారని, దీని కారణంగా సుమారు 124 మిలియన్ డార్ల నష్టం వాటిల్లిందని అవినీతి నిరోధక కమిషన్ (ఎసిసి) ఆరోపించింది. దీనికి సంబంధించి దిగువ కోర్టులో నడుస్తున్న కేసు విచారణపై స్టే కోరుతూ ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు ఆమె విజ్ఞప్తిని నిరాకరించింది. జియా, ఆమె చిన్న కుమారుడు అర్ఫత్ రహమాన్‌తో పాటు మరో 11 మందిపై 2007, సెప్టెంబరు 2న కేసు నమోదు చేసింది. కాగా అర్ఫత్ రహాన్ 2015లో మరణించారు. తనపై రాజకీయ దురుద్దేశంతోనే కేసులు నమోదు చేశారని జియా తెలిపారు. జియా బంగ్లాదేశ్ ప్రధాన మంత్రిగా రెండు సార్లు పనిచేశారు. కాగా కేసు నమోదు చేసిన రోజునే జియాను అరెస్టు చేశారు. ఆ తరువాత ఆమె హై కోర్టు నుంచి బెయిల్ పొందారు. ఈ కేసు నమోదు సమయంలో దేశంలో సైనిక మద్దతుతో అత్యవసర పరిస్థితి కొనసాగింది. అంతకుముందు 2015 ఆగస్టులో కేసు కొట్టివేయాలని కోరుతూ చేసుకున్న దరఖాస్తును హై కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు ఇప్పుడు ఢాకా స్పెషల్ జడ్జెస్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. జియా తనపై నమోదైన మరో రెండు అవినీతి కేసుల నుంచి కూడా బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారు 1991-1996, 2001-2006 మధ్య కాలంలో రెండు సార్లు ఆమె దేశ ప్రధానిగా పనిచేశారు.


క్షిపణి కార్యక్రమం కొనసాగుతుంది

ప్రకటించిన ఇరాన్ రక్షణ మంత్రి

టెహరాన్ : ఇరాన్ క్షిపణి కార్యక్రమం నిరాటంకంగా ముందుకు సాగుతుందని కొత్త రక్షణ మంత్రి బ్రిగేడియర్ జనరల్ అమిర్ హతామి ప్రకటించారు. రక్షణ పరిశ్రమ కార్యకలాపాలు కొనసాగిస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన ఇరాన్ ప్రభుత్వ మొదటి కేబినెట్ సమావేశం అనంతరం హతామి ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, అంగీకరించిన ప్రణాళికల ప్రకారం దేశ క్షిపణి కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఇరాన్ తన క్షిపణి కార్యక్రమాన్ని నిలిపివేయాలంటూ ఒత్తిడి తెస్తున్న కొన్ని విదేశీ ప్రభుత్వాలకు సంబంధించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఈ తరహా ఒత్తిళ్ళు ఎన్ని వచ్చినా ఈ కార్యక్రమాలు ఆగవని స్పష్టం చేశారు. తమ రక్షణ మంత్రిత్వ శాఖకు సంబంధించిన కార్యకలాపాలను ఒక్క రోజు కూడా నిలుపుచేసేది లేదని ఆయన పునరుద్ఘాటించారు. అధ్యక్షుడు హసన్ రౌహని ప్రతిపాదించిన మంత్రుల్లో ఒకరు తప్ప మిగిలిన వారందూ ఇరాన్ పార్లమెంట్ విశ్వాస పరీక్షలో నెగ్గారు. రక్షణ మంత్రికి అత్యధికంగా 261మంది పార్లమెంట్ సభ్యులు మద్దతు తెలిపారు. కేవలం 10మంది ఎంపీలు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేయగా 13మంది గైర్హాజరయ్యారు. ఇరాన్ సైన్యాన్ని బలహీనపరిచేందుకు శత్రువులు ఆంక్షలను విధిస్తున్నారని ఆయన విమర్శించారు. శత్రువుల ఆలోచనలను, ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు మనం లక్ష్యాలను నిర్ణయించుకున్నామన్నారు.

తీవ్రవాదంపై ఉధృత పోరు

నైజీరియా అధ్యక్షుడు బుహారి



అబుజా (నైజీరియా) : దేశంలోని ఈశాన్య ప్రాంతంలో ఇస్లామిక్ తీవ్రవాదానికి వ్యతిరేకంగా తమ ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తామని నైజీరియా అధ్యక్షుడు మహ్మద్ బుహారి తెలిపారు. వైద్య చికిత్స నిమిత్తం మూడు మాసాలకు పైగా లండన్‌లో గడిపి స్వదేశానికి తిరిగివచ్చిన వెంటనే సోమవారం మొదటిసారిగా దేశ ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రజలు ప్రశాంతంగా, భద్రతతో జీవించాలంటే తీవ్రవాదులు, నేరస్తులపై పోరాటం తప్పనిసరని, వారిని సమూలంగా నిర్మూలించాలని బుహారీ పిలుపునిచ్చారు. బొకోహారం తీవ్రవాదులపైనే కాదు, రాజకీయ తప్పిదాలు చేస్తూ జాతుల మధ్య ఘర్షణలకు, హింసాకాండకు ఆజ్యం పోసేవారిపై పోరు మరింత ఉధృతం చేయాలని కోరారు. అయితే మే నెల్లో లండన్ వెళ్ళి సుదీర్ఘంగా చికిత్స పొందడానికి దారి తీసిన అస్వస్థత ఏమిటనేది ఆయన వెల్లడించలేదు. తన దేశ ప్రజల ప్రార్ధనలు ఫలించాయని, తాను ఆరోగ్యంగా తిరిగి వచ్చానని వ్యాఖ్యానించారు. సుదీర్ఘకాలం దేశానికి దూరంగా వుండడంతో ఆయన స్థానంలో వేరేవారిని తీసుకోవాలని కొన్ని వర్గాలు డిమాండ్ చేశాయి. దేశంలో నెలకొన్న రాజకీయ విభేదాలను ప్రస్తావిస్తూ బుహారి, దేశం ఐక్యంగా వుండాలని కోరారు. తాను లండన్‌లో వున్నప్పటికీ దేశంలో జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వున్నానన్నారు. అయితే నైజీరియాలో రాజకీయ అశాంతి తలెత్తే అవకాశాలు వున్నాయని రాజకీయ పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా వుంటే ఉత్తర ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. బొకోహారం తీవ్రవాద సమస్యతో నైజీరియా పలు సవాళ్ళను ఎదుర్కొంటోంది. అలాగే ఆర్ధిక వ్యవస్థ కూడా బలహీనంగా వుంది. తీవ్ర స్థాయిలో మానవతా సంక్షోభం నెలకొంది. ఆర్థిక భద్రతా సవాళ్ళను ఎదుర్కొనడానికి, శాశ్వత శాంతి స్థాపనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ సాధించడానికి కృత నిశ్చయంతో వున్నానని బుహారి ప్రకటించారు.

పరారీలోనే బార్సిలోనా వ్యాన్ డ్రైవర్

బార్సిలోనా : స్పెయిన్ నగరమైన బార్సిలోనాలో వ్యాన్‌తో దాడి చేసి 13మంది ప్రాణాలు పొట్టనబెట్టుకున్న డ్రైవర్‌ని అధికారులు గుర్తించారు, అయితే ఇంకా అతని ఆచూకీ తెలియరాలేదు.. పరారీలో వున్న 12మంది సభ్యుల తీవ్రవాద బృందంలో అతను చిట్టచివరి సభ్యుడని అధికారులు పేర్కొన్నారు. గురువారం ఈ దాడి జరిగినప్పటి నుండి 22ఏళ్ళ మొరాకో జాతీయుడు యూనస్ అబుయాకుబ్ కోసం గాలింపు చేపట్టినట్లు హోం మంత్రి జోవాక్విమ్ ఫార్న్ తెలిపారు. ఆ వ్యాన్ డ్రైవర్ అతడే అనడానికి చాలా సాక్ష్యాధారాలు లభ్యమయ్యాయని మంత్రి చెప్పారు. వ్యాన్‌తో జరిపిన దాడిలో డ్రైవర్ మరణించలేదనడానికి తమ వద్ద సాక్ష్యాలు వున్నాయని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

నీటి సమస్య జటిలమే

5359 చెక్‌డ్యామ్స్ పూర్తి చేశామని వివరించారు. మిగిలిన లక్ష్యాలూ వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నరేగా నిధులు రూ.460 కోట్లున్నాయని, మరో రూ.550 కోట్లు సోమవారం వస్తాయని తెలిపారు. 7.36 లక్షల మరుగుదొడ్లు పూర్తయ్యాయని, 5.47 లక్షల పంట కుంటల పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ప్రతినెలా మండలానికి వంద ఇళ్ల నిర్మాణ లక్ష్యం

ప్రతి నెలా ఒక్కో మండలంలో వంద ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. నెలకు 3.20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలన్నారు. 2018-19 సంవత్సరానికి 1.20 లక్షల ఇళ్లకు వెంటనే లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు వెంటనే స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తూ, అక్టోబర్ రెండో తేదీన అవార్డులిచ్చి సత్కరించాలని కోరారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జల వనరులు, వ్యవసాయ అనుబంధ శాఖలు, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ఉత్తపోతల' పథకం

నీరు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. పురుషోత్తపట్నం నుంచి ఫేజ్ -1 పనులు 28వ కిలోమీటర్ల వరకు సూర్య ఖాన్ కంపెనీ చేపట్టింది. సబ్‌కాంట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న ఈ పనులు ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. 16వ కిలోమీటరు వద్ద, 25వ కిలోమీటరు వద్ద రహదారిపై వంతె నలూ పూర్తి కాలేదు. 29వ కిలోమీటరు వద్ద ఎర్త్ వర్కు జరగాల్సి ఉంది. వీటితో పాటు అనేక పైపులైన్ల నిర్మాణం జరగాల్సి ఉంది. దీంతో నీటిని గండికోట నుంచి పోలవరం ఎడమ కాలువ ద్వారా కాకుండా పుష్కర కాలువ ద్వారా ఏలేరుకు తీసుకెళ్లాలని జలవనరులశాఖ నిర్ణయించింది. వంగల పూడి-పెదకొండే పూడి మధ్య పైపులైను గొట్టాలను అతికించే పని మొదలెట్టింది. ఈ పైపుల కింద నీరు చేరడంతో అవి పైకి లేస్తున్నాయి. పురుషోత్తపట్నం వద్ద 220 కెవి విద్యుత్ ఉప కేంద్రానికి టవర్ ద్వారా విద్యుత్ సరఫరా జరగాల్సి ఉంది. పుష్కర పథకం నుంచి 10.4 మెగావాట్ల విద్యుత్ తీసుకున్నప్పటికీ పైపుల పనులు పూర్తి కాలేదు. సిఎం సమీక్ష నిర్వహిస్తారనే ఉద్దేశంతో సోమవారం నాటికి నీటిని విడుదల చేయాలని జలవనరులశాఖ అధికారులు తొలుత నిర్ణయించారు. పైపులైను పనులు పూర్తికాకపోవడంతో గండికోటకు నీరు చేరలేదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

నీరివ్వనప్పుడు పథకం ఎందుకు ప్రారంభించారు?

టి.అరుణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి, రాజమహేంద్రవరం

పనులు పూర్తి కాకుండా పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని హడావుడిగా ఎందుకు ప్రారంభించారో సిఎం చెప్పాలి. ఈ పథకాన్ని ప్రారంభించి వారంరోజులు దాటినా నేటికీ ఏలేరుకు నీరు విడుదల కాలేదు. పైపులైను పనులన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. అనేకమంది రైతులకు నష్టపరి హారం చెల్లించలేదు. గండికోట నుంచి పుష్కర ఎత్తిపోతల పథకం కాలువ ద్వారా ఏలేరుకు నీరివ్వాలని నిర్ణయించినప్పుడు పురుషోత్తపట్నం పథకం ఎందుకు నిర్మిస్తు న్నారో ప్రభుత్వం చెప్పాలి.

తెలుగు ప్రజలు కలిసుండాలి

పిలుపునిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, కెసిఆర్ పరస్పరం సహకరించుకోవాలని, అభిప్రాయభేదాలున్నా, సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. తెలుగు భాష ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ ఈ భాషలో గ్రామర్ ఒక్కటే కాదని గ్లామర్ కూడా ఉందన్నారు. అయితే అంటువ్యాధిలా మారిన ఇంగ్లిష్‌ను వదిలించే బాధ్యతను రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీసుకొని తెలుగును కాపాడుకోవాలని సూచించారు.

వెంకయ్య సమర్థులు : గవర్నర్ నరసింహన్

ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకయ్యనాయుడు సమర్థుడని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ తెలిపారు. ఉషాపతిగా ఉంటానని చెప్పిన ఆయన ఉప రాష్ట్రపతి అయ్యారని చమత్కరించారు. రాజ్యసభ చైర్మన్‌గా సభను సమర్థంగా నిర్వహిస్తారన్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి కావడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు.

అంచెలంచెలుగా ఎదిగారు : సిఎం కెసిఆర్

వెంకయ్యనాయుడు అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నతస్థానానికి చేరుకున్నారన్నారు. ఎమర్జెన్సీ కాలంలో జైలుకు వెళ్లి వచ్చిన అనంతరం సుబ్రహ్మణ్యస్వామితో కలిసి వెంకయ్యనాయుడు సిద్ధిపేట వస్తే, తాను 1980లో తొలిసారి ఆయన్ని చూశానన్నారు. ఆయన ఉపన్యాసంలో మేళవించే నవరసాలను ఆనాడే విన్నానన్నారు. ఇలా గౌరవించుకునే అవకాశం కల్పించినందుకు వెంకయ్యనాయుడికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

మొదటి పేజీ తరువాయి

'బ్యాంకు సంస్కరణల'ను తిప్పికొట్టాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజానీకానికి వ్యతిరేకమైన, నష్టదాయకమైన సంస్కరణలను చేపడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని ప్రభుత్వ బ్యాంకులన్నింటినీ స్వదేశీ, విదేశీ బహుళ జాతి కంపెనీలకు అప్పగించే కుట్రలో భాగంగానే ఇలాంటి సంస్కరణలకు తెరలేపుతున్నారని ఘాటుగా విమర్శించింది.

తెలుగు రాష్ట్రాల్లో 80 వేల మంది నిరసన

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా మంగళవారం దేశవ్యాప్తంగా ఉన్న 10 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు ఒకరోజు సమ్మె నిర్వహిస్తున్నారని యుఎఫ్‌బియు కన్వీనర్ వివిఎస్ఆర్ శర్మ తెలిపారు. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 80 వేల మంది ఉద్యోగులు తమ తమ బ్యాంకుల వద్ద నిరసన ప్రదర్శనలు, ధర్నాలలో పాల్గొంటారని పేర్కొన్నారు. మొత్తం 5,000 బ్రాంచీల వద్ద జరిగే ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యుఎఫ్‌బియులో భాగస్వాములుగా ఉన్న ఇతర యూనియన్ల ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎఐబిఇఎ, బెఫి, ఎఐబిఒసి, ఎన్‌సిబిఇ, ఎఐబిఒఎ, ఐఎన్‌బిఇఎఫ్, ఐఎన్‌బిఒసి, ఎన్ఒబిడబ్ల్యు, ఎన్ఒబిఒ తదతర యూనియన్లు కలిసి యుఎఫ్‌బియుగా ఏర్పడ్డాయని తెలిపారు. ఈ నేపథ్యంలో యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో సంఘటితంగా ఆగస్టు 22న సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ ప్రమోషన్ల కోసమో, జీతభత్యాల పెరుగుదల కోసమో ఈ సమ్మెను నిర్వహించటం లేదని చెప్పారు.

ఎన్‌డిఎ ప్రభుత్వ కుట్రలు

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్మును కాపాడేందుకు, వాటిని పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల పరం చేసేందుకు జరుగుతున్న యత్నాలను తిప్పికొట్టేందుకే ఈ సమ్మెను నిర్వహిస్తున్నామని శర్మ తెలిపారు. దేశ ప్రజానీకంలో దాదాపు 80 శాతం మంది రూ.75 లక్షల కోట్లను ప్రభుత్వరంగంలోని బ్యాంకుల్లో పొదుపు చేసుకున్నారని వివరించారు. ప్రభుత్వ బ్యాంకులపై వారికున్న భరోసా, నమ్మకం, విశ్వాసమే దీనికి కారణమన్నారు. సంస్కరణల పేరుతో బ్యాంకులను ప్రయివేటీకరించటం ద్వారా ఈ సొమ్మును బడా బాబులకు అప్పగించేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు రుణాలను తీసుకుని ఎగ్గొడితే సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. గతంలో ఇదే పద్ధతిలో గ్లోబల్ ట్రస్టు బ్యాంకు ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టిందని గుర్తుచేశారు. విలేకరుల సమావేశంలో సుబ్రమణ్యం, హర్షవర్ధనన్ (ఎఐబిఒసి), రాధాకృష్ణన్ (ఎన్‌సిబిఇ), గిరి (ఎఐబిఒఎ), శ్రీనివాస్ (బెఫి) తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన డిమాండ్లు..

కార్పొరేట్ల మొండి బాకీలు, ఇతర రుణాలన్నింటినీ వసూలు చేసేందుకు వీలుగా బ్యాంకుల్లో ప్రమాణాలను మెరుగుపరచాలి. ఎఫ్ఆర్‌డిఐ బిల్లు ప్రతిపాదనలను విరమించుకోవాలి. బ్యాంకు బోర్డు బ్యూరోను ఎత్తేయాలి. బ్యాంకుల్లో చాలినంత సిబ్బందిని, ఉద్యోగులను నియమించాలి. ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించిన ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలి. సమ్మెలో ఎఐబిఇఎ, బెఫి, ఎఐబిఒసి, ఎన్‌సిబిఇ, ఎఐబిఒఎ, ఐఎన్‌బిఇఎఫ్, ఐఎన్‌బిఒసి, ఎన్ఒబిడబ్ల్యు, ఎన్ఒబిఒ.

సర్వత్రా ఆగ్రహం

బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. బడా కార్పొరేట్ సంస్థల బకాయిలను వారి ఆస్తుల్ని వేలం వేసి బ్యాంకులకు జమ చేయాలని బ్యాంకుల ఉద్యోగులు కోరుతున్నారు. ఎన్‌పిఏల వసూళ్లకు పార్లమెంటరీ కమిటీ అనేక సిఫార్సులు చేసింది. వాటిని అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకోవాలని, బ్యాంకు బ్యూరో బోర్డును రద్దు చేయాలని, అన్ని క్యాడర్లలో ఉద్యోగుల్ని భర్తీ చేయాలని కోరుతూ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు రూ.10 లక్షల గ్రాట్యుటీని రూ.20 లక్షలకు పెంచాలని, ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై వసూలు చేస్తున్న ఇన్‌కంట్యాక్స్‌ను మినహాయించాలని కోరుతున్నారు.

ఈనెల 22న సమ్మెలో భాగంగా విజయవాడ గాంధీనగర్ ఎస్‌బిఐ ముందు నిరసన కార్యక్రమం ఉంటుందని బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకులు అజయ్‌కుమార్ ప్రకటించారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు ఎస్‌డబ్ల్యూఎఫ్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్పొరేట్ రుణాలను మాఫీ చేయొద్దని కోరుతూ మంగళవారం బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సొమ్మును ఎగ్గొట్టిన వాళ్లకు అధికారంలో ఉన్న కుహానా దేశ భక్తులు వంత పాడటంతోనే సిబ్బంది ఈ సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

ఉంచామని చెప్పారు. ఎన్నికల్ని ప్రభావితం చేసే విధంగాకానీ, ఓటర్లను ప్రలోభపెట్టే విధంగాకానీ ఎలాంటి ప్రీ-పోల్ సర్వేలను ప్రసారం చేయకూడదని అన్నారు. బల్క్ ఎస్ఎంఎస్‌లను నిషేధించామని, సోషల్ మీడియాపైనా నిఘా ఉంచామని చెప్పారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు వైన్స్‌షాపులు తెరవడానికి వీల్లేదంటూ ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందు కుగాను 6 కంపెనీల కేంద్ర బలగాలను, మరో 8 కంపెనీల ఏపీఎస్పీ బలగాలను రప్పించామన్నారు. అలాగే నగదు, మద్యం పంపిణీలతో పాటు ఇతరత్రా ఓటర్లను ప్రభావితం చేయకుండా ఉండేందుకు నంద్యాల పట్టణంతో పాటు గ్రామాల్లో 173 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 32 చెక్‌పోస్టులు, 57 మోడల్ కోడ్ టీమ్‌లను నియమించామన్నారు. ఇప్పటి వరకు 1121 లైసెన్స్‌డ్ ఆయుధాల్ని సీజ్ చేశామని, 347 కేసులు నమోదు చేశామని తెలిపారు. రూ.1.16 కోట్లు నగదును, 2,253 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని చెప్పారు. వీటికి సంబంధించి ఇప్పటి వరకు 308 కేసుల్ని నమోదు చేయగా, 263 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భన్వర్‌లాల్ సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, టాయిలెట్లు ఏర్పాటు చేశామన్నారు. వికలాంగ ఓటర్ల కోసం వీల్‌చైర్‌లతో పాటు సహాయకుల్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. అలాగే అంధ ఓటర్లు బ్రెయిలీ లిపిలో ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలతో పాటు వీడియోగ్రఫీని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి వెబ్ లైవ్ టెలికాస్టింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలలోపు క్యూలైన్‌లో ఉన్న వారందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన ఓటర్ల జాబితా ప్రకారం పోలింగ్ నిర్వహిస్తామని, ఇప్పటికే అన్ని పార్టీలకు జాబితాల్ని అందించామన్నారు.

వివి పాట్‌లపై అపోహలొద్దు

వివిపాట్ (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రైల్) అమలుపై ఎలాంటి అపోహలు అవసరం లేదని భన్వర్‌లాల్ తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలించాకే అనుమతించామన్నారు. కేవలం ఓటర్లు మాత్రమే తాము ఎవరికి ఓటు వేశామో తెలుసుకునే అవకాశముంటుందన్నారు. ఓటు వేశాక కేవలం 7 సెకన్ల పాటు డిస్‌ప్లే అవుతుందని, ఆ పేపర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లో పడిపోతుందని వివరించారు. బాక్స్‌లో పడిన పేపర్‌పై ఎలాంటి పేర్లుండవని, కేవలం గుర్తులు మాత్రమే ఉంటాయని, దీని వల్ల ఎవరు ఎవరికి ఓటు వేశారో చెప్పడం కష్టమని పేర్కొన్నారు. అన్ని రకాలుగా ప్రయోగించి, పరిశీలించాకే వివి పాట్‌లను వినియోగించడానికి ఎన్నికల సంఘం అనుమతిచ్చిందని స్పష్టం చేశారు.

ప్రచారపర్వం ముగిసింది

మొదటి పేజీ తరువాయి

విషయాలను ఆ పార్టీ ఎన్నికల సంఘం దృష్టికి తీసుకుపోయినట్లు సమాచారం. ప్రచార పర్వం ముగియడంతో రెండు పార్టీల నేతలు చివరి ప్రయత్నాల్లో మునిగిపోయారు. అధికారికంగా ప్రచారం ముగిసినప్పటికీ అనధికారికంగా నియోజకవర్గం అంతా కొనసాగుతూనే ఉంది. ౦ండు పార్టీలకు చెందిన స్థానిక నేతలు, కార్యకర్తలు ఓటర్లను కలుసుకుంటున్నారు. పోటాపోటీగా నగదు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెండు పార్టీలు ప్రత్యర్థి పార్టీ శ్రేణుల కదలికలపై పెద్ద ఎత్తున నిఘా ఉంచాయి. కొందరు కార్య కర్తలను ఈ పనిమీదే ఉంచాయి. దీంతో నియోజకవర్గమంతా ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

బరిలో 15మంది

భూమా నాగిరెడ్డి మృతితో ఖాళీ అయిన నంద్యాల అసెంబ్లీ నియోజికవర్గం పరిధిలో మొత్తం 15మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అధికార పార్టీ తెలుగుదేశం నుంచి భూమా బ్రహ్మనందారెడ్డి పోటీలో ఉన్నారు. ప్రతిపక్ష వైకాపానుంచి శిల్పామోహన్‌రెడ్డి బరిలో ఉన్నారు. వీరిద్దరు మధ్య నువ్వానేనా అన్న రీతిలో పోటీ జరుగుతున్నా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం అబ్దుల్‌ఖాదర్ కూడా పెద్ద ఎత్తున నంద్యాలలో ప్రచారాన్ని నిర్వహించడంతో కాంగ్రెస్ అభ్యర్థి పోల్ అయ్యే ఓట్లు ఎవ్వరికి నష్టం చేకూరుస్తాయనేది చర్చానీయాంశంగా మారింది బిసి యూనైటెడ్‌ఫ్రంట్ తరుపున జి అబ్దుల్ సత్తారా, రాయలసీమ పరిరక్షణ సమితి తరుపున బవనాసి పుల్లయ్య, సమాజ్‌వాదీపార్టీ తరుపున కె రాఘవేంద్ర, నవతరం పార్టీ తరుపున అర్.సుబ్రహ్మణ్యం, రాజ్యాధికార పార్టీ తరుపున వి. రెడ్డప్ప, అన్న వైఎస్అర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎస్.మహబూబ్ భాష, స్వతంత్ర అభ్యర్థులు ఎల్.ఖాంతారెడ్డి, పి.గురువయ్య, బి నర్సింహులు మాదిగ, బాలసుబ్బయ్య, ఎం.నాగనవీన్, ఎస్.రఘునాథ్‌రెడ్డిలు బరిలో ఉన్నారు.

ఉదయం ఏడు గంటల నుండే పోలింగ్

ఉప ఎన్నికల పోలింగ్ ఉదయం ఏడు గంటలనుంచి సాయంత్రం ఆరుగంటల వరకు జరిగేలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.సత్యనారాయణ వెల్లడించారు. నంద్యాల నియోజికవర్గంలో మొత్తం 2,19,108 మంది ఓటర్లుంటే అందులో మహిళలు 1,11,018 కాగా, పురుషులు 1,07,778మంది ఉంటే ఇతరులు 68 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లుగా 255 మంది దరాఖాస్తు చేసుకున్నారు. మొత్తం నంద్యాల ఉప ఎన్నికలు 255 పోలింగ్ కేంద్రాల్లో జరగనున్నాయి. ఇందులో 141 పోలింగ్ కేంద్రాలు అత్యంత సమస్యాత్మకంగా గుర్తించగా 74 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. ప్రశాంతంగా జరిగే పోలింగ్‌కేంద్రాలు కేవలం 40 కేంద్రాలున్నాయన్నారు. దీంతో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 82 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌లు, ఆరు కంపెనీల పారామిలీటరి బలగాలు, ఎపిఎస్పి బెటాలియన్ పోలీసు లను ఏర్పాటు చేశామన్నారు, అన్ని పోలింగ్‌కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ద్వారా చిత్రీకరించడం జరుగుతుందన్నారు. ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాత పరిశీలించేందుకు గాను వివిపిఎటి యంత్రాలను కూడా అమర్చామన్నారు. ఈ యంత్రాన్ని బ్యాలెట్ యూనిట్ వద్ద పెట్టి వెసలుబాటు కల్పించామన్నారు. నంద్యాలలో నాలుగు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కల్పించామన్నారు.

రాజమౌళి అతిథి


చిరంజీవి

చిరంజీవి రీఎంట్రీ గ్రాండ్‌గా చేశారు. ఇప్పుడు ఆయన రెండో చిత్రం చేస్తున్నాడు. అదే 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి'. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం విడుదల చేయనున్నారు. జన్మదినోత్స వేడుక కూడా భారీ స్థాయిలోనే చేసేందుకు సన్నాహాలుచేస్తున్నారు. ఈ 151వ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఉదయం 9.30 గంటలకు ఈ వేడుక ఆరంభం కానుంది. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్ దీనికి వేదిక కానుందని చిత్ర బృందం తెలిపింది.

స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్ కంపెనీ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. కథానాయిక ఎవరు అన్నది ఇంకా స్పష్టత ఇవ్వలేదు. నయన తార పేరు మాత్రం వినిపిస్తుంది.



కట్టు..బొట్టు నయనానందం


నయన తార

నయన తార, బాలకృష్ణ కాంబినేషన్‌లో 'సింహ', 'శ్రీరామ రాజ్యం' వచ్చాయి. అవి విజయం సాధించాయి. ఇప్పుడు మరో సినిమా రాబోతుంది. ఆ చిత్రం బాలయ్య 102వ సినిమా. ఇందులో నయన తార కథానాయిక. కె.ఎస్. రవి కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఇటీవలే ప్రారంభమైంది. సోమవారం నుంచి షూటింగ్‌లో నయనతార పాల్గొంటున్నారు. సెట్స్ ఆమెతో దిగిన సెల్ఫీని డిజైనర్ కోనా నీరజ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'బ్యూటీ నయనతారతో కొత్త ప్రయాణం' అని పోస్ట్ చేశారు. ఈ ఫొటోలో నయనతార చీరకట్టు, పెద్ద బొట్టుతో సంప్రదాయబద్ధంగా కన్పించారు. ఈ చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరగుతోంది. బ్రహ్మానందం, ప్రకాష్ రాజ్, అశు తోష్ రాణా, మురళీమోహన్, బాహుబలి ప్రభాకర్, శివపార్వతి తదితరులు ఇతరముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ భారీ చిత్రానికి కథ-మాటలు : ఎం.రత్నం, యాక్షన్ : అంబరీవ్, కెమెరా : సి.రాంప్రసాద్, సంగీతం : చిరంతన్ భట్, నిర్మాత: సి.కళ్యాణ్.

అలా అయితే సల్మాన్‌తో చేయడానికి రెడీ!


ఐశ్వర్యరాయ్

ఐశ్వర్యరాయ్, సల్మాన్ ఖాన్ ఒకప్పుడు లవర్స్. హిట్ ఫెయిర్ కూడా. ఈ మాజీ లవర్స్ మళ్లీ జంటగా ఓ సినిమా చేయడానికి దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఓ కథను సిద్ధం చేశాడు. ఆ స్క్రిప్ట్‌ను ఐశ్వర్యరాయ్‌కు, సల్మాన్ ఖాన్‌కు వివరించాడు. సల్మాన్ ఖాన్ చేయడానికి అంగీకరించాడు. ఐశ్వర్యరాయ్ కూడా కథ చాలా బాగుందని తప్పకుండా చేద్దామని వెంటనే ఒకే చెప్పాసింది. ఐతే చివరిలో ఓ షరత్తు పెట్టింది. సల్మాన్ ఖాన్ అల్లావుద్దీన్ ఖిల్జీగా చేస్తేనే తాను నటించేందుకు అంగీకరిస్తానని పేర్కొందట. ఈ విషయాన్ని సల్మాన్ ఖాన్ వద్ద దర్శకుడు సంజయ్ లీలా ఉంచితే ఆ సినిమాలో తాను చేయడానికి ఇష్టం లేదని ఖరాకండీగా చెప్పేశాడట. ఈ విషయాన్ని సంజయ్ లీలా ఇటీవల వెల్లడించారు. ఇంతకీ విషయం ఏమిటంటే... సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తోన్న 'పద్మావతి' చిత్రం కోసం మొదట ఐశ్వర్యరాయ్, సల్మాన్ ఖాన్‌లను సంప్రదించాడట. అప్పుడు ఇద్దరు సుముఖంగానే ఉన్నా, తర్వాత ఐశ్వర్యరాయ్ కండీషన్‌తో సల్మాన్ కూడా నటించబోనని తెగేసి చెప్పేశాడు. ఈ కథలో చిత్తూరు కోటకు రాణి 'పద్మావతి'. ఆమె భర్త రానా రావల్ రతన్ సింగ్. రాజ్యం ఆక్రమణలో భాగంగా అల్లావుద్దీన్ ఖిల్జీ ఆ కోటపై దాడిచేస్తాడు. అంటే అల్లావుద్దీన్ ఖిల్జీది ప్రతినాయుకుడి పాత్ర..ఇందులో పద్మావతికి, అల్లావుద్దీన్ ఖిల్జీకి మాటలు కూడా ఉండవు. అందుకే ఆ షరత్తును పెట్టింది ఐషూ. వీరొద్దాన్నక దీపికా పదుకొనేను, రణవీర్ సింగ్‌ను సంప్రదించారు భన్సాల్. వీరు అంగీకరించడంతో కథ సెట్స్‌కి వెళ్లింది. పద్మావతిగా దీపికా, అల్లావుద్దీన్ ఖిల్జీగా రణవీర్ సింగ్ చేస్తున్నారు. రానా రావల్ రతన్ సింగ్‌గా సాహిద్ కపూర్ చేస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 27వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.

తేజ హీరోగా చిత్రం



'చూడాలని ఉంది', 'ఇంద్ర', 'యువరాజు'తో పాటుగా దాదాపు 50 సినిమాల్లో బాలనటుడిగా తెరపై కనువిందు చేసిన తేజ ప్రస్తుతం కథానాయకుడిగా మారారు. ఈ చిత్రాన్ని బెక్కెం వేణుగోపాల్ (గోపి) నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి సంస్థలో దర్శకత్వ విభాగంలో దాదాపు ఎనిమిదేళ్లు పనిచేసిన హరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాత గోపి మాట్లాడుతూ 'కథ చక్కగా కుదిరింది. గ్రామీణ నేపథ్యంలో జరిగే యూత్‌ఫుల్ లవ్ స్టోరీ ఇది. కుటుంబ సమేతంగా చూసేలా ఉంటుంది. సెప్టెంబర్ 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. 'ఉయ్యాల జంపాల', 'స్వామిరారా' చిత్రాలకు స్వరాలు సమకూర్చిన సంగీత దర్శకుడు సన్నీ ఎం.ఆర్. మా సినిమాకు బాణీలిస్తున్నారు.

ప్రియాంక వద్దకు డైరెక్టర్స్ క్యూ


ప్రియాంక చోప్రా

ప్రియాంక చోప్రా బాలీవుడ్ నుంచే గ్లోబల్ స్టార్‌గా ఎదిగింది. క్వాంటికో అమెరికన్ టీవీ సిరీస్ ద్వారా హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అక్కడ 'బేవాచ్'లో నటించింది. సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టినా, ప్రియాంక నటనకు ఎక్కడా మార్కులు తగ్గలేదు. దీంతో అక్కడా అవకాశాలు పెరిగాయి. మరో రెండు చిత్రాల్లో చేయబోతుందని సమాచారం. క్వాంటికో టీవీ సిరీస్‌ను ముగించికొని భారత్ వచ్చిన ప్రియాంక ప్రస్తుతం తన కమిట్‌మెంట్స్‌పై దృష్టి సారించింది. మరో పక్క బాలీవుడ్ దర్శకులు ఆమె వద్దకు క్యూ కడుతున్నారు. ఒకటి, రెండు కాదు ప్రియాంక ఏకంగా 25 కథలను విన్నది. స్క్రిప్ట్‌లను నరేట్ చేసిన దర్శకుల్లో 'పింకు' దర్శకుడు అనిరుధ్ రాయ్ చౌదరి, శిమిత్ అమిన్, అలి అబ్బాస్ జాఫర్, కబిన్ ఖాన్, విశాల్ భరద్వాజ్, ధరమ్ ప్రొడక్షన్స్ వారు ఉన్నారు. ప్రియాంక కూడా బాలీవుడ్ తనకు తల్లివంటిదని, మంచి కథలు కుదిరితే ఇక్కడా తప్పకుండా చేస్తానని గతంలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆమె కథలు వింటుంది. విన్న 25 కథల్లో నాలుగు కాస్తా పర్వాలేదు అని అనిపించాయట. వాటిల్లో ఏదొకటి అంగీకరించి అందులో ప్రియాంక నటించనుందని సమాచారం.

ఖాన్‌ల కంటే అక్షయ్ టాలెంటెడ్

-ఆమిర్ ఖాన్



బాలీవుడ్‌లో నాలుగు సినిమాలు విడుదలైతే వాటిల్లో ఖాన్‌ల(సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్, అమిర్ ఖాన్) త్రయం లేని సినిమా ఉండబోదు. ఇప్పటివరకూ అలా జరగలేదు కూడా. బాక్సాఫీస్ వద్ద హిట్ కొట్టేవి కాడా వారి సినిమాలే అని నమ్ముతారు. కానీ ఈ సారి షారుఖ్ ఖాన్ చిత్రం 'జబ్ హ్యారీ మెట్ సెజల్', సల్మాన్ హీరోగా చేసిన 'ట్యూబ్‌లైట్' వరుసగా విడుదలయ్యాయి. వీటి తర్వాత అక్షయ్ కుమార్ చేసిన 'టాయ్‌లెట్ : ఏక్ ప్రేమ్ కథ' ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఖాన్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద కుదేలైతే, అక్షయ్ చిత్రం కాసులు కురిపిస్తోంది. ఎనిమిది రోజుల్లోనే వంద కోట్ల క్లబ్‌కు చేరిపోయింది. ఈ నేపథ్యంలో ఖాన్‌ల త్రయంలో ఒక్కరైన మిస్టర్ పెర్‌ఫెక్ట్ అమిర్ ఖాన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఖాన్‌ల కంటే అక్షయ్ కుమార్ ప్రతిభావం తుడని ప్రశంసించారు. ప్రస్తుతం ఆయన హీరోగా చేస్తున్న సీక్రెట్ సూపర్‌స్టార్' చిత్రంలో ఓ గీతం విడుదల కార్యక్రమంలో పాల్గొన్న అమిర్ మాట్లాడుతూ " ఖాన్‌లు మాత్రమే బాలీవుడ్‌లో స్టార్స్ అని ప్రేక్షకులు భావిస్తారని నేను అనుకోవడం లేదు. బాలీవుడ్‌లో చాలా మంది ప్రతిభావంతులు, ప్రఖ్యాతి గాంచిన నటులు ఉన్నారు. అక్షయ్ చిత్రం 'టాయ్‌లెట్ : ఏక్ ప్రేమ్ కథ'ను ప్రేక్షకులు బాగా ఆదరించారు. అతను ఖాన్ల కంటే ప్రతిభావంతుడే' అని పేర్కొన్నారు. సినిమా కంటెంటా? లేక స్టార్‌ను బట్టా? ప్రేక్షకులు సినిమాలు చూస్తున్నారు? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ " గొప్పగా ఎదిగిన వ్యక్తులు కూడా ఎత్తుపల్లాలను చూసి వచ్చిన వాళ్లే. ప్రేక్షకుల ఆదరించాలని మేం ఎప్పుడూ బాగా పని చేయడానికే ప్రయత్నిస్తాం. కొన్నిసార్లు మేం విజయం సాధించొచ్చు, సాధించలేకపోవచ్చు. ఏదైనా ఆ వ్యక్తి స్టార్‌డమ్‌పై వెంటనే ప్రభావం చూపదని నేను అనుకుంటున్నా' అని చెప్పారు. అమిర్ హీరోగా చేస్తున్న 'సీక్రెట్ సూపర్ స్టార్' చిత్రం అక్టోబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

వెండితెరపై 'నవగ్రహ పురాణం'



తెలుగు సినీ సాహిత్యానికి, తెలుగు కథకు ప్రపంచం పట్టం కడుతోంది. ఒక కథ సినిమాగా రూపుదిద్దుకుని, అది విడుదలయ్యాక దానికి గుర్తింపు రావడం ఒక భాగం, అయితే కథని సినిమా స్క్రిప్ట్‌గా మలిచాక, ఆ స్క్రిప్ట్‌కే అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఫిలిం ఫెస్టివల్‌లో ఏకంగా రెండు కేటగిరీల్లో నామినేషన్ రావడం మరో విశేషం.

అమెరికాలో కొన్ని దశాబ్దాలుగా ఏటా అద్భుతమైన కొత్త స్క్రిప్ట్‌లను కనుగొని, పట్టం కట్టడానికి జరిగే ప్రతిష్టాత్మకమైన న్యూహోప్ ఫిలిం ఫెస్టివల్‌లో వక్కంతం సూర్యనారాయణరావ్ కథ 'నవగ్రహపురాణం'కు బెస్ట్ నెరేటివ్ ఫీచర్ లెంత్ స్క్రీన్‌ప్లే కేటగిరీలోనూ, బెస్ట్ ఫాంటసీ స్క్రీన్‌ప్లే కేటగిరిలోనూ నామినేషన్ దక్కింది. ఆంగ్లంలో కూడా ఈ పుస్తకానికి దేశవ్యాప్తంగా పాఠకుల ఆదరణ లభించడంతో ఈ నవల అమెరికన్ స్క్రీన్‌ప్లే రచయిత్రి పామెల్లా పెర్రీ దృష్టిని ఆకట్టుకుంది. ఆమె నవలను చదివి, రచయిత సూర్యనారాయణతో కలిసి 'లెజెండ్స్ ఆఫ్ డెస్టినీ' అనే పేరుతో చిత్రం తీస్తున్నారు. ఇటీవలే అమెరికాలో జరిగిన న్యూహోప్ ఫిలిం ఫిస్టివల్‌లో లెజెండ్స్ ఆఫ్ డెస్టినీ.. స్క్రీన్‌ప్లేకి రెండు నామినేషన్లు రావడమేకాక, జ్యూరీ మెంబర్ల నుంచి ప్రత్యేక ప్రశంసలు అందుకోవడం విశేషం. రచయిత్రి పామెల్లా మాట్లాడుతూ.. 'స్నేహితురాలు రచయిత్రి ఉమర్జీ అనూరాధ నాకు ఈ నవల ఇచ్చారు. దీన్ని సినిమాగా రాస్తే బాగుంటుందని అన్నారు. నవగ్రహ పురాణాన్ని వెండితెరపై చూడాలన్నది ఆమె కల. ఆమె కలని గౌరవించి నవల చదివాను. పూర్తయ్యేవరకు యూయలేకపోయాను. సూర్యనారాయణ శైలి అద్భుతంగా ఉంది. దీన్ని సినిమాగా మలచడానికి నన్ను నేనే సిద్ధం చేసుకున్నాను. ఇప్పటికే ఈ స్క్రిప్ట్‌ను సినిమాగా నిర్మించడానికి రెండు స్టూడియోలు ఆసక్తిని కనబర్చాయి. సినిమాలో యాభైశాతం సీజీ వర్క్ ఉంటుంది. నవగ్రహాలు విశ్వవ్యాప్తమైన కథాంశం. సినిమా అయితే ప్రేక్షకాదరణ మరింతగా ఉంటుందని నమ్ముతున్నామ'ని తెలిపారు. రచయిత సూర్యనారాయణరావు మాట్లాడుతూ... ఈ నవల అంతర్జాతీయ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరించడానికి సిద్ధంకావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు

పోస్టర్‌పై వీహెచ్‌కు కోపం వచ్చింది

ఈ మధ్య గోవాలో ఓ ఎమ్మెల్యే బాలీవుడ్ నటి సన్నీలియోనీ ప్రకటనలన్నీ నిషేధించాలని, ఇలాంటి పోస్టర్లు విద్యార్థులు ప్రయాణించే బస్సులపై అంటిస్తే వారిపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసిందే. ఇప్పుడు హైదరాబాద్‌లో ఆర్టీసీ బసుపై ముద్దు పెట్టుకుంటున్నట్టు ఉన్న 'అర్జున్ రెడ్డి' సినిమా పోస్టర్‌ను చూసి కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు ఆగ్రహించారు. వెంటనే తొలగించే వరకూ ఊరుకోలేదు. విషయం ఏమిటంటే... ఆదివారం నాంపల్లిలోని గాంధీ భవన్‌లో జరిగిన సమావేశానికి వీహెచ్ హాజరయ్యారు. అనంతరం తిరిగి వెళుతుండగా ఓ ఆర్టీసీ బస్సు మీద నటుడు విజయ్ దేవరకొండ నటించిన 'అర్జున్ రెడ్డి' చిత్రానికి సంబంధించిన ఓ అసభ్యకరమైన పోస్టర్‌ను ఆయన గమనించారు. దాంతో వెంటనే బస్సు ఆపించి కండక్టర్ సాయంతో పోస్టర్‌ను తొలగించేశారు. ఇలాంటివి యువతను తప్పుదోవ పట్టిస్తాయని అన్నారు. డబ్బు కోసం ప్రభుత్వం ఇలాంటి ప్రకటనలకు ఒప్పుకోకూడదని వీహెచ్ పేర్కొన్నారు.


బస్‌పై పోస్టర్ తొలగించేస్తున్న హనుమంతరావు

మూత్రపిండాల వ్యాధులు ఎన్నో జీవితాలను కబళిస్తున్నాయి. కిడ్నీ వ్యాధి చివరిదశకు చేరుకుంటే కొన్ని రోజులు మరణాన్ని వాయిదా వేయడానికి డయాలిసిస్ ఒక్కటే మార్గం. ఈ వ్యాధినుంచి విముక్తులై జీవితకాలాన్ని పొడిగించడానికి మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స చేయించి ప్రాణాన్ని కాపాడొచ్చు. ఈ శస్త్రచికిత్స నిర్వహించాలంటే కిడ్నీ దాత, స్వీకరించే రోగి ఇద్దరి రక్తం ఒకే గ్రూపునకు చెందిఉండాలి. అయితే బ్లడ్ గ్రూపుతో సంబంధం లేకుండా మూత్రపిండాల మార్పిడి చేసే 'ఏబివో ఇన్‌కాంపిటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ' ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనల ఫలితంగా అందుబాటులోకి వచ్చింది. దీంతో ఈ వ్యాధితో రోజులు లెక్కపెట్టుకుంటున్న ఎంతోమందిలో బతుకు ఆశలు చిగురించాయి. ఏఏ సందర్భాల్లో కిడ్నీ మార్పిడి అవసరం? దీని ఫలితాలు ఎలా ఉన్నాయి? తదితర అంశాలు ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'...



కిడ్నీ మార్పిడికి బ్లడ్ గ్రూప్ అడ్డంకి కాదు

మన కళ్లముందే ఎన్నో వేలమంది జీవితాలను మూత్రపిండాల వ్యాధి చిదిమేస్తోంది. శరీరంలోని అవయవాల్లో మూత్రపిండాలు (కిడ్నీలు) ప్రధానమైనవి. ఇవి శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసి, మలిన పదార్థాలను మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. నీటి సమతుల్యతను కాపాడటంతో పాటు రక్తపోటునూ నియంత్రిస్తాయి. ఇవి చెడిపోతే శరీరంలో రక్తశుద్ధి ప్రక్రియ కుంటుపడిపోయి రక్తం కలుషితం అవుతుంది. దాంతో ప్రాణాలకే ప్రమాదం. అలాంటి సమయంలో వ్యాధి చివరిదశకు చేరాక కిడ్నీ మార్పిడి ఒక్కటే శాశ్వత పరిష్కారం. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు నలభైవేల మంది వరకూ చివరి దశలో ఉన్న కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి చివరిదశకు చేరుకున్న తర్వాత హీమో డయాలిసిస్, సీఎపిడి విధానాల వల్ల కొంతకాలం జీవితాన్ని పొడిగించవచ్చు. కానీ ఇది శాశ్వత పరిష్కారమైతే కాదు. కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సతో రోగి మళ్లీ కొత్త జీవితాన్ని కొనసాగించవచ్చు. అయితే కిడ్నీ మార్పిడికి ముందుకు వచ్చే వారి సంఖ్యా తక్కువగానే ఉంది. కొంతమంది కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చినా వారి బ్లడ్ గ్రూపు రోగి బ్లడ్‌గ్రూపునకు సరిపోకపోవడంతో తిరస్కరించిన సందర్భాలు అనేకం. కుటుంబసభ్యుల మధ్య కిడ్నీలు మార్పిడి జరిగినా బ్లడ్‌గ్రూపు మ్యాచ్ కాకపోవడంతో దుష్పరిణామాలు కలిగిన కేసులున్నాయి. కిడ్నీ మార్పిడి చేయించుకున్న రోగుల్లో 30 శాతం ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి. అందువల్ల తుదిదశలో ఉన్న కిడ్నీ రోగుల్లో 95 శాతం మంది డయాలసిస్ పైనే ఆధారపడుతున్నారు. కేవలం ఐదు శాతం మంది మాత్రమే కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారు.

'ఏబిఓ' గ్రూపుల మధ్య తొలగిన అవరోధం

కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌లో బ్లడ్‌గ్రూపు సరిపోకపోవడం వల్ల వచ్చే ప్రతికూలతను 'ఏబిఓ ఇన్‌కాంపిటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ' అధిగమించింది. బ్లడ్ గ్రూపులైన ఏ, బి, ఏబి, ఓల మధ్య అనుసంధానం చేసే విధంగా దీనిని రూపొందించారు. బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ని విజయవంతంగా చేసి, రోగికి కొత్త జీవితాన్ని అందిస్తున్నారు. ఈ అత్యాధునిక వైద్య ప్రక్రియ ద్వారా దాత, స్వీకర్త... ఈ ఇద్దరూ వేర్వేరు బ్లడ్‌గ్రూపులు కలిగి ఉన్నా... కిడ్నీ మార్పిడి చేయడం సాధ్యమే. ఈ ప్రక్రియలో ప్రత్యేకమైన ప్లాస్మాఫెరసిస్ పద్ధతిని అనుసరించి, వేర్వేరు బ్లడ్‌గ్రూపుల్లోని యాంటిజెన్ కలిసేలా చేస్తారు. దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ ఏబీఓ ఇన్‌కంపాటబుల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంలో కిడ్నీ మార్పిడి చేసుకున్న వారూ కంపాటబుల్ కిడ్నీ మార్పిడి మాదిరిగానే మెరుగైన ఫలితాలు పొందుతున్నారు. శస్త్రచికిత్సకు ముందు గ్లైకో ఇమ్యునో అడ్‌జార్షన్ ప్రక్రియ ద్వారా రక్తంలో బీ యాంటీ బాడీస్‌ను తొలగిస్తారు. కొన్ని రోజుల వ్యవధిలో శస్త్రచికిత్స నిర్వహిస్తారు.

కిడ్నీ మార్పిడి ఇలా

రోగి ఆసుపత్రికి చేరిన వెంటనే శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది కనుక ఏ విధమైన ఆహారాన్ని తినకూడదనీ, మంచినీటితో సహా ఏ ద్రవాలనూ తీసుకోకూడదనీ చెబుతారు. చివరిగా ఎప్పుడు డయాలిసిస్ చేశారనే అంశం ఆధారంగా, అవసరమైతే, మరొకసారి డయాలిసిస్ చేస్తారు. మార్పిడి చేయాల్సిన మూత్రపిండాన్ని రోగి శరీరంలో కటి వలయం భాగంలో ఉదరకోశ కండరాల కింద అమరుస్తారు. ఈ భాగంలో ఉన్న రక్తనాళాలకు రోగి శరీరంలో సహజంగా ఉన్న మూత్రపిండాలకు చెందిన ధమనులు, సిరలను కలుపుతారు. తరువాత మూత్రపిండాల నుంచి మూత్రాన్ని మూత్రకోశానికి చేర్చే నాళాన్ని (యురెటర్)ను అమరుస్తారు. మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స పూర్తికావడానికి కనీసం మూడు గంటలు పడుతుంది.

ఆపరేషన్ తర్వాత

మూత్రపిండాల మార్పిడి ఆపరేషన్ తర్వాత తగిన జాగ్రతలు తీసుకోకపోతే రిజెక్షన్ సమస్యలు పెరుగుతాయి. ఎందుకంటే సాధారణంగా శరీరంలోకి బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు ప్రవేశించినప్పుడు శరీరం స్పందించి, వాటిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తుంది. ఒక వ్యక్తి శరీరానికి సంబంధంలేని ఏ పదార్థం శరీరంలోకి ప్రవేశించినా దానిని ఫారెన్‌బాడీ అని వ్యవహరిస్తారు. ఇటువంటి 'వెలుపలినుంచి వచ్చిన ఒక కొత్త అవయవం లేదా కణజాలం (ఫారెన్‌బాడీ) పట్ల కూడా శరీరం స్పందించి, దానిని తిరస్కరిస్తుంది. దీనిని వైద్య పరిభాషలో రిజెక్షన్ అంటారు. మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న ప్రతివారికి ఏదో ఒక స్థాయిలో ఈ రిజెక్షన్ అనుభవమవుతుంటుంది. ఈ రకమైన రిజెక్షన్ సమస్య ఏర్పడిందంటే వారికి అమర్చిన మూత్రపిండమూ పనికి రాకుండా పోతుందని అర్థం కాదు. రిజెక్షన్ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ఎక్యూట్ రిజెక్షన్, రెండోది క్రానిక్ రిజెక్షన్.



ఎక్యూట్ రిజెక్షన్

మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స తర్వాత సర్వసాధారణంగా ఎదురయ్యే సమస్య ఎక్యూట్ రిజెక్షన్. కొన్ని సందర్భాల్లో దీనిని నిర్ధారించడం కష్టమవుతుంది. సరైన చికిత్సతో ఎక్యూట్ రిజెక్షన్‌ను సరిచేయడానికి అవకాశం ఉంది. దీని లక్షణాలు బహిర్గతం కావడానికి ముందే వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా ఎక్యూట్ రిజెక్షన్‌ను కనుగొనవచ్చు. ఈ సమస్యకు గురైన రోగులకు జ్వరం రావడం, శరీరమంతా నొప్పులు, అకస్మాత్తుగా బరువు పెరగడం, మూత్ర పరిమాణం తగ్గిపోవడం, మూత్రపిండం అమర్చిన భాగంలో నొప్పి, మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఎలాంటి లక్షణాలూ లేకుండా ఈ సమస్య రావొచ్చు.

మూత్రపిండాల మార్పిడి తరువాత మొదటి మూడు నెలల్లో ఎక్యూట్ రిజెక్షన్ అనేది సాధారణంగా కనిపించే సమస్య. అయినప్పటికీ కొంతమందిలో ఇది కొన్ని నెలల తరువాత కానీ, లేదా కొన్ని సంవత్సరాల తరువాత కానీ కనిపించవచ్చు. కొన్ని మందులను నిరంతరం తీసుకోవడం ద్వారా ఈ సమస్యను నివారించవచ్చు. ఎక్యూట్ రిజెక్షన్‌కు గురైన రోగులు ఇంటి వద్దనే ఉంటూ.. వైద్యుడి వద్దకు వెళ్లి, చికిత్స తీసుకుంటూ ఉంటే సరిపోతుంది. అయితే కొన్ని సందర్భాల్లో మాత్రం రోగి ఆసుపత్రిలో చేరాల్సి ఉంటుంది.

క్రానిక్ రిజెక్షన్

మూత్రపిండాల మార్పిడి శస్త్ర చికిత్స తరువాత రోగి పూర్తిగా కోలుకోవడమనేది చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా రిజెక్షన్ స్థాయి, మూత్ర పిండాలు ఎంత త్వరగా పనిచేస్తాయి, యాంటి రిజెక్షన్ మందులకు రోగి ఎలా ప్రతిస్పందిస్తున్నాడు, ఏ ఆపరేషన్ తరువాత అయినా ఎదురయ్యే సమస్యలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం కావడమనేది మూత్రపిండాన్ని అందించిన దాత మీద ఆధారపడి ఉంటుంది. మృతదేహం నుంచి సేకరించారా? రక్త సంబంధీకుల నుంచి సేకరించారా? అనే అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. మూత్రపిండాల శస్త్రచికిత్స చేయించుకున్న పలువురు రోగులు కొంతకాలం తర్వాత రెండవ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం వైద్యుల వద్దకు వస్తుంటారు. శస్త్ర చికిత్స తరువాత మూత్రపిండం ఎన్నాళ్లు పనిచేస్తుందనే అంశం రోగుల వ్యక్తిగత శారీరక స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది. దాతనుంచి సేకరించి అమర్చిన మూత్ర పిండాన్ని శరీరం తొలి నెలల్లోనే తిరస్కరిస్తే మరొకసారి శస్త్రచికిత్స చేసి ఆ మూత్రపిండాన్ని తొలగించాల్సి ఉంటుంది. తరువాత రోగి మళ్లీ డయాలిసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. అనంతరం మరొక మూత్రపిండం లభ్యమైన తరువాత మళ్లీ శస్త్ర చికిత్స చేసి దానిని అమర్చాల్సి ఉంటుంది. నూతనంగా అమర్చిన మూత్రపిండాన్ని శరీరం దీర్ఘకాలం తరువాత తిరస్కరిస్తే, ఆ మూత్రపిండాన్ని శరీరంనుంచి తొలగించాల్సిన అవసరం ఉండదు. కానీ కొన్ని ప్రత్యేక మందులను ఉపయోగించాలి. వీటిని ఇమ్యునో సప్రెసెంట్స్ అని వ్యవహరిస్తారు. ఈ మందులను మూత్రపిండం పని చేసినన్నాళ్లూ వాడుతూనే ఉండాలి. కొత్తగా అమర్చిన మూత్రపిండం (ఫారెన్‌బాడీ) పై శరీర రక్షణ వ్యవస్థ దాడి జరుపకుండా చూడటం కోసం ఈ మందులు వాడాలి. ప్రిడ్నిసోన్, అజాథియో ప్రిన్, సైక్లోస్పోరిన్, ఎఫ్‌కె506, యాంటిలింఫో సైట్ గ్లోబులిన్, ఒకెటి3 ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇమ్యునో సప్రెసెంట్ మందులు. ఈ ఇమ్యునో సప్రెసెంట్స్ ద్వారా కొన్ని దుష్ప్రభావాలు ఎదురవుతాయి. వీటిలో ప్రధానంగా చెప్పుకోవలసింది ఇన్‌ఫెక్షన్ గురించి. రోగికి కొత్తగా అమర్చిన మూత్రపిండాన్ని కాపాడటం కోసం శరీరంలోని వ్యాధి నిరోధకశక్తిలో మార్పులు తీసుకురావడమే కాకుండా, సూక్ష్మక్రిములపట్ల వ్యాధినిరోధక శక్తి స్పందనలో కూడా మార్పులు తీసుకొస్తుంది. ఈ కారణంగా మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న వ్యక్తి పలు ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే అవకాశాలున్నాయి. కొన్నిసార్లు ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన ఇన్‌ఫెక్షన్లు కూడా సోకే అవకాశాలున్నాయి. ఈ ఇన్‌ఫెక్షన్ల వల్ల చలి, జ్వరం, శరీరంపై కమిలినట్లు కనిపించడం, వాపు, దగ్గు మొదలైన లక్షణాలు కనిపించవచ్చు. ఈ లక్షణాలలో ఏవైనా కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇమ్యునో సప్రెసెంట్లుగా వాడే ఏ ఔషధం వల్లనైనా ఇటువంటి సమస్యలు ఎదురుకావచ్చు. ప్రిడ్నిసోన్‌కు సంబంధించినంత వరకూ దాని ప్రభావం మందు మోతాదుపై ఆధారపడి ఉంటుంది. రోగి శరీరంలో అమర్చిన మూత్రపిండం పనిచేస్తున్నంత కాలం ఈ మోతాదును వాడుతూ ఉండాలి. ఒకవేళ మూత్రపిండం తిరస్కరణకు గురైతే, మోతాదును పెంచాల్సి ఉంటుంది.

ప్రిడ్నిసోన్ మోతాదును పెంచడం వలన రోగికి కొన్ని సమస్యలు ఎదురవుతాయి. వాటిలో ప్రధానమైనవి. శరీరంలో లవణం పేరుకుపోయి, ద్రవ పదార్థాలు వెలుపలికి పోకుండా అక్కడే నిలిచి పోవడం. ఆహారనాళం, జీర్ణాశయాలు రేగినట్లు కావడం. ఫలితంగా గుండెల్లో మంట. కీళ్ల నొప్పులు, గాయాలు మానడానికి ఎక్కువ కాలం పట్టడం. చెక్కిళ్లు, కడుపు, నడుము భాగాల్లో కొవ్వు తిరిగి పేరుకోవడం, మధుమేహం, కేటరాక్ట్, అధిక రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావడం మొదలైనవి. ఈ దుష్ప్రభావాలను మందు మోతాదును సరిచేయడం ద్వారా నివారించవచ్చు.






డాక్టర్ జి. శ్రీధర్
ఎం.డి., డి.ఎమ్(నెఫ్రో) సీనియర్ నెఫ్రాలజిస్ట్
అవేర్ గ్లెనేజెల్స్ గ్లోబల్ హాస్పిటల్స్
హైదరాబాద్



కిడ్నీ దానం సురక్షితమే

కిడ్నీ దానం హానికరం కానేకాదు. ఒక కిడ్నీ పాడైనప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరో కిడ్నీతో కూడా జీవిత కాలాన్ని హాయిగా కొనసాగించవచ్చు. దైనందిన జీవితానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. యథావిధిగా ఉద్యోగాలు చేసుకోవచ్చు. డ్రైవింగ్, వ్యాయామంతో పాటు ఆటల పోటీల్లోనూ పాల్గొనవచ్చు. మిలిటరీ ఉద్యోగాలూ నిరభ్యంతరంగా కొనసాగించుకోవచ్చు. కిడ్నీ దానం చేసే దాతకు భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలూ ఉండవు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీకి అత్యాధునికమైన 'ల్యాపరోస్కోపిక్' వైద్య విధానం అవలంబిస్తారు. ఒక కిడ్నీ దానం చేయడం వల్ల దాతకు ఎలాంటి నష్టం లేదని నిర్ధారణ చేసిన తర్వాతనే కిడ్నీ మార్పిడి చేస్తారు.




పొడుపు కథ

ఒకటే తొట్టి
రెండు పిల్లలు.

జోక్ :


రాజు : బాలూ..! బబ్లూ చేతిపైన దోమ కుడుతోంది చూడు
బాలు : ష్..! సౌండ్ చేయకు.. అది వాడి పెంపుడు దోమ రక్తం ఎక్కిస్తోంది..!
రాజు : ఆ..!!??





గడులు నింపండి!

పిల్లలూ..! పైచిత్రంలో కింద ఇచ్చిన పదాల ఆధారంగా నంబర్లున్న గడులలో వాటి పేర్లతో నింపండి!



జీవితకథ, ఆత్మకథల మధ్య తేడా ఏమిటి?

జీవిత కథలూ, ఆత్మకథలూ మహనీయుల గొప్పతనం గురించే కాదు, మనం ఎలా ఉండాలో కూడా చెబుతాయి. నిజానికి, వేయి కథా సంకలనాలకు మించిన సత్యాలు ఒక్క ఆత్మకథ చెబుతుంది. కథల్లో కల్పన ఎక్కువ. ఆత్మకథల్లో కల్పన ఉండదు. ఉన్నదంతా వాస్తవికతే. నిజజీవితంలోని చర్యలు ఆచరణ యోగ్యంగా ఉంటాయి. కొంత శ్రమ ఉన్నా, ఆ మార్గంలో నడవడం సుసాధ్యంగానే ఉంటుంది. అందుకే పిల్లలూ మీరు వాటిపట్ల ఆసక్తిని పెంచుకోవాలి.

జీవితకథలు అనగానే అన్నీ వందల పేజీలు ఉంటాయనేమీ కాదు. అసలు పుస్తకాలు పెద్దగానే ఉన్నా, వాటి సంక్షిప్త రచనలు కూడా ఉంటాయి. వాటిలో కొన్ని 25 పేజీలు, 50 పేజీలలోపే ఉంటాయి. ముందు వాటిని చదవడం పట్ల ఆసక్తి పెరిగితే ఆ తర్వాత రోజుల్లో సమగ్ర గ్రంథాల్ని కూడా చదువుతారు. వ్యక్తులు ఎవరైనా కావచ్చు. జీవిత కథలూ, ఆత్మకథలూ చదవడం వల్ల మౌలికంగా మనిషి గురించి తెలుస్తుంది. మానవ జీవితంలోని ఒడిదొడుకులు తెలుస్తాయి. జీవితంలోని సుఖసంతోషాలే కాదు, కష్టాలూ, జీవిత పోరాటాలూ తెలుస్తాయి. వీటి గురించిన అవగాహన వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆత్మశక్తి పెరుగుతుంది. వీటితో పాటు మనిషి పరిమితులు తెలుస్తాయి. మనిషికున్న విస్తృత అవకాశాలూ తెలుస్తాయి. అందుకే జీవిత కథలూ, ఆత్మకథలూ చదవడం పిల్లల జీవితంలో ఒక ప్రధాన భాగమయ్యేలా తల్లిదండ్రులు చూడాల్సిన బాధ్యత ఉంది. ★





అలవోకగా రెండో రౌండ్‌కు..

ప్రపంచ బ్యాడ్మింటన్‌లో శ్రీకాంత్, సమీర్ విజయ పరంపర

గ్లాస్గో(స్కాట్లాండ్): భారత యువ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అలవోక విజయంతో ముందంజ చేశాడు. సోమవారం నాటి తొలి రౌండ్ పోరులో రష్యన్ షట్లర్ సెర్గీ సిరంత్‌పై 21-13,21-12తో విజయ దుందుభి మోగించాడు. తొలి సెట్‌లో శ్రీకాంత్, కొన్ని తప్పిదాల వలన పాయింట్లను కోల్పోయినప్పటికీ స్మాష్ షాట్‌లతో ప్రత్యర్థిపై 11-6తో ముందంజ వేశాడు. ఆ తర్వాత విశ్రాంతి అనంతరం రెట్టించిన ఉత్సాహంతో కిడాంబి సిరంత్‌పై 15-7తో ఆధిక్యంలో దూసుకెళ్లాడు.రెండో సెట్లో శ్రీకాంత్ రాలీలతో ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించాడు. 11-5తో ముందంజ వేసిన శ్రీకాంత్ వరుసగా ఎనిమిది పాయింట్లతో జయభేరి మోగించాడు. ఈ ఎనిమిదో టాప్ సీడ్ ఇటీవల కాలంలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా ఓపెన్ సిరీస్‌ల్లో విజయం సాధించి సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. తొలి రౌండ్ పోరులో కేవలం 30 నిమిషాల్లోను కిడాంబి మ్యాచ్‌ను ముగించడం గమనార్హం. రెండో రౌండ్ పోరులో శ్రీకాంత్ మంగళవారం ఫ్రాన్స్‌కు చెందిన లూకాస్ కార్వేతో తలపడనున్నాడు. రెండో మ్యాచ్‌లో సమీర్ వర్మ పాబ్లో ఎబెయిన్(స్పెయిన్)పై 21-8తో తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో సెట్లో 17-4తో ముందజంలో ఉన్న దశలో ప్రత్యర్థి పాబ్లో గాయం కారణంగా మ్యాచ్ నుంచి విరమించుకున్నాడు. దీంతో సమీర్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో మను అత్రి- సుమిత్ రెడ్డి జంట చంగ్ సియిక్- కిమ్ డుక్యుయింగ్(కొరియా) చేతిలో 20-22, 11-21తో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రజాంకట్ సాంత్వ- యోగింద్ర కృష్ణన్ జంట పోరాడి మలేషియా ఆటగాళ్ల చేతిలో ఓడారు.



ఆసియాకప్ హాకీలో భారత్- పాక్ ఒకే గ్రూప్

అక్టోబర్ 11-22 మధ్య ఢాకాలో టోర్నీ

న్యూఢిల్లీ: భారత్‌లోని ఒడిషా ఆతిథ్యం ఇచ్చే ప్రపంచ హాకీ లీగ్ -2018 టోర్నీకి పాకిస్తాన్ అర్హత సాధించేందుకు మరో ఛాన్స్ వచ్చింది. ఢాకాలో అక్టోబర్ 11-22 మధ్య జరిగే ఆసియా కప్ హాకీలో టైటిల్ సాధిస్తే నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది. ఇదిలా ఉండగా ఈ టోర్నీలో ఎనిమిది జట్లు తలపడనున్నాయి. గ్రూప్ ఎలో భారత్- పాకిస్తాన్, బంగ్లాదేశ్, జపాన్, గ్రూప్-బిలో దక్షిణ కొరియా, మలేసియా, చైనా, ఒమన్‌లున్నాయి. గ్రూప్-ఎలో భారత్-పాకిస్తాన్ ఉండటంతో పలు మళ్లీ ఉత్కంఠ భరిత మ్యాచ్‌లను హాకీ అభిమానులు వీక్షించే అవకాశం ఉంది. ఈ పదో టైటిల్ వేటలో భారత్ టాప్ ర్యాంకులో ఉండటం విశేషం. 1982లో ప్రారంభించిన తొలి టోర్నీని పాక్ కైవసం చేసుకుంది. ఆ తర్వాత 1985, 1989లో టైటిళ్లను జమ చేసుకుంది. భారత్ 2003, 2007ల్లో ఈ టైటిల్ సాధించింది. ఆసియా కప్ తొలి మ్యాచ్‌ను భారత్ అక్టోబర్ 11న జపాన్‌తో ఆడనుంది. పాక్‌తో అక్టోబర్ 15న రెండో మ్యాచ్‌లో టీమిండియా పోరు సాగించనుంది.

ప్రపంచ కప్ టి 20పైనే దృష్టి

భారత మహిళా కెప్టెన్ మిథాలీ




హైదరాబాద్: 2018లో జరిగే ప్రపంచ కప్ టి 20 టోర్నీపైనే మరింత ఫోకస్ పెట్టనున్నట్లు భారత మహిళా జట్టు సారథి మిథాలీ రాజ్ తెల్పింది. ఐసిసి ప్రపంచకప్ టోర్నీలో రన్నరప్‌ను సాధించిన టీమిండియా టాప్-2 ర్యాంకుకు చేరుకుంది. వచ్చే ఏడాది జరిగే ఈ టోర్నీకి ముందే పూర్తి స్థాయిలో సన్నద్ధం అయ్యేలా కృషి చేయనున్నట్లు వివరించింది. రానున్న రోజులో భారత జట్టుపై అంచనాలు మరింత భారీగా ఉంటాయని, దానికి తగ్గట్టుగా అమ్మాయిలు కూడా రాణించాల్సి ఉందన్నారు. ప్రపంచకప్‌లో అమ్మాయిల రాణింపు భావితరాలకు కొండంత ధైర్యాన్నిచ్చిందని, రానున్న కాలంలో ఫిటెనెస్ సాధించడం ద్వారా జట్టులో నిలదొక్కుకునేందుకు ప్రణాళిక రచించినట్లు తెలిపింది.


వరల్డ్ రెజ్లింగ్‌లో భారత్‌కు నిరాశ

తొలి రౌండ్‌లోనే నలుగురు నిష్క్రమణ

పారిస్: ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి రోజే నిరాశ ఎదురైంది. గ్రీకో-రోమన్ రెజ్లర్లు నలుగురు తొలి రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టారు. సోమవారం నాటి తొలిపోరులో 71 కిలోల విభాగంలో యోగేష్ తాకేష్ ఇంజుమి చేతిలో పోరాడి 1-3తో పరాజయం చెందాడు. 75 కిలోల విభాగంలో గురుప్రీత్ సింగ్ మిందియా సులుకిడ్జె చేతిలో 1-5తోను, 85 కిలోల విభాగంలో రవీందర్ ఖత్రి హంగరీ రెజ్లర్ విక్టర్ లోర్నికా చేతిలో 0-8, హర్‌దీప్ లిథునియా రెజ్లర్ లారునియాటిస్ చేతిలో 2-5తొ పరాజయం పాలయ్యారు. కనీసం ఒక్కరైనా ఫైనల్ రౌండ్‌కు చేరి ఉంటే రీపిచేజ్ రౌండ్‌లో కాంస్యం అయినా దక్కేది.


హరిందర్ సింగ్

త్రిపురలో ప్రపంచ స్థాయి క్రికెట్ స్టేడియం



నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాణిక్ సర్కార్

అగర్తలా: భారత దేశంలో అత్యాధునికి వసతులతో రెండో అతిపెద్ద వరల్డ్ క్లాస్ క్రికెట్ స్టేడియంను త్రిపురలోని నర్సింగ్‌ఘర్‌లో నిర్మాణానికి ఆ రాష్ట్ర సిఎం మాణిక్‌సర్కార్ సోమవారం శంకుస్థాపన చేశారు. 25వేల మంది ప్రేక్షకులు వీక్షించే విధంగా రూ.200 కోట్ల వ్యయంతో ఈ స్టేడియంను నిర్మించనున్నారు. నిర్మాణ వ్యయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ), త్రిపుర క్రికెట్ అసోసియేషన్ 50 శాతం చొప్పున నిధులను వెచ్చించనున్నారు. నార్త్- ఈస్ట్ రాష్ట్రాల్లో ఈ స్టేడియంను అంతర్జాతీయ మ్యాచ్‌లను ధీటుగా నిర్వహించడానికి అనువుగా నిర్మించనున్నారు. త్రిపుర క్రికెట్ అసోసియేషన్ తీసుకున్న చొరవను మాణిక్ సర్కార్ అభినందించారు. యువ క్రికెటర్లను మరింత మందిని తీర్చిదిద్దడానికి ఈ స్టేడియం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ స్టేడియంకు అనుసంధానంగా ఏడు అంతస్తుల క్లబ్ హౌసెస్‌ను, లిఫ్ట్‌లు, అత్యాధునిక జిమ్నాజియం, ఎలక్ట్రానిక్ స్కోర్ బోర్డులను ఏర్పాటు చేస్తారు.

భారీ ప్రయోగాలు తప్పవు

టోర్నీల్లోను ఫిటెనెస్ పరీక్షలు

ప్రపంచకప్‌కు ముందస్తు ప్రణాళిక...కోహ్లీ



దంబుల్లా : శ్రీలంక వన్డే సిరీస్‌లోనే భారత్ జట్టులో భారీ ప్రయోగాలు చేయక తప్పట్లేదని కెప్టెన్ విరాట్ కోహ్లీ తెలిపాడు. 2019 ప్రపంచకప్ జట్టు కూర్పే లక్ష్యంగా ఈ ప్రయోగాలుంటాయని తొలి వన్డే విజయానంతరం విలేకరులకు తెలిపాడు. 24 నెలలు ముందే ప్రపంచకప్ జట్టు తయారీ కోసం ప్రత్యేక ప్రణాళిక రచించామని, ఇందులో భాగంగా సవాల్‌గా భారీ ప్రయోగాలను చేసి తీరతామన్నాడు. తొలి వన్డేలో శ్రీలంకపై 9 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించిన విషయం తెల్సిందే. ఈ మ్యాచ్‌లో రహానే, కులీదీప్‌ను బెంచ్‌కే పరిమితం చేసినా టీమిండియా ఎటువంటి తత్తరపాటుకు గురి కాలేదు. జట్టును బ్యాలెన్స్ చేస్తూనే ప్రయోగాలతో మార్పులకు శ్రీకారం చుడతామని కోహ్లీ వివరించాడు. ప్రపంచకప్‌కు జట్టును తీర్చిదిద్దే క్రమంలో సిరీస్ జరుగుతున్న సందర్భాల్లోను క్రికెటర్లకు రాండమ్‌గా ఫిటెనెస్ పరీక్షలను నిర్వహించనున్నట్లు టీమ్ కండీషినింగ్ కోచ్ శంకర్ బసు తెలిపారు. ప్రతీ ప్రాక్టీస్ సెషన్‌లోను కొందరు ఆటగాళ్ల(గ్రూప్ సభ్యులు) నిర్లక్ష్యంగా డుమ్మాకొట్టడవంపైన టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టి సారించింది. ఈ కోవలోకే యువరాజ్ సింగ్ డుమ్మా కొట్టినట్లు క్లియర్‌గా కనిపించడంతో అతన్ని శ్రీలంక పర్యటనకు ఎంపిక చేయలేదు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌ల్లోను క్రికెటర్లపై నిఘా వేయనున్నట్లు తెలుస్తోంది.

పనిచేస్తున్న చోటే వైద్యులు నివసించాలి

సిఎస్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైద్యులు పనిచేస్తున్న ప్రాంతంలోనే నివశించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడం సాధ్యమవుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఆయన సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ, క్షయ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మాతా,శిశు మరణాలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల్లో రక్త హీనత సమస్య అధికంగా ఉండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.



గిరిజన ప్రాంతాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సిఎస్ ఆదేశించారు. పిహెచ్‌సిలను జియో ట్యాగింగ్‌తో అనుసంధానం చేయాలని, అన్ని ఆసుపత్రులకు నిరంతరం విద్యుత్తు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభించిన 'చంద్రన్న సంచార వైద్యం' మంచి ఫలితాలిస్తోందన్నారు. పిపిపి విధానంలో చేపట్టిన ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాల కొండయ్య, కమిషనర్ సుజాత శర్మ, ఎపిఎంఎస్ఐడిసి ఎండి గోపినాథ్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ అరుణకుమారి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ దుర్గాప్రసాద్, ఔషద నియంత్రణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రజాశక్తి ఛాయాచిత్ర ప్రదర్శన



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

117వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టుల ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ప్రజాశక్తి ఎడిటర్ పాటూరు రామయ్య, ఎంబివికె కార్యదర్శి తులసీరావు ప్రారంభించారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ సిజిఎం ఎంవిఎస్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్ వెంకట్రావుఅడ్మిన్ మేనేజర్ జయరాం ప్రదర్శనను తిలకించి ఫొటో జర్నలిస్టులకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎడిటర్ రామయ్య మాట్లాడుతూ మంచి నైపుణ్యం, సృజనాత్మకతతోనే మంచి ఛాయా చిత్రాలు తీయగలరన్నారు. వెయ్యి పదాల ద్వారా తెలిపే సారాంశాన్ని ఒక మంచి ఫొటో ద్వారా పాఠకునికి తెలియజేయవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టులు తీసిన అద్భుత చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రకృతి అందాలు, ఆందోళనల చిత్రాలు, సాంస్కృతిక అంశాల చిత్రాలు సందర్శకుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి.


భారత నావికాదళ అడ్మిరల్ సునీల్‌లాంబకు స్వాగతం పలుకుతున్న తూర్పునావికాదళధిపతి హెచ్‌సిఎస్ బిస్త్

విశాఖకు సునీల్ లాంబ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

భారత నావికాదళ అడ్మిరల్ సునీల్‌లాంబ సోమవారం తూర్పునౌకాదళానికి విచ్చేశారు. ఆయనకు తూర్పునావికాదళధిపతి హెచ్‌సిఎస్ బిస్త్ ఘనంగా స్వాగతం పలికారు. తూర్పునౌకాదళం 1968లో ఏర్పడింది. ఈ సందర్భంగా 50 ఏళ్ల ఉత్సవాలు (గోల్డెన్ జూబ్లీ) నిర్వహిస్తోంది. నేషనల్ మెరిటైం పవర్ కాన్సెప్ట్స్, తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, రక్షణ తదితర అంశాలపై ఈ నెల 22, 23 తేదీల్లో సముద్రిక ఆడిటోరియంలో జరుగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావడానికి సునీల్ లాంబ విశాఖ విచ్చేశారు.

సుధా ఆగ్రోఫ్యాక్టరీలో పేలుడు

సుమారు రూ.కోటి ఆస్తి నష్టం

ప్రజాశక్తి-పెద్దాపురం

తూర్పుగోదావరి జిల్లాలోని సుధా ఆగ్రో ఫ్యాక్టరీలో నాలుగు హైడ్రోజన్ సిలిండర్లు లీకై పేలాయి. దీంతో ఫ్యాక్టరీలో మంటలు వ్యాపించి కొంతభాగం ధ్వంసమైంది. సుమారు రూ.కోటి ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. ఫైర్ పోలీసుల కథనం మేరకు.. పెద్దాపురం మునిసిపాలిటి పరిధిలోని సామర్లకోట రహదారిలో ఉన్న సుధా ఆగ్రో ఫ్యాక్టరీలో మొత్తం ఆరు ట్యాంకర్లు ఉండగా నాలుగు ట్యాంకర్లలో హైడ్రోజన్ లీకై ఈ మంటలు విస్తరించాయి. సుమారు 30 అడుగుల మేర పెద్దశబ్దంతో నాలుగు హైడ్రోజన్ ట్యాంకర్లు పేలిపోయాయి. ఈ పేలుడుకు ట్యాంకర్ల శిధిలాలు ఫ్యాక్టరీలోని వివిధ విభాగాల అద్దాలను, సమీపంలో ఉన్న కట్టడాలు, సామాగ్రి ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం సంభవించలేదు. సమాచారం అందుకున్న ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ డి.రాంబాబు, సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి మంటలు ఆర్పేశారు. అనంతరం ఆర్‌డిఒ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో 21 మంది సిబ్బంది పని చేస్తున్నారని, ఎవరూ గాయపడలేదని ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ లిఖితపూర్వకంగా తెలిపారన్నారు. ఈ ప్రమాదం వల్ల ఫ్యాక్టరీకి సుమారు రూ.కోటి నష్టం వాటిల్లి ఉండొచ్చని తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశామని, విచారణ జరుపుతున్నామని ఎస్ఐ కృష్ణ భగవాన్ చెప్పారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇసుక రీచ్‌ల వద్ద గట్టి భద్రతతోపాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో పలు అంశాలపై సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 406 ఇసుక రీచ్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పక్క రాష్ట్రాలకు ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేయాలని, వాహన యజమానులకు భారీ మొత్తంలో జరిమానాలు విధించాలన్నారు. తరలిస్తున్న వారి వివరాలు తెలియజేస్తే ప్రోత్సాహకాలివ్వాలన్నారు. ప్రతి రీచ్ దగ్గర ప్రభుత్వ అధికారిని నియమించాలని సూచించారు. మద్యం పాలసీ, విశాఖ భూ కుంభకోణం, కొత్తగా చేపట్టిన పట్టాల పంపిణీ, మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ పనితీరు, అన్న అమృత హస్తం పథకం అమలుతీరు, రైతు బజార్ల పనితీరు అంశాల సర్వే నివేదికలపై సిఎం సమీక్షించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68